తత్త్వమసి తత్త్వమ్

ఆంధ్ర వ్యాఖ్యాత బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథ శర్మ

శ్లో॥ నేతి నేత్యాది నిగమవచనేన నిపుణం
నిషిధ్య మూర్తామూర్త రాశిమ్।
యదశక్య నిహ్నవం స్వాత్మ రూపతయా
జానంతి కోవిదాస్తత్త్వమసి తత్త్వమ్॥

శంకరవిజయము సర్గ 10

తైత్తిరీయాది ఉపనిషత్తులయందు అఖండ సచ్చిదానంద రూపుడైన పరమేశ్వరుడు విధివాక్యములచేతను నిషేధవాక్యముల చేతను బోధింపబడును. బ్రహ్మ లక్షణమును బోధించు వాక్యములు బ్రహ్మ తటస్థలక్షణమును బోధించునవియు, బ్రహ్మ స్వరూప లక్షణమును బోధించునవియు యుండును అందు బ్రహ్మ తటస్థలక్షణము బోధించునవి శ్రు॥ "యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవంతి యత్ప్రయంత్యభి సంవిశంతి" దేనినుండి జగము జనించుచున్నదో, దేనియందు జగమున్నదో, దేనియందు జగము లయమగుచున్నదో యది బ్రహ్మమని బోధించువాక్యములు. బ్రహ్మ స్వరూప లక్షణమును బోధించు వాక్యములు విధి నిషేధ పరములు-అనగా బ్రహ్మలక్షణమును 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' 'విజ్ఞాన మానందం బ్రహ్మ చిద్ఘనఏవ' స్వరూపతః వర్ణించు వాక్యములు విధివాక్యములు. అందు బ్రహ్మ సత్యమైనది. దానిరూపమందు ఎప్పుడు ఏవిధమైన మార్పుగలుగదనియు, చిద్రూపమైనదియు. అపరిచ్ఛిన్నము (దేశము చేతను కాలముచేతను, వస్తు మార్పు చేతను) తెంపులేని దనియు నిరతిశయ సుఖరూపమైనది యనియు, ఘనీభవించిన ఏకరాశి యయిన చైతన్యమనియు బోధింపబడినది. నిషేధ వాక్యములనగా అతద్వ్యావృత్త పరవాక్యములు. అనగా బ్రహ్మ స్వరూపలక్షణమునకు వ్యతిరిక్తమైన వేరైన లక్షణమును నిషేధించు వాక్యములు. ఉపనిషత్తులయందు బ్రహ్మ స్వరూపబోధ నిషేధవాక్యము లనేకములుగలవు. వానిలో కొన్ని "శ్రు॥ అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథాఽరసం నిత్యమగంధ వచ్చయత్ (కఠ 1-3-15) అనగా బ్రహ్మ శబ్ద స్పర్శరూప రసగంధ రహితుడు. సర్వ జన కారణు డగుటచే ఆదిమధ్యాంతరహితుడనియు ముండకోపనిషత్ యందు "శ్రు॥ యత్తద్రేశ్య మగ్రాహ్యమ గోత్రమవర్ణ మచక్షుః శ్రోత్రం, తదపాణి పాదమ్' (1-1-6) బ్రహ్మ సకల మనోబుద్ధీంద్రియముల కగమ్యుడనియు కర్మేంద్రియముల కవిషయుడనియు స్థూలరూప శుక్లాది రూప రహితుడగుటచే చక్షుశ్శ్రోత్ర రహితుడు పాణిపాద రహితుడని. నిరవయుడని బోధింపబడినది. బృహదారణ్యకోపనిషత్ యందు 'సహో వాచైతద్వైతదక్షరంగార్గి బ్రాహ్మణాఽభివదంత్య స్థూలమనణ్వ హ్రస్వమదీర్ఘమలోహిత మస్నేహమచ్ఛాయ మతమోఽవాయ్వ నాకాశమనాసంగ మరస

మగంధ మచక్షుష్క మశ్రోత్ర మవాగమనోఽతేజస్క మప్రాణముఖమ మాత్ర మనంతర మబాహ్యం నతదశ్నాతి కించన నతదశ్నాతి కశ్చన" బ్రహ్మనాశన రహితమైన స్థూలము కంటె వేరై యది అణువుకాదు. హ్రస్వము కాదు దీర్ఘముకాదు పరిమాణవులు నిషేధింప బడినవి లోహజము (అగ్ని గుణము) కాదు నీళ్ల చే తడుపబడదు ఛాయగాదు తమముగాదు ఆవేశముగాదు సంగము గలిగినదికాదు తేజస్కము చక్షురింద్రియము శ్రోత్రేంద్రియము కలిగినది కాదు, ముఖము గలిగినదిగాదు రంధ్రములేనిది కొలవబడినది బయట లోపల తనములేనిదనియు అన్ని పరిచ్ఛిన్న భావములు, అవయములు గుణములు నిషేధించి చిద్ఘనమైనదని ప్రతిపాదింపబడినది. బృహదారణ్యకోపనిషత్ యందు "శ్రు॥అథాతా దేశో నేతి నేతి" (2-3-6, యనెడి వాక్యముచే సకల మూర్తా మూర్తా రాశి నిషేధింపబడెను మొదటి నకారముచే స్థూల సూక్ష్మ ప్రపంచమును రెండవ నకారముచే కారణ ప్రపంచము నిషేధింపబడెను లేక మొదటి నకారముచే స్థూలప్రపంచమైన తేజోబన్నాత్మకమైన మూర్త ప్రపంచమును రెండవ నకారముచే వాయ్వాకాశ శబ్ద స్పర్శరూప రసగంధాది సకల సూక్ష్మ ప్రపంచము నిషేధింపబడెను అమూర్త ప్రపంచ మైన రూపమైన వాయ్వాకాశముల సారము హిరణ్య గర్భుడనియు అతనినే సూర్యమండలము నధిష్ఠించియున్న సవిత సూర్యనారాయణుడనియు వచింపబడినది. ఆత్మోపాధియైన రక్తమాంస మజ్జా అస్థ్యాదియుతమైన పురుషుని శరీరము పంచభూత పరిణాత్మకమనియు, అమూర్తములయిన వాయ్వాకాశములు పురుషునిశరీరమున కాధారమైనప్రాణాకాశములనియు వాని సారభూతమైన హిరణ్యగర్భుడు చక్షురింద్రియము నధిష్ఠించియున్న సహితయనియు ప్రతిపాదింప బడినది. మూర్తా మూర్త భూతముల వాసనారూపమైన సూక్ష్మభూతములు శబ్ద స్పర్శ, రూప. రసగంధములు తత్కార్యములైన పంచజ్ఞానేంద్రియములు పంచ కర్మేంద్రియములు మనోబుద్ధి చిత్తాహంకార రూపమైన సూక్ష్మ శరీరము యివన్నియు ఇంద్రజాల తుల్యమైన పరమేశ్వరుని మాయచే సృజింపబడినవి. పరమేశ్వరుని స్వరూపము మాయచే సృజింపబడిన మూర్తా మూర్త ప్రపంచము, స్థూల సూక్ష్మ ప్రపంచములను నేతి నేత్యాదివాక్యములచే నిషేధించుటద్వారా తన్నిషేధావధియైన ప్రత్యక్చైతన్యము (ఆత్మ) గా ప్రతిపాదింపబడినది.

పూర్వపక్షము: ప్రకృతము బ్రహ్మరూపము మూర్తా మూర్త రూపముగా వినబడి సన్నిహితవస్తువును చెప్పెడి 'ఇతి' శబ్దములయందు నఞ్ శబ్దము ఉపయోగింపబడుటచే ఒక 'నఞ' శబ్దముచే మూర్తరూపమయిన బ్రహ్మయు రెండవ 'నఞ' శబ్దముచే అమూర్తరూపము యిన బ్రహ్మయు నిషేధింపబడుటచే నిషేధావధి లేనందునను,

అథవా ఒక నకారముచే జగము నిషేధింపబడి రెండవ నకారముచే బ్రహ్మ నిషేధింపబడిన యెడల శూన్యము శేషించును మరియు ప్రత్యక్ష సిద్ధమయిన రూపప్రపంచము నిషేధానర్హము.

సిద్ధాంతము : అటులకాదు 'అథాఽత ఆదేశో నేతి నేతి' యను శ్రుతియందు ప్రపంచ బ్రహ్మలు రెండును నిషేధింపబడుట లేదు. శ్రుతి ఉపక్రమణయందు 'బ్రహ్మ తే బ్రవాణి' యని బ్రహ్మను బోధించుచున్నాను అని పలికి శూన్యమునందు పర్యవసానము చేయుట అసంభవము. ఆత్మయొక్క ఉపాధి మాత్రము నిషేధింపబడుచున్నది. ఆరోపింపబడిన జగము నిషేధార్హముగాని జగదధిష్ఠానము నిషేధానర్హము. బ్రహ్మ అవిద్యాసిద్ధము కానందునను, వాఙ్మనస గోచరము గానందునను నిషేధింపబడుటకు శక్యముగాదు. వేదాంతములందు పరమ పురుషార్థము కొరకు బ్రహ్మయు ఉపదేశింపబడునుగాని పురుషార్థ రహితమైన శూన్యమునందు పర్యవసానము పొందుట యసంభవము. తైత్తిరీయాది ఉపనిషత్తులయందు 'బ్రహ్మ విదాప్నోతిపరం' 'సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ' "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" ఇత్యాది వాక్యములచే సద్రూపమైన బ్రహ్మసాక్షాత్కారముచే పరమ పురుషార్థమైన మోక్షము పొందబడుననియు, బ్రహ్మసచ్చిదానంద రూపమనియు, బ్రహ్మజాతి, క్రియ, గుణసంబంధ రహితుడైనందున వాఙ్మనసాతీతుడనియు ప్రతిపాదించి అకస్మాత్తుగా ఆరోపిత జగముతో పాటు బ్రహ్మమునుగూడ అపవాదముచేసి శూన్యమును బోధించుట నసంభవము కనుక నేతి నేత్యాది నిషేధపరమైన వాక్యములు బ్రహ్మకంటె వేరై ఉన్నది యని వ్యవహరింపబడుచు బ్రహ్మయందారోపింపబడిన జగమును నిషేధించు అపరోక్ష చైతన్య రూపమైన బ్రహ్మయందు పర్యవసానము బొందుచున్నవి. ప్రతిషేధావధియైన బ్రహ్మ నామ రూపములచే వ్యక్తము కానిదియు, ఇంద్రియములచే గ్రహింపబడినదియు, సర్వదృశ్యములకు సాక్షియయినందున గ్రహింపబడదు. ఇందులకు ప్రమాణములు 'నచక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా' (ముం 3-1-8) "యత్తదద్రేశ్యమగ్రాహ్యమ్" (ముం 1-1-6) 'యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనే' (తై 1-7-1) "అవ్యక్తోఽయమచింత్యోఽయమవికార్యోఽయముచ్యతే" (భగీ 2-25) ఇత్యాదులు ప్రమాణములు అయినను యోగులు సంరాధన కాలమందు ధ్యానసమాధులచే ఆత్మదర్శనమును చేసెదరు. శ్రీ శంకరభగవత్పాదుల వారు గీతాభాష్యమందు 'శాస్త్రాచార్యోపదేశ శమదమాది సంస్కృతం మనః ఆత్మదర్శనే కరణం' ఆచార్యునిచే బొందబడు వేదాంత శాస్త్రోపదేశము చేతను, అంతరింద్రియ, బహిరింద్రియ ఉపరతి మొదలగు యోగము చేతను సంస్కా

రము పొందిన మనస్సు ఆత్మదర్శనమునకు సాధనము అని వక్కాణించిరి. ఉపనిషచ్ఛాస్త్రమందు సాక్షాత్కారమునకు వేదాంత శ్రవణ మనన, నిదిధ్యాసలు 'ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః' యని వచింపబడినది జీవుని స్వాభావిక మయిన పరమాత్మ భావమును ప్రపంచ మిథ్యాత్వమును బోధించెడి 'స ఆత్మాతత్త్వమసి' 'ఆత్మైవేదగంసర్వం' 'నేహనానాస్తి కించన' ఇత్యాది వాక్యములను సద్గురువులచే బోధింపబడి సుశ్రుత్యర్థాను సంధానముచే శ్రద్ధా భక్తి పురస్సరముగా వినుట శ్రవణము. మనన మనగా వేదాంత వాక్యముల అర్థమును యుక్తులచే చింతించి తత్త్వమునందు నిశ్చయము పొందుట. తత్త్వమస్యాది వాక్యములందు తత్ త్వం పదార్థములను శోధించి తత్ పదార్థమును ఆరోపింపబడిన ప్రపంచాధిష్ఠానమైన నిష్క్రియ శుద్ధ బుద్ధ ముక్తస్వభావుడైన బ్రహ్మయనియు, మరల 'త్వం' పదార్థమునునేను జడములయిన పృథివిగాదు, జలమును కాదు అగ్నికాదు, వాయువుకాదు, ఆకాశముకాదు, దేహముకాదు, ఇంద్రియములుకాదు, ప్రాణాపాన వ్యానోదాన సమాన ప్రాణములుకాదు, జడములయిన మనోబుద్ధి చిత్తాహంకారములుకాదు అటులని సూక్ష్మభూతములయిన శబ్దస్పర్శరూపరస గంధాదులనుయందు అవిద్యచేఆరోపింపబడిన నిరాకరించి ఉపాధిని అట్లు నిరాకరించుటయందు నిరాకరించిన ఆత్మ నిరాకరింపబడలేదుగదా. కనుక నిరాకరణకు అధిష్ఠానమైన ఆత్మయే సాక్షిచైతన్యము బ్రహ్మయని యుక్తులచే నిశ్చయముపొందుట మననము. అటుల మననముచే సంస్కృతి పొందిన మనస్సుచే అసంగ చిద్రూపుడైన ఆత్మను అను సంధానము చేయుట యను నిధిధ్యాస యని చెప్పబడు సంప్రజ్ఞాత సమాధి అనగా నేను నిష్క్రియ శుద్ధముక్త స్వరూపుడైన బ్రహ్మను అని అంతఃకరణ వృత్తిప్రవాహముగా ధ్యానముచేయుట, ప్రణవార్థాను సంధాన పురస్సరముగా ప్రణవ జపము. దీనినే ప్రత్యక్ ప్రవణత యనియు శ్రుతులయందు 'తేధ్యాన యోగానుగతానుపశ్యన్ దేవాత్మ శక్తిం స్వగుణైర్నిగూఢమ్' యనియు చెప్పబడు అష్టాంగ యోగమందు చెప్పబడు ధ్యానము శ్రవణ మనన నిదిధ్యాసలచే అసంప్రజ్ఞాత సమాధియని చెప్పబడు ఆత్మసాక్షాత్కార రూపమైన ప్రజ్ఞ యేర్పడును. దీనినే శాస్త్రమందు విద్యయనియు ఈ విద్యచే అవిద్య తత్కార్యములయిన కర్మవాసన లన్నియు నశించి జీవన్ముక్తియు విదేహముక్తియు సిద్ధించుననియు బ్రహ్మవాదుల సిద్ధాంతము.

"తత్త్వమసి తత్త్వమ్"

శ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

శ్లో॥ ఖాద్యముద్పాద్య విశ్వమను ప్రవిశ్య
గూఢమన్న మయాది కోశతుషజాలె।
కవయో వివిచ్య యుక్త్యైవ ఘాతత్
యత్తండులవ దా దదతి తత్త్వమసి
తత్త్వమ్॥

శంకర విజయం సర్గ 10

ఆకాశాది భూతములను సృజించి ప్రపంచమును ప్రవేశించి అన్నమయాది కోశముల యందు గూఢముగా యున్న ఆత్మను అన్వేషించి జనులు బియ్యపు గింజలను తీయుటకు పొట్టును పరిహరించునటుల మేధావులయిన ముముక్షువులు అన్నమయాది పంచ కోశములను శ్రుతియుక్తులచే నిరాకరించి తన్నిషేధావధియయిన కేవలాత్మను బ్రహ్మ రూపముగా గ్రహించెదరు. ఇదియే తత్వమస్యాది మహావాక్య తత్త్వము.

ఈ శ్లోకము తైత్తిరీయ ఉపనిషత్ బ్రహ్మ వల్లీ యర్థమునకు సూత్రరూపముగానున్నది. తైత్తిరీయోపనిషత్ బ్రహ్మ వల్లీ ఉపక్రమణయందు 'బ్రహ్మ విదాప్నోతిపరం' (2-1) బ్రహ్మ సాక్షాత్కారము పొందిన పురుషుడు నిరతిశయ పురుషార్థమైన, జనన మరణ ప్రవాహ సంసారము నుండి విముక్తి పొందునని సూత్రీకరింపబడి బ్రహ్మ లక్షణము "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" యని వినబడినది. పరమేశ్వరుడు అంతఃకరణా పరోక్షముగా ఆత్మ యనియు పరోక్షముగా శాస్త్ర గమ్యాకారముచే బ్రహ్మయనియు వ్యవహరింపబడును. "బ్రహ్మ పరివృఢః సర్వతః" సర్వవ్యాపి యగుటచే బ్రహ్మయనియు 'బృహి-వృద్ధౌ' ధాతవుండి బృహత్వాత్ బ్రహ్మయనెడి వ్యుత్పత్తిచే నిరతిశయుడు గనుక బ్రహ్మ యనబడును. బ్రహ్మ లక్షణములయిన "సత్యం జ్ఞానం, అనంతం" యనెడి పదములు 'బ్రహ్మ' పదమునకు సమానాధికరణములయినందున 'నీలం, మహత్, సుగంధి. ఉత్పలం' యనెడి వాక్యమందువలె విశేషణములు. ఉత్పల విషయమై నీలాదులకంటె విలక్షణములైన ఎర్రని తెల్లని ఉత్పలము లుండవచ్చును. అటులనే అసత్యమైన బ్రహ్మ, జడమైనబ్రహ్మ, పరిచ్ఛిన్న బ్రహ్మలు వేరుగానుండవచ్చును. బ్రహ్మ ఏకమైనందున వ్యావర్తకములైన విశేషములు వ్యర్థములనిన నటులగాదు. 'సత్యం' 'జ్ఞానం' 'అనంతం' యనెడి విశేషణములు నీలాది ఉత్పల విశేషములకు విలక్షణములు, సత్యజ్ఞానానంతములు బ్రహ్మ లక్షణరూప విశేషణములైనందున సజాతీయమైన అనగా సచ్చిదానంత రూపమైన మరియొక బ్రహ్మలేదనియు, విజాతీయమైన

అనగా ఆవృతజడ పరిచ్ఛిన్నమైన బ్రహ్మయు లేదనియు, బ్రహ్మ అద్వితీయ అపరిచ్ఛిన్న స్వగతభేద రహితమై అవయవ రహితమై ఏకరూపమైనదని యర్థము బోధింపబడు చున్నది. ఏవస్తువు ఏరూపముగా నిశ్చయింపబడినదో యారూపము ఏప్పుడును మార్పు చెందకనుండుట సత్యమను లక్షణమునకు యర్థము. సర్వ జగదధిష్ఠానమైన బ్రహ్మయందు జగమారోపింపబడుటచే అపవాదముచే జగము ప్రవిలయము పొందును. బ్రహ్మ జ్ఞానముచే బాధింపబడును. గనుక మిథ్యా భూతమైనది బ్రహ్మ స్వతఃసిద్ధమై స్వమహిమచే నుండుటచే విలయము పొందక యథారూపముగా నుండుటచే సత్యమైనది. లోకములో జడములయిన మృత్తికాదులయందు జడములైన ఘటాదులు ఆరోపింపబడినటుల జడమైన బ్రహ్మయందు జడమైన ప్రపంచము ఆరోపింపబడునని శంకను నివర్తించుటకు బ్రహ్మ లక్షణము 'జ్ఞానం' చిద్రూపమైనదని వచింపబడినది. ఘటాది జగమును స్ఫురింపచేయు అంతఃకరణ వృత్తియు జ్ఞానమని లోక వ్యవహారము. ఘటాదికములు ఇంద్రియ గోచరమైనప్పుడు ఘటాది పదార్థాభివ్యాజ కాంతఃకరణ పరిణామము అంతఃకరణవృత్తి యనబడును. అంతఃకరణవృత్తి జన్యమైనందున జడమైనది పరిచ్ఛిన్నమైనది. అట్లుగాక బ్రహ్మ స్వాభావిక అపరిచ్ఛిన్న జ్ఞానరూపమైనది. పరిచ్ఛేదము త్రివిధము. దేశకృతము, కాలకృతము, వస్తుకృతము. ప్రపంచమునకు అధిష్ఠానమై సర్వగతమైన ఆకాశమునకు కారణమగుటచే బ్రహ్మ దేశకృత పరిచ్ఛేద రహితము. కాలము పరమాత్మనుండి ఉత్పన్నమగుటచే కాలము పరమాత్మాయత్తమైనందున బ్రహ్మ కాలముచే పరిచ్ఛిన్నుడుగాడు. సద్రూపమైన బ్రహ్మ సర్వ పదార్థ వ్యవహారమునందును "సన్ ఘటః, సన్ పటః, సతీపృథివీ, సన్ జలః" ఘటపటాది సకలభూత వ్యవహారమునందును సద్రూపుడై అనువర్తించుచు మారిపోవు చున్న. అన్ని పదార్థములందు సద్రూపముగా (ఉనికి రూపముగా)నున్నందున సర్వ జగదధిష్ఠానమైన బ్రహ్మ త్రివిధా పరిచ్ఛిన్నుడు. సత్యం, జ్ఞానం, అనంతం యనెడి పదములు అతద్వ్యావర్తకములైనందునను బ్రహ్మ ఉత్పలములవలె జగమునందు ప్రసిద్ధము కానందునను శూన్యమునందు పర్యవసానము పొందునని శంకింప బనిలేదు. బ్రహ్మ శూన్యమైన సత్యాదిలక్షణములు వ్యర్థములగును. వస్తుతః మరియొక బ్రహ్మ లేక పోయినను అవిద్యాదశయందు అనృత జడ పరిచ్ఛిన్నోపాధులచే కల్పింపబడు బ్రహ్మాంతరములను నిషేధించుచు బ్రహ్మసత్యజ్ఞానాంత లక్షణుడనుట ఉపపన్నము విజాతీయములైన అవృతజడ పరిచ్ఛిన్నములైన ఉపాధిలక్షణముల నిషేధించుచు బ్రహ్మసత్యాది లక్షణుడని బోధింపబడుచున్నది

సత్యత్వమనగా భాదా (విలయ) రాహిత్యము. సత్యత్వము త్రివిధము. ప్రాతిభాసిక

సత్యత్వము వ్యావహారిక సత్యత్వము, పరమార్థ సత్యత్వము శుక్తికయందు ఆరోపింపబడిన రజతము ప్రాతిభాసికసత్యము. అనగా వెండి కనుపించుటయేగాని ఉపయోగము లేదు. శుక్తిక జ్ఞానముచే విలయముపొందుటచే అసత్యము. పృథివ్యాది భూతములు శరీరాదులు లోకవ్యవహారమందువిలయరహితమైనందున వ్యవహార సత్యములు వేదాంతోత్పాదిత బ్రహ్మైకజ్ఞానముచే ప్రవిలయము పొందుటచే పరమార్థతః అసత్యములు. బ్రహ్మస్వతః సిద్ధమై సత్యచైతన్య జ్యోతిమై బ్రహ్మైకజ్ఞానముచే యథారూపముగా అనుభవింపబడుటచే పరమార్థ సత్యము బ్రహ్మయందు సత్యజ్ఞాన అనంత లక్షణాలు నొకదానిచే నొకటి నియమింపబడి వర్తించును. అనంతశబ్దము పరిచ్ఛిన్న ఘటపటాదులను భూతలములను వర్తించుచుపూర్ణత్వము ప్రతిపాదించును. శ్లో॥ నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః। యని శ్రీ కృష్ణునిచే పలుకబడినటుల సద్రూపమైన బ్రహ్మకు మిథ్యాత్వము నెప్పుడును గలుగదు. అసద్రూపమైన జగమునకు సత్యత్వము సిద్ధింపదు శ్రుతులయందు "కుతస్తు ఖలు సౌమ్యేయం స్యాదితిహోవాచ కీథమసతః సజ్జాయతే" (ఛాం 6-22) "అస్తీత్యేవ ఉపలబ్దవ్యః యని బ్రహ్మయొక్క పరమార్థ సత్యత్వము ప్రతిపాదింపబడినది. బ్రహ్మఅద్వయుడైన చిత్స్వరూపుడగుటచే అనంత చిద్ఘన స్వరూపుడని శ్రుతులచే ప్రతిపాదింపబడినవి.

సచ్చిదానంద స్వరూపుడయిన పరమేశ్వరుడు తన అచింత్య మాయాశక్తిచే జగమును సృష్టించెను. జగదుత్పత్తి కొరకు బ్రహ్మాధిష్ఠితమైన మాయకారణము. మాయయె జగదుపాదానముగా ప్రకృతియనియు బ్రహ్మజ్ఞానముచే విలయము పొందుటచే అవిద్యయనియు వచింపబడును. అవిద్య ఆత్మజ్ఞానముచే బాధింపబడుటచే సద్రూపముగాదు జగమునకు ఉపాదానమగుటచే శశీవిషాణము వలె అసద్రూపముగాదు. ఆత్మ సద్రూపమైనందున ఆత్మకుభిన్నముగాదు అభిన్నముగాదు విరుద్ధ స్వభావములు గనుక ఉభయాత్మకము గాదు. ఆదిరహితమై కారణావయవములు లేనందున సావయముగాదు. సావయములైన అంకురముల యొక్క కారణమైన బీజము నిరవయవము కానటుల సావయమైన జగమునకు కారణమైన అవిద్య నిరవయము గాదు. గనుకనే శ్లో॥ ప్రత్యేకం సదసత్వాభ్యాం విచార పదవీనయత్। హతెతదనిర్వాచ్యమాహుర్వేదాంత వేదినః అనాది భావ రూపయం యద్విజ్ఞానేన లీయతె। తదజ్ఞానమితి ప్రాజ్ఞాలక్షణం సంప్రచక్షతె॥ శు॥ తమ ఆశీత్ మయా అధ్యక్షేణ ప్రకృతిః సూయతె చరాచరమ్ "అజ్ఞానే నావృతం జ్ఞానం తెనముహ్యంతిజంతవః" ఇత్యాది శ్రుతిస్మృతుల చేతను. "మామహంనజానామి అని అజ్ఞుల అనుభవ వచనములచేతను అవిద్య భావరూపమైనది. బ్రహ్మాత్మైక్య జ్ఞానముచె విలయము పొందునని ప్రాజ్ఞులు వచించిరి. యుక్తులచే

సద్రూపముగా గాని అసద్రూపముగాని నిర్ణయింపబడదు గనుక అనిర్వచనీయము తత్వవేత్తలు శ్లో॥ ప్రపంచో యది విద్యేత నివర్తేత న సంశయః। మాయామాత్రమిదం ద్వైతం అద్వైతం పరమార్థతః'' ప్రపంచముండిన యెడల అవశ్యము నివర్తించును. ద్వైతము మాయామాత్రమైనందున తాత్త్వికముగా నివర్తించుటలేదు. అవిద్యను తత్కార్యమైన జగమును త్యజించుటచే సంసార విముక్తి గలుగునని వచించిరి.

బ్రహ్మ జగత్కారణుడగుటకు శ్రు॥ తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశస్సంభూతః "యతోవా ఇమానిభూతాని జాయంతే। యేన జాతాని జీవంతి యత్ప్రయత్యభి సంవిశంతి" తద్బ్రహ్మ "జన్మాద్యస్య యతః' ఇత్యాది శ్రుత్యుక్తులు ప్రమాణములు. పరమేశ్వరుడు జగమునకు నిమిత్త ఉపాదాన కారణమని యర్థము. (ఘటమునకు నిమిత్త కారణము కులాలుడు ఉపాదాన కారణము మృత్తిక) అటులనే పరమేశ్వరుడు ఉభయ కారణుడై జగమును సృజించి పాలించి లయము చేయును. పరమేశ్వరుడు తన అచింత్య శక్తిచే విశ్వమును సృజించి అంతర్యామియై పాలించును. సర్వాంతరమైన ఆత్మశాసనముచే సూర్యుడు, చంద్రుడు. ద్యుపృథివీ లోకములు వాని వ్యాపారమునందు వర్తించుచున్నవి. నిమిషముహూర్త అహోరాత్రాదులు వర్తించుచున్నవి. నదులు నిమ్నదేశములకు వాని స్థానములు దాటక ప్రవహించుచున్నవి. మనుష్యులు కర్మఫల దాతయైన ఈశ్వరుని స్తుతించుచున్నారు. దేవతలు పితరులు వారికివ్వబడు హవిస్సుచే వారికనుగతులగుచున్నారు.

సర్వజ్ఞుడైన పరమేశ్వరునిశక్తి పరాశక్తి అపరాశక్తియని ద్వివిధము. పరాశక్తియనగా పరమేశ్వరుని స్వరూపావ్యతిరిక్తమైన చైతన్యము. ఇది యే క్షేత్రజ్ఞ రూపమైనది. పరాశక్తియే శ్రుతి స్మృతులయందు సంవిట్, జ్ఞానము, చైతన్యము, దృష్టి, చిచ్ఛక్తి యని వచింపబడినది. అపరాశక్తియనగా కార్య ప్రపంచ రూపముగా పరిణమించెడి జడశక్తి. ప్రపంచ సృష్టికి పూర్వము ప్రళయావస్థయందు మాయ నామరూపాత్మక జగముగా అభివ్యక్తముగాక పరమేశ్వరుని యందు లీనలమై యుండును. పరమ శివరూపమత్యంత నిర్వికల్పమై మాయయు వికల్పరహితముగా నుండును. ప్రాణికర్మపరిపాకవశమునకొంచము వికల్పము పొంది చిన్మాత్రుడైన పరమేశ్వరుని ఆశ్రయముగా స్వీకరించును. చిన్మాత్రుడైన పరమేశ్వరుడు స్వతంత్రుడగుటచే ప్రాణి కర్మ పరతంత్రుడుగా గాక జీవుల విచిత్ర సుఖదుఃఖ భోగములను వారి కర్మ తారతమ్యములచే కర్మఫలము నొసంగుటకు సకల జగమును సృజించెను. పరమేశ్వరుడు సత్య సంకల్పుడగుటచే సర్వబ్రహ్మకల్పములందును సమానాకారమైన జగమును సృజిం

చును. పరమేశ్వరుడు లీలాకారణము చేతనే సృష్టియందు ప్రవర్తించునని బాదరాయణుడు "లోకవత్తు లీలాకైవల్యం" (బ్ర. సూ, 2-1-33) నందు నుడివెను. చిన్మాత్రాశ్రిత మాయ సృజింపబడు దృశ్యరూపముగను దర్శన రూపముగను ద్వివిధముగానగును. బీజము సలిల పవనాది సమాయోగమున అంకురావస్థ పొందునటుల ప్రాణి కర్మ పరిపాక వశమున మాయచే సృష్టి చేయబడు జగదంకురావస్థ పొందును. అట్లు పొందెడి మాయ అపరాశక్తి యనబడును. పరమేశ్వరుని సిసృక్షారూపమైన మాయావృత్తి 'ఈక్షణ' మనబడును. పరమేశ్వరుని స్వరూపమైన చైతన్యము మాయావృత్తియందును ప్రవేశముచే పరమేశ్వరుడు సృష్టి కారణుడగును. పరమేశ్వరుని ఈక్షణము కామ, తప. చికీర్షాది శబ్దములచే "శ్రు|| ఈక్షత. లోకాన్ను సృజా ఇతి" "సోఽకామయతా బహుస్యాం ప్రజాయేయేతి" "తపసా చీయతే బ్రహ్మ" ఇత్యాది శ్రుతులయందు వినబడినది.

పరమేశ్వరుడు ప్రపంచ సృష్టిని పర్యాలోచనముచేసి ప్రథమమున అవ్యక్తమును సృజించెను. తామసమును మోహ, మహామోహ తామిశ్ర, అంధతామిశ్రములను అనాత్మ యందాత్మ భ్రమ, రాగము విద్వేషములనునవి ప్రథమ సర్గము. అవి భాగాపన్నమైన తమమునుండి అంతర్విభాగములు గల్గి త్రిగుణాత్మకమైన సర్గము ద్వితీయము. సమష్టి సూక్ష్మశరీరాభిమానియైన హిరణ్యగర్భుడు వ్యష్టిజీవ అహంకారములు తృతీయ సర్గము. రజోగుణ ఉపసర్జనమైన తామసాహంకారమునుండి శబ్ద స్పర్శరూప రసగంధములనెడి పంచతన్మాత్రలు చతుర్థ సర్గము. రజోగుణోపసర్జనమైన సాత్వికాహంకారముచే పంచమ సర్గమైన జ్ఞానేంద్రియ అంతఃకరణములు సృజింపబడినవి. రజోగుణాంశచే కర్మేంద్రియ ప్రాణములు సృజింపబడినవి. అంతట హిరణ్యగర్భులు స్థూలభూతములను సాత్విక, రాజస, తామస భేదములచే సృజించెను అతడు ప్రథమమున పంచ తన్మాత్రలను నొక్కొక్క దానిని రెండు సమాన భాగములుగా చేసి ఒక్కొక్క అర్థభాగమును వదలి శేషించిన అర్థభాగములను నాల్గు సమాన భాగములుగ విభజించెను. ఒక్కొక్క తన్మాత్ర అంశలను మిగిలిన తన్మాత్రయందు మేళనము చేసెను. అనగా శబ్ద తన్మాత్రను రెండు సమాన భాగములుగా జేసి ఒక భాగమును వదలి రెండవ భాగమును నాల్గు అంశలుగాజేసి యా నాల్గు అంశలను స్పర్శ, రూప, రస, గంధముల అర్థ భాగములందు మేళనము జేసెను. అటులనే అన్ని భూతములును పంచ తన్మాత్రల మేళనముచే స్థూలమై ఆకాశాది భూత పంచకమగును. ఇవి పంచీకృత మహాభూతములు. పంచభూతములలో నొక్కొక్క దానియందు మిగిలిన భూతాంశలున్నను తన్మాత్ర

విశేషముచే పృథ్వ్యాది భూత వ్యవహారము కల్గుచున్నదని బాదరాయణునిచే "వైశేష్యాత్తు తద్వాదస్తద్వాదః" (బ్ర. సూ. 2-4-22) యని సూత్రీకరింపబడినది. పంచ తన్మాత్ర సమ్మేళనముచే ఆకాశాది భూతసృష్టి పంచీకరణ మనబడును. తైత్తిరీయోపనిషత్ యందు "శ్రు॥ తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సంభూతః ఆకాశాద్వాయుః వాయో రగ్నిః అగ్నే రాపః అద్భ్యః పృథివీ" (తై 2-1) యని బ్రహ్మనుండి ప్రథమమున ఆకాశ ముత్పన్న మైనటులను చాందోగ్యోపనిషత్ యందు తేజో భిన్నములు (అగ్ని, జలము పృధివి) సృజింపబడినటుల వినబడును.

అపంచీ కృత సూక్ష్మ భూతములనుండి పంచీకృత స్థూల భూతములు సృజింపబడినవని "తేజో త స్తదాహ్యాహ" (బ్ర. సూ. 2-3-10) నందు బాదరాయణుడు వివేచించెను. ఛాందోగ్యోపనిషత్తు యందు "శ్రు॥ తాసాంత్రి వృత్తం త్రివృత్త మెంకైకాంకరవాణి" (6-3-13) యనెడి, శ్రుతి చే ప్రతిపాదింప బడిన త్రివృత్కరణము పంచీకరణ ఉపలక్షణమే యగును. తమోగుణ యుక్త ములైన పంచీకృత భూతములనుండి భూః భువః సువః మహః, జనః తపః సత్యలోకములనెడి సప్త ఊర్ధ్వ లోకములును అతల, వితల, సుతల తలాతల రసాతల మహాతల పాతాళ లోకములనెడి సప్త అధోలోకములును లోకపాలురును యాలోకముల నుండెడి జరాయుజ అండజ స్వేదజ ఉద్భిజము లనెడి చతుర్విధములైన ప్రాణి స్థూలశరీరములును. పరమేశ్వరుడు సృజించెను. జరాయుజములనగా జరాయువుల నుండి ఉద్భవించెడు మనుష్య పశ్వాది శరీరములు. అండజములనగా అండములనుండి ఉద్భవించెడు పక్షిపన్నగాది శరీరములు. స్వేదజములనగా మశకములు మొదలైనవి. ఉద్భిజములనగా వృక్షాదులు. దేవాది శరీరములు కేవల పుణ్యకర్మల చేతను మనుష్య శరీరములు పుణ్యపాపమిశ్రకర్మలచేతను తిర్యగ్గాది శరీరములు పాపోత్కర్షత చేతను ఉద్భవించెను.

(సశేషము)

సవరణ : గతమాసపత్రికలో తప్పుగా ప్రకటించిన రిజిష్ట్రేను నెంబరును యీ పత్రికలో సరిదిద్దబడినది.

—వ్యవస్థాపకులు

"తత్త్వమసి తత్త్వమ్"

శ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

శ్లో॥ (ఖాద్యముద్వాద్య) విశ్వమను ప్రవిశ్య
గూఢమన్న మయాది కోశతుషజాలే
శవయో వివిచ్యయుక్త్యవఘాతతో
యత్తండుల వదాదతి తత్త్వమసి తత్త్వమ్.

(వివరణము గత సంచిక శేషము)

పరమేశ్వరుడు తన అచింత్య శక్తియగు మాయచే జగమును సృజించి దానియందు అనుప్రవేశము చేసెనని "శ్రు॥ తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్" యని వినబడుచున్నది. ప్రవేశించుట మృత్తిక ఘటశరావాదుల యందు చూర్ణరూపముగా ప్రవేశించినటులనా? గృహము వెలుపలనున్న పురుషుడు గృహములోనికి ప్రవేశించునటులనా? లేక పురుషుని నొక అవయవము మరియొక అవయవములో ప్రవేశింపచేయునటుల (వ్రే)ళ్ళు నోటిలో ప్రవేశించునటుల)నా? బ్రహ్మనిరవయుడైనందున మృత్తిక చూర్ణములవలె ప్రవేశము లేదు. సర్వ వ్యాపకుడైనందున బాహ్యాభ్యంతరము లేనందున గృహ ప్రవేశమువలె ప్రవేశము లేదు. బ్రహ్మ అవయవ రహితుడైనందునను చైతన్యమే స్వరూపమైనందున నొక అవయవము మరియొక యవయవమునందు ప్రవేశము లేదు. అటులయిన అనుప్రవేశ శ్రుతి అర్థరహితమా? కాదు. అనుప్రవేశమనగా పరమేశ్వరుడు సంకల్ప మాత్రమున సృజించిన జగమునందు స్ఫూర్తి రూపముగా ప్రవేశించి సర్వజగమును ప్రకాశింప చేయుచున్నాడని యర్థము. బ్రహ్మవల్లీ ప్రారంభమున "యో వేద నిహితం గుహాయామ్ పరమే వ్యోమన్" యని వినబడుచున్నది. అనగా జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయరూపమైన త్రిపుటియనుబుద్ధి గుహయందు కేవల జ్ఞానరూపుడైన ఆత్మను తెలుసుకొనవలెననియు బుద్ధి గుహయందున్న ఆత్మయే ప్రకృతియైన అవ్యాకృతమునందు గూఢముగానున్న సచ్చిదానంద బ్రహ్మయనియు సమానాధి కరణముచే బోధింపబడుచున్నది. ఇంకను తైత్తిరీయ శ్రుతియందు "శ్రు॥ అస్మాల్లోకాత్ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముప సంక్రామతి। ఏతం ప్రాణమయమాత్మానముప సంక్రామతి। ఏతం మనోమయమాత్మాన ముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయ మాత్మానముప సంక్రామతి। ఏతమానంద మయమాత్మాన ముప సంక్రామతి" బ్రహ్మ విదుడు దృష్టాదృష్టఇష్ట విషయసముదాయమునునిర పేక్షించి సర్వస్థూల భూతములను అన్నమయకోశముగా దర్శించి,సర్వప్రాణములనుకర్మేంద్రియములను ప్రాణమయ కోశముగా దర్శించి, సర్వమనస్సులను మనోమయకోశముగా దర్శించి, సర్వబుద్ధులను జ్ఞానేంద్రియములను విజ్ఞానమయ కోశముదర్శించి, సర్వ విషయానందములను అవిద్యను ఆనందమయ కోశముగా దర్శించి

సర్వ జగదధిష్ఠానమైన బ్రహ్మను అంతఃకరణ వృత్తులకు సాక్షియైన ఆత్మకు అభిన్నముగా దర్శించునని అన్నమయాది కోశములందు ఉపసంక్రమణ పూర్వకముగా బ్రహ్మదర్శనము వినబడుటచే జగమునందు బ్రహ్మప్రవేశము ఔపచారికముగా అను ప్రవేశ శబ్దముచే వినబడినది.

పంచకోశ వివేచనము

తైత్తిరీయోపనిషత్ యందు ఆత్మోపాధి పంచకోశములుగా విమర్శింపబడినది. "శ్రు॥ తస్మాద్వా ఏతస్మాదాత్మనః ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నం। అన్నాత్పురుషః" యని ఆత్మోపాధి సృష్టిక్రమమును చెప్పబడి అన్నమయాది పంచకోశములు విమర్శింపబడినది. ప్రథమము "శ్రు॥ సవా ఏష పురుషోఽన్నరసమయః। తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా" అన్న వికారమైన పురుషుని దేహము అన్నమయ కోశము పక్షియాకారముగా వర్ణింపబడినది. అన్నమయుని శిరము ప్రసిద్ధమయిన శిరము (తల) దక్షిణ పక్షము దక్షిణబాహువు. ఉత్తర పక్షము ఉత్తరబాహువు శరీరమధ్య భాగము ఆత్మ. నాభ్యధోభాగము పుచ్ఛము నిలుచుండుటకు ఆధారము. అవిద్యచే బాహ్య పదార్థములైన పుత్రాదులను నేను యని గౌణ ప్రత్యయముచే వ్యవహరింపబడుటచే వానిని నివర్తించుచు ప్రథమమున స్థూలశరీరమే పురుషుడని వర్ణింపబడినది.

ద్వితీయకోశము ప్రాణమయ కోశము. "శ్రు॥ తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః తేనైష పూర్ణః। సవా ఏష పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రాణ ఏవ శిరః వ్యానో దక్షిణః పక్షః। అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తస్యైష ఏవ శరీర ఆత్మా యః పూర్వస్య" అన్నమయుని కంటె అన్యుడు అంతరమునను్న ప్రాణమయుడు. ప్రాణవాయువు అతని శిరము. వ్యాన వాయువు దక్షిణపక్షము. అపానవాయువు ఉత్తరపక్షము. మధ్యభాగము సమాన వాయువు. పుచ్ఛము పృథివీ దేవత. శరీరము బరువుచే క్రింద పడకయు తేలికదనముచే పైకి ఎగరక యుండుటకును పృథివీదేవత ఆధారము. ప్రాణమయకోశము పంచప్రాణములు. కర్మేంద్రియములు (వాక్పాణిపాద పాయూపస్థలు). అన్నమయ కోశమునకు అంతరమునయున్న ప్రాణమయుడు అన్నమయుని ఆకారముగానుండును. ప్రాణమయుడు అన్నమయునకు ఆత్మయని భావము తృతీయ కోశము. మనోమయకోశము. "శ్రు॥ తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్। అన్యోఽన్తర ఆత్మా మనోమయః। తేనైష పూర్ణః। సవా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్।

అన్వయం పురుషవిధః। తస్యయజురేవశిరః। ఋగ్దక్షిణపక్షః। సామోత్తరపక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛంప్రతిష్ఠా। తస్యైషఏవశారీరఆత్మా। యః పూర్వస్య" ప్రాణమయున కన్యుడైన పురుషుడు ప్రాణమయున కంతరమునను్న మనోమయుడు. అతడు ప్రాణమయుని నిండియుండి వానియాకారమునను్డును. మనోమయుని శిరము దేవతలకు హవిస్సులనిచ్చెడి యజుర్వేద మంత్రభాగము, ఋగ్వేదము దక్షిణపక్షము. సామవేదము ఉత్తరపక్షము. సామవేదమందలి బ్రాహ్మణము ఆత్మ అథర్వణవేదమందలి అంగిరసునిచే దర్శింపబడిన మంత్రభాగము శాంతి పౌష్టికాది ప్రతిష్ఠాహేతుకర్మ ప్రధానమైనందున మనోమయుని పుచ్ఛము. మనోమయుడు ప్రాణమయుని ఆత్మ. పరమేశ్వరుని సంకల్పము వేదమగుటచే పరమేశ్వరు ఆత్మాభిన్నుడగుటచే మనోమయకోశము వేదమంత్రాత్మకముగా వర్ణింపబడినది. సంకల్ప వికల్పాత్మకమైన జీవుని మనస్సు మనస్సుయందు ఆవర్తిచేయబడుటచే మంత్రములు మనోమయకోశము. చతుర్థ కోశము విజ్ఞానమయకోశము "శ్రు॥ తస్మాద్వాఏతస్మాన్మనోమయాత్। అన్యోఽంతర ఆత్మా విజ్ఞానమయః। తేనైషపూర్ణః। సవా ఏషపురుషవిధఏవ। తస్యపురుష విధతామ్। అన్వయాపురుషవిధః తస్యశ్రద్ధేవశిరః। ఋతం దక్షిణఃపక్షః। సత్యముత్తరఃపక్షః। మహః పుచ్ఛంప్రతిష్ఠా। తస్యైషఏవశారీర ఆత్మా యః పూర్వస్య। మనోమయుని అంతరమునను్న విజ్ఞానమయుడు ఆత్మ. అతడు మనోమయునినిండిపురుషాకారమునను్డును. విజ్ఞానమయుని శిరము శ్రద్ధ. దక్షిణపక్షము ఋజుభానము. ఉత్తరపక్షము యథార్థభాషణము. యోగము (చిత్తసమాధానము) ఆత్మ, సర్వజీవులకు కారణమైన మహత్త్వము (హిరణ్యగర్భుడు) పుచ్ఛము. క్రియాశక్త్యాత్మక ప్రాణమయునకంటె వేదాత్మకుడైన మనోమయుడు శ్రేష్ఠుడు. మనోమయునికంటె వేదార్థనిశ్చయాత్మక విజ్ఞానముచే శాస్త్రోక్తకర్మ లాచింపబడుటచే విజ్ఞానమయుడు శ్రేష్ఠుడు. మనోమయ కోశమున కంతరమై మనోమయ కోశాకారము గలిగి యుండును. బుద్ధి, జ్ఞానేంద్రియములు (త్వక్। చక్షు, శ్రోత్ర జిహ్వా, ఘ్రాణములు విజ్ఞానమయకోశము.

పంచమ కోశము ఆనందమయ కోశము "శ్రు॥ తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽంతరాత్మాఽనందమయః। తేనైష పూర్ణః। సవాపురుష విధఏవ। తస్యపురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రియమేవశిరః। మోదోదక్షిణః పక్షః। ప్రమోదఉత్తరః పక్షః। ఆనందఆత్మా। బ్రహ్మపుచ్ఛంప్రతిష్ఠా॥" విజ్ఞానమయునకంతరుడై అన్యుడైన పురుషుడు ఆనందమయుడు. ఆనందమయునిచే విజ్ఞానమయుడు నిండియుండును. ఆనందమయుడు విజ్ఞానమయుని ఆకారమున నుండును. ఆనందమయుని శిరము

పుత్రాది ప్రియదర్శనముచే గలిగెడి మోదము. ప్రియవస్తు లాభముచే గల్గెడి హర్షము దక్షిణపక్షము. ప్రకర్షమైన హర్షము ఉత్తరపక్షము. ఇష్టవస్తు దర్శన ప్రాప్త్యాదులచే జనించు విషయానందము ఆత్మ. ఇష్టవస్తు ప్రాప్తిచే అంతఃకరణము శాంతిపొంది బహిర్ముఖముఖమై అంతఃకరణ వృత్తులయందు నిరతిశయానంద స్వరూపుడగు ఆత్మ ప్రతిబింబముచే విషయసుఖము జనించును. విషయసుఖము ఆనందమయ కోశము. ఈఆనందము జాగ్రతావస్థయందు ప్రియవస్తు ప్రాప్తిచేతను సుషుప్తియందు స్వాభావికముగను గలుగును. సుషుప్త్యవస్థ యందనుభవింపబడెడి యానందము బ్రహ్మానందమైనను అవిద్యాత్మకమైన జాగ్రత స్వప్నావస్థలకు బీజమై అవిద్యాత్మకమైనందున ఆనందకోశమని చెప్పబడుచున్నది. కనుక అన్నమయ కోశము స్థూల శరీరము. ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ కోశములు జీవుని సూక్ష్మశరీరము. ఆనందమయ కోశము జీవుని అవిద్య కారణ శరీరము.

పంచకోశ నిరాకరణము

స్థూల శరీరము అన్న వికారమై అన్నముచే పుట్టుట (అన్నసారమైన శుక్రశోణిత పరిణామము) అన్నముచే వృద్ధిపొందుట అన్నములేక నశించుట చేతను, పుట్టుట, ఉండుట. పరిణమించుట, వృద్ధిపొందుట క్షీణించుట, నశించుటయను షడ్వికారములు గలిగియుండుటచేతను బాల్యాది అవస్థలు గలిగియుండుటచేతను, మలమూత్ర రక్త మాంసాది అశుచియైన పదార్థములురాశి యగుటచేతను, ఘటాదులవలె దృశ్యమగుటచేతను, తద్విలక్షణుడైన నిత్యజ్ఞానరూపుడైన ఆత్మ కానేరదు. ఆత్మ అహం ప్రత్యయ గోచరుడై అపరోక్షుడైనందునను, దేహము ఇదం ప్రత్యయ గోచరమై పరోక్షమైనదగుట చేతను స్థూలశరీరము ఆత్మ కానేరదు. స్థూలశరీరము 'నేను' 'నాది' యను భ్రాంతియే మహాపిశాచము. ఈపిశాచము నొదిలిన పురుషుడు శీఘ్రముగా తరించును.

ఇంద్రియములు శబ్దాది భూతకార్యములగుటచేతను దేహమందు వాని స్థానములందు దిగాది దేవతాధిష్ఠితములై బాహ్య శబ్దాది విషయ వ్యంజకములగుటచేతను యింద్రియముల పాటవాపాటవములను జీవుడు తెలిసికొనుటచేతను జడములై పరాగ్భూతములైన యింద్రియములు ఆత్మకానేరవు. ఒక్కొక్క యింద్రియ మాత్మయయిన యెడల బహుస్వామిత్వముచే దేహము నశించును. ఇంద్రియ సముదాయ మాత్మయయిన యెడల ఆత్మ అవయవములు గల్గియుండుటచే అవయవాపచయముచే నశించును. గనుక ఇంద్రియము లాత్మకావు.

ప్రాణము పంచవృత్త్యాత్మకముగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులుగా వ్యవహరింపబడును. ప్రాణాది వాయు

(తరువాయి 29 వ పేజీలో)

"తత్త్వమసి తత్త్వమ్"

శ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

శ్లో॥ విషమ విషయేషు సంచారిణోऽత్రాశ్వాన్
దోషదర్శన కశాభిఘాతతః।
స్వైరం సన్నివర్త్య స్వాంత రశ్మిభిర్ధరా
బధ్నంతి యత్ర తత్త్వమసి తత్త్వమ్॥

(శంకర విజయ సర్గ-10)

విషమ ప్రదేశములకు స్వేచ్ఛగా సంచరించు రథాశ్వములను కొలచే కొట్టి పగ్గముల బిగియబట్టి గమ్యప్రదేశమును నిపుణుడగు సారథి గలిగిన రథికుడు పొందునట్లుల, ధీరులైన పురుషుల విషయములందు ప్రవర్తించెడి ఇంద్రియములను విషయముల యందు దోషదర్శన, యోగములచే నిగ్రహించి మనో నిగ్రహముచే శుద్ధమై సూక్ష్మమైన బుద్ధిచే గమ్యస్థానమైన పరమాత్మ తత్త్వమును పొందెదరు.

ఓం నమో భగవతే వైవస్వతాయ మృత్యవే బ్రహ్మవిద్యాచార్య యనచికేతసేచ॥

ఈ శ్లోకము సర్వజ్ఞుండును భగవంతుడగు శ్రీ యమునిచే నచికేతసుడను ముని కుమారునకు బ్రహ్మ తత్త్వమును ఉపదేశింపబడిన కఠోపనిషత్ యందు ప్రథమ అధ్యాయ తృతీయవల్లీ సారమును బోధించుచున్నది.

పూర్వము వాజశ్రవసుడను బ్రాహ్మణుడు విశ్వజిద్యాగమును ఫలాకాంక్షియై చేసెను. "శ్రు॥ విశ్వజితాయజేత" యను శ్రుతియందు ఫలము వినబడక పోయినను 'సస్వర్గస్యాత్ సర్వావ శిష్టత్వాత్' యను జైమిని సూత్రముచే విశ్వజిద్యాగఫలము స్వర్గము. వాజశ్రవసుడు యజ్ఞమునందు సర్వస్వదానమును చేసెను. అతనికి నచికేతనుడను పుత్రుడుండెను. వాజశ్రవసుడు యజ్ఞమునందు శుష్కించిన గోవులను, ముదుసలిని ప్రసవించుట కసమర్థములైన గోవులను ఋత్విజులకు దక్షిణగా నొసంగెను. నచికేతసుడు దానిని సహింపక తండ్రిని ఆక్షేపించి నన్ను ఎవరికి దానమిచ్చెదవని పలికెను. తండ్రి కుపితుడై నచికేతసుని వైవస్వతున కర్పించెను. నచికేతసుడు యమలోకమునకు వెళ్ళి వైవస్వతుని గృహము ముందట మూడు రోజులు వేచియుండెను. యముడు గృహమందు లేమిచే అతడు ఆతిథ్యమివ్వబడలేదు. తరువాత శ్రీ యముడు గృహమునకు వచ్చి నచికేతసుని చూచి పరితాపము పొందెను. శ్రుతిస్మృతులయందు పరమేశ్వర రూపుడైన అతిథిని నిరాకరించుట చాలదోషమని చెప్పబడుటచే యముడు నచికేసునియందు ప్రీతి చేయుటకై యాముని కుమారునకు మూడు వరముల నొసంగెను. మొదటి వరముచే వాజశ్రవసుడు తన కుమారుని యందు పూర్వమువలె ప్రేమయు శాంతమును గలిగి మరల యమలోకమునుండి తిరిగివచ్చు కుమారుని చూచుచు భాగ్యమును ప్రసా

16

దించెను. రెండవ వరముచే స్వర్గసాధనమైన చయన ముపదేశించెను. యముడు అగ్ని చయనము నందు ఎన్ని ఇష్టములచే (ఇటుకలచే) చయనము చేయవలయునో, యా చయన విధానమును ఉపదేశించి మరియొక వరము అగ్ని చయనమునకు నచికేతస చయన మని నామముడివి నాచికేత చయనానుష్ఠానము చేతను దేవతాజ్ఞానము చేతను విరాజభావమ్మును పొందెదరని ప్రసాదించెను. శయముడు నచికేతసునకు రెండువరములచే ప్రసాదించినవి కర్మ ఉపాసన రూపములగుటచే, కర్మోపాసనచే నిరతిశయ సుఖమగు బ్రహ్మ పొందబడనిదగుటచే, కర్మోపాసన జనిత స్వర్గాదిలోక సుఖములు అనిత్యములై పునరావర్తి గలుగచేయునవగుటచే నిత్యమై నిరతిశయమై జనన మరణ రహితమైన బ్రహ్మను పొందజేయు బ్రహ్మాత్మైక్య జ్ఞానమును తదంతరంగికమైన యోగమును బోధించుటకు నచికేతసునియందు అనుగ్రహముచే తృతీయ వరమును. ప్రసాదించెను యముడు నచికేతసుని బుద్ధి పారిశుద్ధ్యమును పరీక్షించుటకై మూడవ వరముగాను దీర్ఘాయుర్దాయము, పుత్ర పౌత్రాది సంపద, పశువులు, అశ్వములు సమస్తరాజ్యాది భోగములను కోరుకొను మనెను. ఆత్మవిద్య విషయమై దేవతలు పండితులు కూడ ఆత్మవిజ్ఞానము బహు సూక్ష్మమైన దగుటచే సంశయములు పొందుచున్నారని అనేకులు వేదాంత శ్రవణము చేసియు ఆత్మసాక్షాత్కారము పొందక విఫలులగు చున్నారనియు దృష్టఫలములను కోరుమనెను. కాని శ్రీ నచికేతసుకు శ్రీ యముని వాక్యములకు చలించక మోక్షసాధనమైన బ్రహ్మవిద్య నుపదేశింపమని ప్రార్థించెను.

(సశేషము)

(29 వ పేజీ తరువాయి)

కుచు కుమారిలుని పాదములపై బడి నన్ను శిష్యునిగా స్వీకరింపుడని ప్రార్థించెను. ఓడిన వారిని యంత్రశిలలపై ద్రోయించి చంపుడని రాజాజ్ఞాపింప భటులుతోడనే జగమునంగల నాస్తికుల వెదకి వెదకి మడయించిరి. కుమారిలుని విజయమే హిందూధర్మ దిగ్విజయమాయెను.

30

యయా
రాజ న
వచ్చెను.
బౌద్ధమ
వారి న
కుమారి
కుమారి
వాడమె
రాజుతో
మాత్రివ
యని ల
చిరి. ల
దూకి
మహిమ
కుమారిల
న్నత పం
కపణచే
ధీరముగా
దేహుడై
మాన్యవ
వలెను?
తురా?"
అంతటవా
మంత్రిశ
గాని వే
దుల కా
"ఇంతకం
మాటలు
రించి మ

"తత్త్వమసి తత్త్వమ్"

శ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

వైవస్వతుడు నచికేతసుని విరాగ ముముక్షుత్వములకు సంతసించి ధర్మాధర్మముల కతీతమైనదియు, కాలత్రయా బాధ్యమైనదియు, సర్వ వేదములకు సారభూతమైనదియు, బ్రహ్మచర్యాది సర్వతపో ఫలమైనదియు, ప్రణవార్థమును, ప్రణవమును ఆలంబనముగా ధ్యాన మథనముచే యోగులు పొందునదియు హృదయ పుండరీకాకాశమును, పుట్టుట మొదలగు షడ్వికారములు లేనిదియు జనన మరణములు, క్షుత్పిపాసలు, హర్ష శోకములను షడూర్మి రహితమైనదియు సూక్ష్మాతి సూక్ష్మమై, శరీర ఇంద్రియాది అనాత్మ ప్రపంచమునకు ఎప్పుడును నంటక ఏమియు సంబంధము లేక నిష్క్రియ శుద్ధ బుద్ధ ముక్త స్వరూపమైనదియు ఆచార్యోపదేశ శమ దమాదులచే సూక్ష్మమైన శుద్ధమైన బుద్ధి చేతను, పరమేశ్వరానుగ్రహముచే పొంద బడునదియు, బహుశ్రవణం చేసినను లభింపక నిష్కామ ఈశ్వర ప్రణిధానముచే బొందబడునదియు, బ్రహ్మజ్ఞానముచే సర్వ ప్రపంచము సర్వభేదములు విలయము పొందునట్టి తత్త్వమస్యాది మహా వాక్యార్థ తత్త్వమైన అఖండ సచ్చిదానంద బ్రహ్మమును బోధించెను.

శరీరమందు చేతనులైన జీవ, బ్రహ్మలు నీడ, ఎండలవలె విరుద్ధ లక్షణములుగలిగి సంసారసహిత, సంసార రహితులై, బాహ్యాకాశముకంటె వేరై ఉత్కృష్టమై బ్రహ్మోపలబ్ధిస్థానమైన హృదయాకాశమునందు ప్రవేశించి యుండిరి. వారిలో జీవుడు కర్మఫలముల ననుభవించును బ్రహ్మ కర్మఫలముల ననుభవింపనిసాక్షి చిన్మాత్రుడు. శ్రౌతస్మార్తకర్మనిష్ఠలు జీవభావమును ఆశ్రయించిన వారు బ్రహ్మవిదులు సాక్షిచిన్మాత్రుడగుబ్రహ్మను ఆశ్రయించిన వారు కనుక ఆ విద్యా, విద్యల లక్షణము ప్రకటమైనది.

"శ్రు॥ ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవచ ఇంద్రియాణి హయానాహుర్విషయాం స్తేషుగోచరాన్ ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహుర్మనీషిణః" విద్యా విద్యలకు (కర్మ, జ్ఞానములకు) అధికారియైన సంసారియైన జీవుడు జనన మరణ సంసారము పొందుటకు, కర్మబంధవిముక్తి బొందుటకు శరీరమును అధిష్టించెను. జీవుడు రథికుడు (రథస్వామి) శరీరము. రథము శరీరమును నడిపించుటకు ప్రధానమైన బుద్ధియే రథమును నిపుణముగా నడిపించుసారథి. దేహకర్తవ్యమైన సర్వమును నిశ్చయాత్మక మయిన బుద్ధి కర్తవ్యము సంకల్ప వికల్పాది లక్షణము గలిగిన మనస్సు పగ్గములచేత పట్టుకొనబడిన గుఱ్ఱములు ప్రవర్తించును అటులనె మన

స్సనే గ్రహింపబడిన శ్రోత్రాది ఇంద్రియములు నియమితములై శబ్దాది విషయముల యందు ప్రవర్తించును. చక్షురాది ఇంద్రియములు శరీరమను రథమునులాగు గుఱ్ఱములు. హయములుగా పోల్చబడిన ఇంద్రియములు సంచరించు శబ్ద స్పర్శాది విషయములు రథికుడు చరించు మార్గములు ప్రదేశములు. ఆత్మ ఇంద్రియ మనో సరీరబుద్ధి యుక్తమై విషయముల ననుభవించును ఇది జీవభావము. ఆత్మ ఇంద్రియాదులను అధిష్ఠించి విషయములయందు ప్రవర్తించుటచే కర్మఫలభోక్త యని చెప్పబడును కనుక ఆత్మకు కర్మలాచరించుటయు కర్మఫలముల ననుభవించుటయు ఉపాధికృతము ఆత్మనిష్క్రియుడు కర్మఫలముల ననుభవించువాడు కాడు సాక్షి చిద్రూపుడు.

"శ్రు॥ యస్త్వవిజ్ఞానవాన్భవత్యయుక్తేన మనసా సదా తస్యేంద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః॥ సారథి నిపుణుడు కాని యెడల దుష్టములయిన అశ్వములు పగ్గములచే నియమింపబడక పోవుటచే విషమదేశములను రథికుని తీసుకొనిపోవును. అటులనే మనోనిగ్రహము లేక సమాహితము గాని బుద్ధిని గలిగిన యెడల ఇంద్రియములు దుష్టములై వానివిషయములందు స్వేచ్ఛగా వర్తించి జీవుని జనన మరణము సంసారము బొందచేయును. సారథి ప్రవృత్తి నివృత్తులయందు నిపుణుడై పగ్గములను బానుగాగ్రహించి గుఱ్ఱములను నియమించిన రథికుడు గమ్య ప్రదేశమునకు పోవునటుల వివేక యోగయుక్తమైన బుద్ధి మనోనిగ్రహముచే ఇంద్రియములను నియమించుటచే జీవుడు గమ్యస్థానమైన మోక్షమును పొందును.

"శ్రు॥ యస్త్వ విజ్ఞానవాన్భవత్యమనస్కః సదాఽశుచిః న స తత్పద మాప్నోతి సంసారం చాధిగచ్ఛతి। యస్తు విజ్ఞానవాన్భవతి గమనస్కః సదాశుచిః స తు తత్పద మాప్నోతి యస్మాద్భూయో న జాయతే। విజ్ఞాన సారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః సోఽధ్వనః పరమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్॥ మనోనిగ్రహము, శుచి వివేక యోగములు లేనియెడల జీవుడు జనన మరణ సంసారమును పొందును. మనోనిగ్రహము శుచి వివేక యోగములు గలిగిన యెడల జీవుడు బ్రహ్మపదము పొంది మరల జనించదు. కనుక మనోనిగ్రహము గలిగిన వివేక బుద్ధిసారథిని గలిగిన పురుషుడు యోగముచే సమాహిత చిత్తుడై సదాశుచియై సంసార బంధమునుండి ముక్తుడై గమ్యస్థానమైన బ్రహ్మపదము బొందును.

(సశేషము)

"తత్త్వమసి తత్త్వమ్"

శ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

శరీరాదులను రథాది కల్పనచే రథస్వామి అయిన జీవుడు పొందవలసిన స్థానము శ్రీయముడు నచికేతసునకు ఉపదేశించెను శ్రు॥ ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః మనసస్తు పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః॥మహతస్తు పరమవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః। పురుషాన్న పరం కించిత్సా కాష్ఠాపరాగతిః॥ సూక్ష్మ భూతములైన శబ్ద స్పర్శ రూప రసగంధములచే అభివ్యంజకములగు ఇంద్రియములు శబ్దస్పర్శాది సూక్ష్మ భూతములచేవ్యాపింపబడి అపరోక్షములైనవి. సూక్ష్మభూతములు అపరోక్షములైనవి సూక్ష్మభూతములను సంకల్ప-వికల్పములచే ఆరంభకమగు మనస్సు అపరోక్షమై సూక్ష్మ భూతములకంటె సూక్ష్మమై సర్వవ్యాపక మైనది. మనస్సు కంటె సూక్ష్మమై నిశ్చయాత్మకమైన బుద్ధి అపరోక్షమైన సర్వవ్యాపకమైనది. సర్వప్రాణి బుద్ధుల సమష్ట్యాత్మకమై పరోక్షమై సర్వవ్యాపకమై అవ్యక్తమునుండిప్రథమమునఉత్పన్నమైన హిరణ్యగర్భ తత్త్వము వ్యష్ట్యాత్మకమైన బుద్ధి కంటె సూక్ష్మమైనది. మహత్తత్త్వము కంటె సూక్ష్మతరమై అపరోక్షమైనఅవ్యక్తముసర్వవ్యాపకము. వటవృక్షశక్తి వటబీజము నందుండు నటులసర్వజగచ్ఛక్తి అవ్యాకృతము నందుండును. అవ్యక్తము, అవ్యాకృతాకాశ శబ్దవాచ్యమై ప్రపంచ సృష్టిస్థితి లయకారణుడైన పరమాత్మను ఓతప్రోత భావముచే ఆశ్రయించినందున అపరోక్షము హిరణ్యగర్భుని కంటె సూక్ష్మమైనది. అవ్యక్తము కంటె సూక్ష్మాతి సూక్ష్మమైనది పరమాత్మ పరమాత్మ 'పూర్షుశయనాత్ పురుషః పూర్ణత్వాద్వా పురుషః సర్వభూతములందు శయనించువాడైనందునను సర్వవ్యాపకుడై పూర్ణుడైనందునను పురుషుడని చెప్పబడును గను' జీవుడు పొందవలసినది సూక్ష్మాతి సూక్ష్మమై సర్వోత్కృష్టమైన పురుషోత్తమ తత్త్వము. ఇంతకంటె పరమైనది మరొకటిలేదు. కార్యకారణ ప్రపంచ రహితమైన అఖండ సచ్చిదానందమైన బ్రహ్మమె పర్యవసానమైన భూమ. దానిని పొందినవారు మరల జన్మించరు. పై వినబడిన శ్రుతిచే సూక్ష్మ సూక్ష్మతత్త్వ సాక్షాత్కారముద్వారా చరమైన బ్రహ్మ సాక్షాత్కారము పొందవలయునని సూచించుచున్నది శ్రు॥ ఏష సర్వేషు భూతేషు గూఢోఽఽత్మా నప్రకాశతే। దృశ్యతేత్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥ రథాదులచే పొందబడు గమ్యస్థానము పరోక్షమైనదై మరల తిరిగి వచ్చునదగుటచే శ్రుతులయందు వినబడు పరమగతి అపరోక్ష స్వరూపముగా పొందబడుటచే మరల ఆవృత్తి

లేదు. ఇంద్రియములు మొదలు స్థూల, సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమమైన సర్వ తత్త్వములు అపరోక్షమైనవేగదా. నిత్యాపరోక్షమై "యస్సాక్షాద పరోక్షాత్ బ్రహ్మ యని వినబడు స్వరూపమైన బ్రహ్మను పొంది తిరిగి అనాత్మ తత్త్వమును పొందరు. ఈ సూక్ష్మాతి సూక్ష్మమైన తత్త్వము అతి గంభీరము. జీవుడు పరమార్థముగా అఖండ చిదూప్రమైన బ్రహ్మమే అయియుండి మాయావరణచే జడప్రపంచమును ఆత్మగాస్వీకరించి జనన మరణములు పొందును. ఈ అతి గంభీరమైన ఆత్మతత్త్వమును సద్గురువుల చే వేదాంత శాస్త్రము బోధింపబడి శమదమ సమాధ్యానాది యోగముచే సంస్కారము పొంది ఇంద్రియములు, సూక్ష్మములైన తన్మాత్రలు మొదలగు సూక్ష్మ సూక్ష్మ తత్త్వములను దర్శించుటద్వారా (యోగమునందు సవితర్క సమాపత్తి, నిర్విచార సమాపత్తి యని చెప్పబడు) ప్రజ్ఞచే సూక్ష్మ దర్శకులచే బ్రహ్మ సాక్షాత్కారము బొందబడును.

బహ్మ ప్రతిపత్త్యుపాయము ఇటుల వినబడినది. "శ్రు॥ యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞ ప్రాజ్ఞస్త ద్యచ్ఛేజ్ఞానమాత్మని జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేచ్ఛాంత ఆత్మని॥ అశబ్దమస్పర్శమరూపమవ్యయంతథాఽరసంనిత్యమగంధ వచ్చయత్। అనాద్యనంతం మహతః పరం ధ్రువం నిచాయ్యతన్మృత్యుముఖాత్ ప్రముచ్యతే। పరాఞ్చి ఖానివతృణత్స్వయంభూస్తస్మాత్ పరాఙ్పశ్యతి నాంతరాత్మన్ కచ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షదావృద చక్షురమృతత్వమిచ్ఛన్॥ ఆత్మానాత్మ వివేకము గలిగిన పురుషుడు వాగాదీ ఇంద్రియములను మనస్సునందు ప్రవిలాపన చేయవలెను. మనస్సును నిశ్చయాత్మక బుద్ధియందు నియమింపవలెను, అనగా హిరణ్య గర్భునివలె స్వచ్ఛ స్వభావముగా బుద్ధిని చేయవలయును. హిరణ్య గర్భరూపమునుపొందిన బుద్ధిని ప్రపంచ రహితమై ప్రశాంతమై ఆనంద రూపమై సర్వబుద్ధి ప్రత్యయ సాక్షియగు ఆత్మయందు ప్రవిలాపన చేయవలెను. శబ్ద స్పర్శ రూపరసగంధ రహితమై, ఆద్యంత రహితమై బుద్ధి తత్త్వము కంటె సూక్ష్మమై నిత్య చైతన్య జ్యోతియగు పరమాత్మ అపరోక్ష సాక్షాత్కారము పొందుటచే జనన మరణములనుండి విముక్తుడగును. పరమేశ్వరుడు ఇంద్రియములను స్వాభావికముగా బాహ్యవిషయ గ్రాహకములుగా సృష్టించెను కనుక జీవులు పరాఙ్ముఖములైన శబ్దాది విషయములను గ్రహింతురుగాని స్వతంత్రులై అపరోక్షుడైన కేవలాత్మను గ్రహించలేరు. స్వాభావిక ప్రవాహమునకు యెదురీదునటుల నొకానొక ధీరుడు ఆత్మప్రజ్ఞ గలిగిన పురుషుడు సంసార సర్వేంద్రియములను ఉపసంహరించి సంప్రజ్ఞాత, అసంప్రజ్ఞాత సమాధి లక్షణమైన యోగముచే బ్రహ్మాత్మైక్య విజ్ఞాన ఫలమైన మోక్షము బొందును.

యోగము బ్రహ్మాత్మైక జ్ఞానమునకు అంతరంగిక సాధనము. యోగసూత్రములను పతంజలి మహర్షి రచించెను. వానికి వ్యాద వ్యాసుడు భాష్యమును, శ్రీ మచ్ఛంకర భగవత్పాదులు భాష్యవివరణమును రచించిరి. యోగమును యాజ్ఞవల్క్యుడు "సంయోగో యోగ ఇత్యుక్తో జీవాత్మ పరమాత్మనోః" యోగమనగా జీవాత్మ పరమాత్మల సంయోగమని వచించిరి 'యుజ సమాధౌ' యని ధాత్వర్థముచే యోగము "సమాధిః సమతావస్థా జీవాత్మ పరమాత్మనోః బ్రహ్మణ్యేవస్థితి ర్యాసా సమాధిః ప్రత్యగాత్మనః యోగః సమాధిః' యని భాష్యకారులు వచించినారు. భాష్యకారులు యస్త్వేకాగ్రే చేతసి సభూత మర్థం ప్రద్యోతయతి క్షిణోతి చక్లేశాన్ కర్మబంధ నానివశ్లదయతి నిరోధమా ముఖ కరోతి ససంప్రజ్ఞాతః యోగ ఇత్యాచక్షతే। సర్వవృత్తి నిరోధేత్య సంప్రజ్ఞాతః సమాధిః॥ చిత్తే కాగ్రతచే సర్వవిషయము యథా రూపముగా ద్యోతములగుననియు ఏకాగ్రతచే సర్వదుఃఖములు క్షీణించి కర్మబంధములు నశించుననియు పరమార్థ దర్శన హేతువగు నిరోధ సమాధి పొందచేయుననియు, యోగము సంప్రజ్ఞాత సమాధి యనియు అసంప్రజ్ఞాత సమాధియని ద్వివిధమనియు, సంప్రజ్ఞాత సమాధి యనగా ధ్యేయాతి రిక్తమైన వృత్తి నిరోధ మనియు (నిధిధ్యాస) అసంప్రజ్ఞాత సమాధి యనగా సర్వవృత్తి నిరోధమనియు (ఆత్మ సాక్షాత్కారము) యోగశ్చిత్త వృత్తి నిరోధః యను సూత్రమునందు యోగశబ్దార్థము సంప్రజ్ఞాత, అసంప్రజాత సమాధులనియు వచించిరి.

గవాది పదార్థములయందు గోశబ్ద అర్థ జ్ఞాన వికల్పములచే పొందబడు ప్రజ్ఞ సవితర్క సమాపత్తి యనబడును "సూ" తత్ర శబ్దార్థ జ్ఞాన వికల్పైః సంకీర్ణా సవితర్కా సమాపత్తిః॥ శబ్ద, సంజ్ఞ, స్మృతులచే పరిశుద్ధమై వితర్క రహితమై పొందబడు ప్రత్యక్షము నిర్వితర్క సమాపత్తి యనబడును. 'సూ॥ స్మృతి పరిశుద్ధే స్వరూపశూన్యే వార్థమాత్ర నిర్భాసా నిర్వితర్కా' స్థూలభూతములందు సాక్షాత్కారము సవితర్క, నిర్వితర్క సమాపత్తియని చెప్పబడును. అటులనే సూక్ష్మ భూతములయందు సాక్షాత్కారము సవిచార నిర్విచార సమాపత్తి యనబడును. "సూ" ఏతయైవ సవిచారా నిర్విచారా చసూక్ష్మ విషయావ్యాఖ్యాతః" నిర్విచార సమాపత్తి ఫలము "సూ॥ నిర్విచార వైశారద్యేఽధ్యాత్మ ప్రసాదః" స్థూల సూక్ష్మభూత విషయమై విచారణజనిత నిర్విచార సమాపత్తిచే బుద్ధిరజోతమోగుణములచే విడువబడి శుద్ధమై ఆత్మ సాక్షాత్కార యోగ్యమగును. దీనిని ప్రజ్ఞాలోక మనబడును శ్లో॥ ప్రజ్ఞా ప్రాసాద మారుహ్య అశోచ్యః శోచతోజనాన్। భూమిష్ఠా నివ శైలస్థః సర్వాన్ ప్రాజ్ఞోఽనుపశ్యతి॥ ప్రజ్ఞాలోకమును యోగభూమను పొందిన యోగి, సర్వాతాగ్రమునయున్న పురుషుడు

క్రిందనున్న పురుషుల చూచునటుల, దుఃఖ రహితుడై, దుఃఖము పొందుచున్న జీవులను చూచుచుండును. “[illegible]” ఋతంభరా తత్ర ప్రజ్ఞా [illegible] స్థూల సూక్ష్మ భూతములన్నియు ఆత్మయందు అవిద్యాకల్పితములై నందున వానిని నిరాకరించి నిషేధావధియైన కేవలాత్మయందు నిష్ఠ వర్ణింపబడినది. శ్లో॥ ఆగమేనానుమానేన ధ్యానాభ్యాసరసేన చ త్రిధా ప్రకల్పయన్ ప్రజ్ఞాం లభతే యోగముత్తమమ్॥ వేదాంతశాస్త్ర ఆచార్య ఉపదేశముల చేతను, తదర్థ మననముల చేతను, ధ్యానాభ్యాసముల చేతను యుత్తమమైన ఆత్మసాక్షాత్కారమను ప్రజ్ఞను పొందెదరు. తరువాత జ్ఞానయోగములచే ‘ప్రశాంత వాహితా’ యను భూమ పొందబడును. ఈ భూమయందు బ్రహ్మాత్మైక్య ప్రపంచ మిథ్యాత్వజ్ఞానముచే సర్వప్రపంచము ఆత్మయందు బాధితమై చైతన్యజ్యోతియె ప్రకాశించును. అతనిమనసు వృత్తిశూన్యమై అత్యంత ప్రశాంతమై, ధ్యాతృధ్యాన, ధ్యేయత్రిపుటిరహితమై బ్రహ్మయందు ఏకీభూతమగుటచే అట్టి ఉన్నతోన్నతస్థితియె స్వరూపావస్థానము కైవల్యమని వచింపబడనది.

తత్త్వమసి తత్త్వమ్

శ్రీ రావిపాటి బాలసుదనాథశర్మ

(గతసంచిక తరువాయి)

శ్లో॥ వ్యావృత్తజాగ్రదాదిష్వను స్యూతమ్
త్వేభ్యోఽన్యది నపుష్పేభ్య ఇవసూత్రమ్।
ఇతియదౌపాధికత్రయా పృథక్త్వేన
విదంతి సూరయస్తత్త్వమః తత్త్వమ్॥

(శంకర విజయము సర్గ-10)

పుష్పములకు వేరైన దారమువలె ఒకటి వెంబడి నొకటి మారిపోవుచున్న జాగ్రత్త, స్వప్న సుషుప్తులనెడి అవస్థలకు వేరైవాని, యందు అనుగతమైన చిదాత్మను బ్రహ్మగా విద్వాంసులు తెలుసుకొనెదరు, ఇదియె తత్త్వమస్యాది మహా వాక్యార్థ తత్త్వము.

జీవునకు మూడు అవస్థలు. అవస్థలనగా ఆత్మ జీవభావము బొందిన స్థానములు అవి జాగ్రత్తా1 వస్థ, స్వాప్నావస్థ, సుషుప్తి అవస్థ. జీవుడు జాగ్రత్త స్వాప్నావస్థలందు సంసార సుఖదుఃఖముల ననుభవించి సుషుప్త్యవస్థ యందు విశ్రమించును. జాగ్రత్త అవస్థ యనగా 'ఇంద్రియైరర్థోపలబ్ధిర్జాగరితమ్'యని విద్వాంసులు పలికినటుల ఆత్మ ఇంద్రియ ములద్వారా విషయములను ప్రకాశింపజేయు (విషయస్ఫూర్తి)స్థానము. జాగ్రతావస్థయందు ఆత్మ తన కంటె వేరైన ఘటపటాది పదార్థ ములను శబ్దస్పర్శాది విషయములను.......... విషయోపలబ్ధి ద్వారములు జ్ఞానేంద్రియ ములు అయిదు కర్మేంద్రియములు అయి ప్రాణములయిదు మనోబుద్ధి చిత్తాహంకా రములను నవి పందొమ్మిది. ఆత్మ సర్వ విషయములయందు వ్యాపించి పందొమ్మిది కరణములద్వారా విషయముల ననుభవించు టచే విశ్వుడనబడును.

ఆత్మ జాగరిక స్థానమునందు జీవభావము బొంది ఘట పటాది విషయ యదార్థజ్ఞానము పొందును. ఒక వస్తువును ఆ వస్తువుగా తెలియుట యదార్థ జ్ఞానము. యదార్థజ్ఞానము 'ప్రమ' యనబడును. ఆ యదార్థ జ్ఞానము ఒక వస్తువును మరియొక వస్తువుగా (అడిగాని వస్తువుగా) తెలియుట. అయదార్థ జ్ఞానము 'భ్రమ'యనబడును. ఆత్మజాగరితావస్థయందు చక్షురాది ఇంద్రియముల ద్వారా విషయ యదార్థ జ్ఞానముచేయు అంతఃకరణ వృత్తి ప్రమాణ మనబడును. విషయ యదార్థ జ్ఞానము పొందు ఆత్మ 'ప్రమాత'యనబడును. ప్రమాతచే తెలియబడు విషయము ప్రమేయ

శ్రు॥ సర్వం హ్యేతద్బ్రహ్మాయ మాత్మా బ్రహ్మసోఽయమాత్మా చతుష్పాత్॥ (మాండూక్యోపనిషత్)

మనబడును గనుక జాగరితావస్థ యందు ఆత్మకు ప్రమాత, ప్రమాణ, ప్రమేయము లను త్రిపుటి సంభవించును. ప్రమాణములు ఆరు. అవి ప్రత్యక్ష, అనుమాన, ఆగమ, ఉపమాన, అనుపలబ్ధి, అర్థాపత్తి యనునవి.

ప్రత్యక్ష ప్రమాణమనగా నిశ్చయాత్మకమైన ఇంద్రియ సన్నికర్ష జనిత అంతఃకరణ వృత్తి పరిణామాత్మక జ్ఞానము.

(సశేషము)

(16 వ పేజీ తరువాయి)

గమనీయ మృదులాన్న కబళ వేత్రవిషాణ
వేణుచిహ్నంబుల వెలయు వాని
గుంజావిసర్జిత కుండలంబులవాని
శిఖిపింఛ వేష్టిత శిరసువాని
వనపుష్పమాలికా వ్రాతికంఠము వాని
నలినకోమల చరణములవాని

ఆ॥ కరుణగడలుకొనిన కడగంటివాని గో
పాల బాలు భంగిబరగువాని
నగుమొగంబువాని ననుగన్నతండ్రిని
నిను భజింతు ముక్తి- నరజాక్ష॥

ఈ గోపబాలకుల భాగ్యము మన కెన్నటికైనా గలుగునా!

5. నాయందు సకలేంద్రియ వృత్తి విషయముల నుంచుటకు తగు చిత్తదార్ఢ్యము లేని యెడల క్రమముగా యమ, నియమ, ఆసన, ప్రాణాయామాదులనభ్యసించుము. అప్పుడు క్రమముగా నన్ను పొందగలవు. శ్రీ శంకరజగద్గురువులు

[partial: శ్రీ దత్త జ…
శ్రీ శంక…
శ్రీ దత్తాత్రేయ జం…
జరుపబడినది. బ్రహ్మ…
గారు అధ్యక్షతవహించ…
రావుగారు దేవతత్వ…
ఉపన్యసించి యున్నా…
ప్రవచనము చేసియున…
వారిచే యిద్దరు విద్యా…
ములో బాపట్ల పుర…]

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

చాక్షుష ప్రత్యక్షమందు ఘటాది విషయము చక్షురింద్రియ సన్నికర్షము కల్గినప్పుడు అంతః కరణము చక్షురింద్రియముద్వారా బయటికి వెడలి ఘటాది విషయ ప్రదేశమునకు వెళ్ళి ఘటాది విషయాకారముగా పరిణమించును అంతఃకరణ పరిణమించునపుడు అంతఃకరణ రూపాంతరము బొందక జలగ సాగునటుల పరిణమించును.

సర్వవ్యాపకుడైన చిదాత్మ అంతఃకరణము నధిష్ఠించినపుడు చిదాత్మ అంతఃకరణా వచ్ఛిన్న చైతన్యము (అంతఃకరణ విశిష్ట చైతన్యము) ప్రమాత, ప్రమాతృ చైతన్య మనబడును. అంతఃకరణ వృత్త్యవచ్ఛిన్న చైతన్యము ప్రమాణ చైతన్య' మనబడును. ఘటాది విషయావచ్ఛిన్న చైతన్యము విషయ చైతన్యము (ప్రమేయ చైతన్యము) అనబడును. చిదాత్మయే అంతఃకరణ విశేషణముచే ప్రమాతృత్వము, అంతఃకరణ వృత్తి విశేషముచే ప్రమాణాత్మము, విషయాకారముపొందిన అంతఃకరణ విశేషముచే ప్రమేయత్వము బొందును. అంతఃకరణ, తద్వృత్తి విషయముల నధిష్ఠించిన చిదాత్మకు మహా వచ్ఛిన్నాకాశమునకును మహాంతర్వర్తియగు ఘటాకాశమునకు భేదములేనటుల భేదము లేదు. చిదాత్మ అంతఃకరణ వృత్తి బొందిన ఘటాది విషయాకారమును ప్రకాశించుటచే ఘటాదిక జ్ఞానము గలుగును.

శ్రవణేంద్రియ ప్రత్యక్షమందును అంతఃకరణ భేర్యాదిశబ్ద దేశములకు శ్రవణేంద్రియముద్వారా బహిర్గమనము చేసి శబ్దాద్యాకారమును పొందుటచే భేర్యాది శబ్దజ్ఞానము గలుగును. త్వక్ (స్పర్శ) జిహ్వ (రస) ఘ్రాణ (గంధ) ప్రత్యక్షములయందు త్వక్ జిహ్వ ఘ్రాణేంద్రియములకు స్పర్శ, రస, గంధ విషయములు సంయోగమైనప్పుడు ఆయా ఇంద్రియముల యందున్న అంతఃకరణ ఆయా విషయాకారముగా పరిణమించి ఆయా విషయాకారముపొందుటచే చిదాత్మకు ప్రమాతృ ప్రమాణ, ప్రమేయ వ్యవహారముచే స్పర్శాది విషయ జ్ఞానము కలుగును. ఈ ప్రత్యక్షముల యందు అంతఃకరణకు బహిర్గమనము లేదు. ఇంద్రియములయందు విషయ సంయోగముచే కలిగిన సుఖదుఃఖాద్యాకారముగా అంతఃకరణ పరిణమించుటచే చిదాత్మకు సుఖదుఃఖాది జ్ఞానము గలుగును.

జాగ్రితావస్థయందు జీవునకు ఇంద్రియ దుర్బలత్వము చేతను ఇంద్రియ దోషము చేతను అంధకారము చేతను అయదార్థ జ్ఞానము (భ్రమ) గలుగును.

అనుమాన ప్రమాణమందు పర్వతాంశ ప్రత్యక్షమైనను, వహ్ని చక్షురింద్రియ సన్నికర్ష రహితమగుటచే అగ్ని అంశయందు ప్రత్యక్షముకాదు వ్యాప్తిజ్ఞానముచే వహ్న్యంశయందు పర్వతము అగ్నిమంతమైనదని అంతఃకరణ వృత్తి పరిణామముచే అనుమితి జ్ఞానము గలుగును. అనుపలబ్ధి ప్రమాణమందు ఘటముండుటకు యోగ్యమైన ప్రదేశము ప్రత్యక్షమైనను తదాకార అంతఃకరణ వృత్తి పరిణామమందు ఘటాది విషయాకార వృత్తి పరిణామము జనింపక పోవుటచే ఘటాది విషయాభావజ్ఞానము గలుగును.

అర్థాపత్తి ప్రమాణమందు గృహప్రత్యక్షమందు దేవదత్త ప్రత్యక్ష జ్ఞానము లేక, దేవదత్తాభావజ్ఞానముచే దేవదత్తుడు బయట నుండునని నిశ్చిత అంతఃకరణ వృత్తి చిదాత్మచే ప్రకాశింపబడుటచే యథార్థ జ్ఞానము గలుగును.

ఉపమానమందు గో గవయ అవయవములు ప్రత్యక్ష గోచరమైనను సాదృశ్య ప్రత్యక్షము కాకపోవుటచే సాదృశ్యాకారితాంతః కరణ వృత్తులచే చిదాత్మకు సాదృశ్యజ్ఞానము గలుగును.

ఆగమ ప్రమాణమందు ధర్మాధర్మములును ఈశ్వరుడున్న (ఆత్మయు) ఇంద్రియాగోచరులగుటచే వేదవాక్యమందలి 'లిఙ్గాది ప్రత్యయములచే ధర్మాధర్మ విషయమైన వాక్యార్థ జ్ఞానమును, తత్త్వమస్యాది వేదాంతవాక్య జనితమైన బ్రహ్మాత్మైకత్వ యథార్థజ్ఞానమును గలుగును.

ఆత్మ వాక్, పాణి, పాద, పాయూపస్థలను కర్మేంద్రియములను ప్రాణములను అధిష్ఠించి అంతఃకరణ కర్తృత్వాకారము పొందిన వృత్తిపరిణామ విశిష్టతచే ఆత్మ కర్త యగును చిదాత్మజీవబొందిన రెండవస్థానమైన స్వప్నావస్థ 'కరణేషు ఉపసంహృతేషు జాగరిత సంస్కారజః ప్రత్యయః సవిషయః' యని విద్వాంసులచే వర్ణింపబడినది. ఇంద్రియములు వ్యాపారరహితములై ఉపసంహరింపబడగా జాగ్రితావస్థయందు గలిగిన సంస్కారములనుండి జనియించిన ఘటపటాది శబ్దస్పర్శాది విషయసహిత అంతఃకరణ వృత్తులుగలిగిన స్థానము. స్వప్నస్థానమందున్న ఆత్మ తైజసుడనబడును. జీవుడు జాగ్రితావస్థయందు బాహ్యవిషయములందు వర్తించుటచే చలించుచున్న మనస్సుయందు ప్రమాణజ్ఞానముచే అవిద్యా కామకర్మలచే సంస్కారముజనించి చిత్రితపటమువలె స్వప్నావస్థయందు భాసించును. స్వప్నరూపముగా పరిణమించిన అంతఃకరణము సాక్షిచిన్మాత్రునిచే దర్శింపబడును. చిదాత్మ సూర్యచంద్ర దీపాది అన్యప్రకాశ నిరపేక్షుడైన స్వయంజ్యోతి స్వరూపుడగుటచే స్వప్నవిషయములన్నియు నిశ్శేషముగా వీక్షించును. అతడు బాహ్యప్రకాశ నిరపేక్షకముగా విషయ సం

స్పర్శరహితముగా విషయప్రకాశకుడగుటచే స్వప్నద్రష్ట తైజసుడనబడును. తైజసుడు వర్తమాన జన్మయందు అనుభవింపబడిన విషయములను, అనుభవింపబడని విషయములను నిష్ప్రయత్నముగా దర్శించును. అతడు కర్మేంద్రియాది పందొమ్మిది విషయోపలబ్ధి ముఖములద్వారా జాగ్రతావస్థయందు పొందబడు విషయములన్నియు, మనస్సుద్వారా అనుభవించును. స్వప్నస్థానమునందు అనుభవింపబడిన రథము అశ్వములు మొదలగు పదార్థములు భ్రాంతికల్పితములు. కేవల స్మృతిమాత్రముచే వ్యవహరింపబడుట లేదు. కేవలస్మృతిమాత్రమైన రథాదులను చూచి నాను రథము నారోహించినాను యని అనుభవ విరోధము. శ్రు॥ అథరథాన్ రథయోగాన్ పథః సృజతే॥ యను వాక్యమందు రథాదిసృష్టి వినబడుటచే స్వాప్నికపదార్థములు భ్రాంతిజనితమై ప్రాతిభాసికములు. స్వప్నరథాదులు సృజింబడుటకు స్వప్రకాశ చైతన్యము అధిష్ఠానముగునటుల రథాదులు సంచరించు ప్రదేశములుగూడ సర్వవ్యాపకమైన చైతన్యముచే అధిష్ఠింపబడిన వగుటచే ప్రదేశములుగూడ ప్రాతిభాసికములు ఇంద్రియములన్నియు ఉపరమించుటచే రథాదులను ఇంద్రియముల గ్రహించుటయు ప్రాతిభాసికమేయగును.

(సశేషము)

౨౪

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

స్వప్నమునందు భాసించు గజరథాదులు కేవల మాయాపరిణామములని కొందరు, అంతఃకరణద్వారా మాయాపరిణామ మని కొందరు వచింతురు.

స్వప్నగజాదులకుపాదానము తన్యమా, మూలావిద్యయా, లేక కార్యావిద్యయా! చైతన్యము పరిణామ రహితమగుటచే చైతన్యము కాదు. కార్యావిద్య బాహ్య దేశావచ్ఛిన్న చైతన్యాశ్రిత మగుటచేత స్వప్న గజాదులకు కార్యావిద్య ఉపాదానము కాదు. స్వప్నమునందు గజాదులను దర్శించుటకు ప్రయత్న విశేషమేమియు లేనందున అంతఃకరణద్వారా మాయయే ఉపాదానము.

కార్యవినాశము ద్వివిధము బాధ, నివృత్తి. బాధ అధిష్ఠాన సాక్షాత్కారముచే కలుగును నివృత్తి విరోధి అంతఃకరణవృత్తిచేగలుగును. స్వప్నపదార్థ విషయమునందు మూలావిద్యాధిష్ఠానమైన బ్రహ్మ సాక్షాత్కారము లేనందున నిద్రానివృత్తిచే జాగరితాంతఃకరణ వృత్తిచే స్వప్నము నివర్తించును.

చిదాత్మ జీవభావముబొందిన మూడవ స్థానము సుషుప్త్యవస్థ. సుషుప్త్యవస్థ "సర్వప్రకార జ్ఞానోప సంహారె బుద్ధేః కారణాత్మనాఽవస్థానం సుషుప్తిః" అని వచింపబడినది. సుషుప్తి కాలమందు ఇంద్రియములు వాని వ్యాపారములనుండి ఉపరమించును. అంతఃకరణ దాని కారణమైన అవిద్యయందు లయము పొందును. చిదాత్మ అవిద్యావరణచే మనోస్పందన లేక బాహ్యవస్తు దర్శనము గాని, స్వప్నమునుగానికోరికలుగాని పొందడు. జాగ్రిత, స్వప్న ప్రపంచములు ఆత్మయందు లయమగును. జాగ్రత స్వప్న విజ్ఞానములు అవివిక్తముగా ఏకీభూతమగుటచే ఆత్మ ప్రజ్ఞానఘనుడనబడును. ద్రష్ట, దర్శన, దృశ్యాది త్రిపుటియు, మనస్సునకు విషయాకార స్పందనాయాస దుఃఖము లేనందున ఆనందరూపుడు. జాగరిత స్వప్నజ్ఞానములకు ద్వారమగుటచే చేతోముఖుడు సుఖమనుభవించుటచే ఆనందభుక్. భూత భవిష్యత్ జాగరిత స్వప్న జ్ఞానములు సుషుప్తి యందు ఘనీభవించి యుండుటచే ప్రజ్ఞానఘనుడు. సుషుప్తావస్థ పొందిన చిదాత్మ ప్రాజ్ఞ అనబడును.

సకల బ్రహ్మాండములు స్థూలభూతముల కభిమానియగు పరమేశ్వరుడు విరాట్ యనబడును. సకల సూక్ష్మభూతములు (సూక్ష్మ

శరీరముల) కభిమానియైన పరమేశ్వరుడు హిరణ్యగర్భు డనబడును. సకల కారణ శరీరముల (మాయా) కభిమానియైన పరమేశ్వరుడు అవ్యాకృతు డనబడును. అభిమాన మనగా విశిష్టత్వము.

వ్యష్ట్యుపాధ్యభిమాని(విశిష్టుడైన) చిదాత్మ వ్యష్టి స్థూల సూక్ష్మ ఉపాదులచే విశ్వ, తైజస, ప్రాజ్ఞ సంజ్ఞలు పొందుటచేతను పరమేశ్వరుడు సమ్యష్టి ఉపాదుల విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృత సంజ్ఞలు పొందుటచే వ్యష్టి ఉపాదులచే సమ్యష్ట్యుపాధులయందు ఏకీభూతము గుటచే విశ్వుడు విరాట్ యందును, తైజసుడు హిరణ్యగర్భుని యందును, ప్రాజ్ఞుడు అవ్యాకృతుని యందును ఏకీభూతాలు.

ఇంద్రియములు, శబ్దస్పర్శ రూపరస గంధములు, అంతఃకరణ వృత్తులు జడములైనందున విషయములను స్ఫురింపచేయుటయందు ఆత్మకర్తయగుటచే కర్తృత్వ మనిత్యముగుటచే ఆత్మవికారము బొందుననిన-

అటులకాదు. బాహ్య విషయాకారములైన అంతఃకరణ వృత్తులను నిశ్శేషముగా తెలుసుకొనుచున్నందున (ప్రకాశింప చేయుచున్నందున) ఆత్మ నిర్వికారుడని చెప్పబడును అంతఃకరణ వృత్తులవలె ఆత్మవికారము పొందెడి ఎడల ఆత్మయు చిత్తమువలె పరిణామముపొంది చిత్తవృత్తులను స్ఫురింప నేరదు. ఆత్మ పరిణామ రహితుడగుటచే కూటస్థ చిద్రూపుడు. ప్రకాశించేయుట యనగా ధాత్వర్థము ననుసరించి జ్ఞాన కర్తృత్వచే ఆవశ్యము ఆత్మకువికారము ప్రాప్తించు ననిన-

అటులం కాదు జ్ఞానధాత్వర్థము ఆత్మయందు ఉపచారికముగానుపయోగింపబడినది. జ్ఞానకర్తృత్వము బుద్ధివృత్తియందువర్తించును అంతఃకరణము విషయాకారముగా పరిణమించగా నిర్వికారుడైన ఆత్మజ్యోతి బుద్ధివృత్తుల యందు వ్యాపింపగా చిచ్ఛాయ గలగును. ఘటాది విషయ జ్ఞానము గలుగును. ఘటాది జ్ఞానము ఫలము. ఫలమునందు కర్తృత్వ వికారము లేదు. ఫలముపొందువరకును ప్రకాశ

ఎవడు తన్ను వ్యాపకునిగను, శాంతునిగను, ఆనందముగను కేవలునిగను చూచునో వానికి వలయునదిగాని, తెలియవలయునదిగాని మిగులదు.

...శ్రీ సురేశ్వరాచార్యులు

కర్తృత్వ మున్నదనిన అటులకాదు, కూటస్థ చైతన్యము అంతఃకరణ, తద్వృత్తి, విషయాకారమును ప్రకాశింప చేయుటచే ఘటజ్ఞాన ఫలమునందు జ్ఞానము కూటస్థ చైతన్యము మాత్రమగుటచే చైతన్యమునందు వికారము లేదు. అంతఃకరణ వృత్తివిశేషములచే భోక్తృత్వ కర్తృత్వ జ్ఞాతృత్వ వికారములు అగ్నిచే వ్యాపింపబడిన అయఃపిండమందు అగ్నివర్తులముగా వున్నదని అయఃపిండవికారములు అగ్నియందారోపింపబడునటుల నిర్వికార చిన్మాత్రుడైన ఆత్మయందౌపచారికముగా ప్రయోగింపబడుచున్నవి. ధాత్వర్థము క్రియారూపకమగుటచే అనిత్యమను నియమము లేదు. 'సవితా ప్రకాశ 'యతి' 'తిష్ఠంతి పర్వతాం'। ఇత్యాదివాక్యముల యందు సూర్యుడు ప్రకాశింప చేయుటయందును, పర్వతములు నిలుచుండుటయందును ధాత్వర్థ నిత్యత్వము దర్శింపబడుటచే ఆత్మనిత్య చైతన్య జ్యోతి. ఆత్మ సర్వపదార్థములను ప్రకాశింపజేయు వాడగుటచే చైతన్యము ఆత్మ ధర్మ మనిన-

అటులకాదు ఆత్మ చైతన్యములయందు ధర్మి ధర్మభావము ఉపపన్నముగాదు. చైతన్యము ఆత్మకు భిన్నమా? అభిన్నమా? చైతన్యము ఆత్మకు భిన్నమైనచో ఆత్మ ఘటాదులవలె జడమగును. జగదాంధ్యము ప్రాప్తించును ఆత్మకు చైతన్యసంబంధముచే చైతన్యము ఆత్మధర్మమగుననిన ఆత్మకును చైతన్యమునకును సంబంధము సంయోగమా? సమవాయమా? సంయోగము ద్రవ్యమాత్ర సంబంధమగుటచే ఆత్మ ద్రవ్యముగానందున సంయోగము లేదు. సమవాయము (తంతు సమవాయముచే పటము జనించును) సావయవములై సమవాయము గలిగిన వానికి సంబంధముగలుగ జేయును. ఆత్మ చైతన్యములు నిరవయవములగుటచే సమవాయ సంబంధము లేదు. ఆత్మచైతన్యసమవాయమునకు సమవాయాంతర పరంపరావసరమగుటచే అనవస్థాదోషము గలుగును కనుక ఆత్మ చైతన్యములకు సంయోగ, సమవాయ సంబంధముగా ఇతర సంబంధములు నియామకా వర్ణము? చైతన్యము ఆత్మకు అభిన్నమైనచో చైతన్యము ఆత్మస్వరూపమేయగును. భిన్నాభిన్నత్వములు విరుద్ధముగుటచే యాపక్షమసంభవము. గనుక చైతన్యాత్మలయందు ధర్మధర్మి భావమను పపన్నము. చైతన్యమే ఆత్మ.

నీ ఆయువు క్షణక్షణము తరుగుచున్నది. నీ మనస్సు చంచలమైనది. శరీరమా మట్టితో నిర్మితమై క్షణభంగురమైనది. అందుచే ఉచ్ఛ్వాస నిశ్వాసలతో నామమును స్మరించుము.

ఆత్మ చిద్రూపుడైనను జాగ్రత స్వప్నావస్థలయందు శబ్దాది విషయముల ప్రకాశింపచేయుచు సుషుప్త్యవస్థయందు విషయముల ప్రకాశింపనందున వికారముబొంది అచేతనమైనదా? యనిన - అటులకాదు. ప్రమాణకుశలులైన వారు చైతన్యము ఆగంతుకమని నిరూపింపలేరు. చైతన్యముయొక్క ఆగంతుకత్వము చైతన్యముచే తెలియబడుచున్నదా? అన్యమైన దానిచే తెలియబడుచున్నదా? తెలుసుకొను చైతన్యము పూర్వమే సిద్ధమైనందున చైతన్యముయొక్క ఆగంతుకత్వము తెలుసుకొనుట యసంభవము చైతన్యాన్యములైన దేహ ఇంద్రియ ప్రాణ అంతఃకరణములు జడములై సంహతములై (ఒకటితోనొకటి సంబంధించి) నవగుటచే పదార్థములు. గృహముయొక్క స్తంభాదికములు సంహతములై గృహము యజమాని పదార్థములై స్వతః సిద్ధముకావు. యజమాని స్వతంత్రుడు (స్వార్థుడు) యజమాని సిద్ధమయినగాని గృహాదికములు యజమాని పదార్థమై యజమానిచే కల్పింపబడును. యజమాని గృహాదుల పరార్థముగాదు. అటులనే స్వతః సిద్ధమైన చిదాత్మ స్వతంత్రుడగుటచే పదార్థములు సంహతములైన దేహ, ప్రాణ ఇంద్రియ అంతఃకరణములచే సిద్ధముగాడు. దేహాదులు చిదాత్మచే ఆరోపింపబడుటచే ఆగంతుకములైన దేహాదులను చిదాత్మనిశ్శేషముగా ప్రకాశింపచేయును. జడములైన దేహాదులు ఆత్మను ఆగంతుకత్వమును ప్రకాశింపనేరవు. ఆత్మ నిత్య నిత్య చైతన్యజ్యోతి. ఇందులకు "నహి ద్రష్టుర్దృష్టేర్విపరిలోపో విద్యతే అవినాశిత్వాత్" ఇత్యాది శ్రుతులు ఆత్మ నిత్య చైతన్యస్వభావము గలదనియు దేనిచేత తెలుసుకొనబడదనియు ప్రమాణములు.

సుషుప్తియందు చిదాత్మ ఏవిషయములను తెలుసుకొననందున దృశ్యములు నిషేధింపబడుచున్నవి. దృష్టియున్నందుననే దృశ్యలేమి తెలియబడుచున్నది. సుషుప్తియందు దృశ్యములు నిషేధింపబడుచున్నవిగాని దృశ్యలేమి దర్శనము నిషేధింపబడుట లేదుగదా! దృష్టివుండగా దృశ్యములు నిషేధింపబడుచున్నవి గనుక దృష్టియే చైతన్యము. జాగ్రత స్వప్నావస్థలయందు దృశ్యములు ఆరోపింపబడి దర్శింపబడును. సుషుప్తి అవస్థయందు దృశ్యారోపణ లేనందున దృశ్యారాహిత్యము దర్శింపబడును. జాగ్రతస్వప్నముల

శ్రవణ మననములచే నిస్సంశయముగా నిర్ధారణ చేయబడిన - ఆత్మయందు చిత్తమును స్థాపించి తదేకారవృత్తి ప్రవాహమును - చిత్తమునకు కలిగించుటకు నిధిధ్యాసమనబడును.

యందు దృశ్యముల ప్రకాశించునదియు సుషుప్తియందు దృశ్యలేమిని ప్రకాశించు ప్రకాశమే చైతన్యము (దృష్టి) కనుక ఆత్మ నిత్య చైతన్యజ్యోతి

ఒకవస్తువు ప్రకాశించుటకు అన్యమైన ప్రకాశమవసరమగుచో యావస్తువు ప్రకాశరహితమైనది. ఆత్మనిత్య ప్రకాశరూపమైనందున ప్రదీపమును ప్రకాశింపజేయుటకు అన్యమైన ప్రదీపమవసరము లేనటుల ఆత్మ ప్రకాశమునకు అన్యప్రకాశమక్కర లేదు. కనుక ఆత్మ స్వప్రకాశము అనిత్యములైన అంతఃకరణవృత్తి ఘటజ్ఞానములను ప్రకాశింపజేయుటకు అన్యజ్ఞానమవసరముకావచ్చును. ప్రమాతను (తెలుసుకొనువానిని) ప్రమాణీకరించుట (తెలుసుకొనుటకు) ప్రమిత్సా (తెలుసుకొనుకోరిక) వుండిన యెవరిని తెలుసుకొనుటకు నుండును? ప్రమాతనా? అన్య విషయముగా ప్రమాత ప్రమాతను తెలుసుకొనుట కర్మకర్తృభావమసంగతము. అన్యమును తెలిసికొనగోరేయడల అన్యప్రమాత కావలయును అన్యప్రమాతయు యీ స్వభావమునే (అన్యప్రమాతచే తెలియబడుట) గలిగి యుండుటచే అనవస్థాదోషము గలుగును. ఎప్పుడును స్మృతిస్మరింపబడు విషయము-కోరిక కోరబడు వస్తువిషయమగును గాని స్మరించువాని విషయము కోరువాని విషయముగాదు. ప్రమాత అన్యప్రమాత నిరపేక్షుడు. జ్ఞానస్వరూపుడైన ఆత్మదృష్టి అనిత్యమైనయెడల దృష్ట్యుత్పత్తికి పూర్వము దృష్టినాశనము తరువాతను ఆత్మయందు దృష్టిలేనందున ఆత్మసంహతము పదార్థమగును. జగదాంధ్యము గలుగును. కనుక ఆత్మ అన్యనిరపేక్షకమైన నిత్య చైతన్యజ్యోతి.

జీవుడు స్వప్నమునందు యనేక విషయముల ననుభవించును. స్వప్నమునందు కాశ్యాది ప్రదేశములకు వెళ్ళినటులను, వ్యాఘ్రాది రూపములను, రథములు, రాజ్యాదికములు సంపాదించినట్లును, యనేక విచిత్ర పదార్థముల దర్శించును. అతడు మేల్కొనినప్పుడు అతడు పరుండినచోటనే యుండును. స్వప్నముగా యనేకులతో సంభాషణాదికములు జేసినట్లున్నను నవి సత్యములైనచో వారిచేగూడ సంభాషణాదికములనుభవింపబడవలసి యుండును. అటుల వారిచే ననుభవింపబడక పోవుటచేతను, రథాదికములు జేయుటకుదగిన సామగ్రి లేనందునను

ఎవడు అప్రయత్నముగా లభించిన ప్రయోజనములను సహితము ఆశింపడో, బాహ్యాంతర పరిశుద్ధిని కల్గియుండునో, కార్యదక్షుడో పక్షపాత శూన్యుడో, మనోవైకల్యరహితుడో, కోరికతో ఏపనియు నారంభింపడో, అతడు నాకు ప్రియుడు.

శ్రీకృష్ణభగవానుడు

రథాదికములు శరీరమున నుండుటకు నవకాశము లేనందునను, కాష్ఠాది ప్రదేశములకు బోవు వ్యవధి లేనందునను స్వప్నపదార్థములు అసత్యములని 'శ్రు' "న తత్ర రథా యోగాన పంథానో భవంతి" ఇత్యాది శ్రుతులు వర్ణించు చున్నవి.

స్వాప్నిక పదార్థములు సూక్ష్మనాడుల యందు సంచరించెడి మనోకల్పితములు ద్రష్టయైన ఆత్మయందారోపింపబడి ప్రబోధకాలమున బాధింపబడును గనుక నసత్యములు. జాగ్రతావస్థయందనుభవింపబడెడి పదార్థములు దృశ్యములగుటచేతను అంతవంతములగుటచేతను స్వాప్నిక పదార్థములవలె మిథ్యాభూతములు జాగరితావస్థ యందనుభవింపబడె పదార్థములు సాక్షియైన చిదాత్మచే దర్శింపబడు చున్నవి. స్వాప్నిక పదార్థములు స్వాప్నాంతమున లేనటుల జాగ్రితావస్థయందనుభవింపబడెడి పదార్థములు స్వప్నసుషుప్త్యవస్థల యందు లేవు. బాగుగా భుజించి పరుండిన పురుషుడు స్వప్నమున క్షుత్పీడితుడగును. రాజ్యాదికములు చేసి పరుండిన పురుషుడు స్వప్నమున భిక్షుకుడగును. సుషుప్త్యవస్థయందు జాగరితావస్థ పదార్థము లేమియు దర్శింపబడుట లేదు. కనుక 'ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేపి తత్తథా" యని సాంప్రదాయక బ్రహ్మవిదులు పలికినటుల జాగ్రిత పదార్థములు స్వప్న సుషుప్త్యవస్థల యందనుభవింప బడకపోవుటచే జాగరిత పదార్థములు మనోకల్పితములై మిథ్యాభూతములు. స్వప్నము నందనుభూతములైన విచిత్రాకారములనుభవింపబడుటచేతను జాగ్రితావస్థయందు పూర్వమనుభవింపబడిన సత్యమైన పదార్థములనుభవింపబడుటచేతను స్వప్న పదార్థములకు వైషమ్యమున్నదని శంకింపబనిలేదు. స్వప్నమునందు విచిత్రపూర్వములైన దృశ్యములు దర్శించుట స్వప్నధర్మములు. స్వప్నద్రష్ట ప్రయత్నరహితుడై మనస్సుచే నేయాకారములు కల్పించునో యవిచూచును. జాగ్రితావస్థయందు ద్రష్ట స్వప్రయత్నముగ తన బుద్ధి సంస్కారానుగుణ్యమైన దృశ్యములను బుద్ధియందు కల్పించి బాహ్యమున దర్శించును. స్వప్న పదార్థములవలె, జాగ్రిత పదార్థములు మనోకల్పితము లగుటచేతను స్వప్నకాల మతిస్వల్పమగునటుల జాగ్రితా

నీవు అసంసారివై పరమాత్మవై యుండగా 'నేను సంసారి' వని పొరపాటు పడుచున్నావు. మరియు అకర్తవై యుండగా కర్తవనియు అభోక్తవయి యుండగా భోక్తవనియు నిత్యుడవయి యుండగా అనిత్యుడ వనియు తలపోయుచున్నావు. ఇది అవిద్య

శ్రీ శంకరభగవత్పాదులు.

వస్థా కాలము మహాకాలమందు అతిస్వల్పమగుటచేతను జాగ్రత పదార్థములు దర్శింపబడు ప్రదేశము బ్రహ్మాండ ప్రదేశమందలి స్వల్పమగుటచేతను జాగ్రిత దృశ్యములు బాహ్యమునందు సత్యములగుట యుక్తము గాదు. జాగ్రితావస్థయందు దృశ్యములు మనస్సుచే కల్పింపబడెడి కాలము చిత్తకాల మన బడును. దృశ్యములను బుద్ధియందు కల్పించి, ఇంద్రియములద్వారా బాహ్యమున దర్శించెడి కాలము ద్వయకాల మనబడును, దీనికే నుదాహరణము. దేవదత్తుడు నిలుచుండు కాలమొకటి, గోవుపాలుపితుకు కాలమొకటి దేవదత్తుడు నిలుచుండు కాలమున గోవుపాలు పితుకబడిన ద్వయకాల మనబడును. అటులనే ఇంద్రియములద్వారా విషయముల దర్శించు కాలము మనస్సుచే విషయముల సంకల్పించు కాలమైనందున ఇంద్రియములద్వారా విషయము దర్శించుట మనో సంకల్పమాత్రమైనందు జాగ్రితావస్థయందు విషయముల దర్శించుట స్వప్నమందువలె మిథ్యాభూతము. జాగ్రితావస్థ యందలి దృశ్యములు స్వప్నదృశ్యములువలే ఆత్మజ్ఞానముచే బాధింపబడుటచే నసత్యములు "నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః" ప్రమాణ వచనముల ననుసరించి దృశ్య ప్రపంచమంతయు మిథ్యాభూతమగుటచే ఆత్మ దృశ్య దర్శితమైన నిత్య చైతన్య జ్యోతి,

(స శేషము)

రజ్జువునందు సర్పమారోపిత మయినటులు బుద్ధి ధర్మమగు అవస్థాత్రిత మాత్మ యందారోపితమని అనుభవ పూర్వకముగా ఎరిగినచో వాని యంతట నవియే వదలిపోవును

శ్రీ శంకరభగవత్పాదులు.

ఎవడు తనకంటె బ్రహ్మము వేరనుకొనునో వానిని బ్రహ్మము నిరాకరించును.

బృహదారణ్యకోపనిషత్తు.

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

శ్రు॥ యత్రసుప్తో న కంచన కామం కామ
యతే న కంచన స్వప్నం పశ్యతి
తత్సుషుప్తం। సుషుప్తస్థాన ఏకీభూతః
ప్రజ్ఞానఘన ఏవాఽఽ
నందమయో హ్యానందభుక్ చేతోముఖః
ప్రాజ్ఞస్తృతీయః పాదః॥
శ్రు॥ నాంతః ప్రజ్ఞం నబహిష్ప్రజ్ఞం నోభ
యతః ప్రజ్ఞం నప్రజ్ఞాన ప్రజ్ఞానఘనం
నప్రజ్ఞం నాప్రజ్ఞమ్। అదృష్ట మవ్యవ
హార్య మగ్రాహ్యమ లక్షణమచిం
త్య మవ్యపదేశ్య మే కాత్మప్రత్యయ సారం
ప్రపంచోపశమం
శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే
సఆత్మా సవిజ్ఞేయః॥

అధర్వ వేదాంతర్గతమైన మాండూక్యోప నిషత్ యందు "శ్రుతి" అయమాత్మా బ్రహ్మచతుష్పాత్" యను మహావాక్య మందు ఆత్మ విశ్వతైజసప్రాజ్ఞ తురీయము లనెడి నాలుగు పాదములుగలదిగా వర్ణింపబడి నది. పాదములనగా గోష్పాదములవలెగాక నొక నాణెమునందు వ్యవహారార్థమై నాలుగు పాదములు (భాగములు) గలిగిన దానివలె జెప్పబడినది. వానియందు విశ్వతైజస ప్రాజ్ఞ పాదములు వ్యవహార కల్పితములు (ఆరోపిత ములు) ఆత్మస్వరూపమును పొందజేయుటచే పాదములనబడును. విశ్వుని తైజసునియందును తైజసుని ప్రాజ్ఞునియందును ప్రాజ్ఞుని తురీ యుని యందును ప్రవిలాపనచే పొందబడును. గనుక పాదమనబడినది. తురీయము చిదాత్మ యొక్క స్వాభావిక రూపము తురీయమె బ్రహ్మయని మహావాక్యమందు ప్రతిపాదింప బడినది.

చిదాత్మ స్వాభావిక రూపమైన తురీ యుడు అంతః ప్రజ్ఞుడైన తైజసుడు కాడు (స్వప్నావస్థ నిషేధింపబడినది) చిదాత్మ బహిష్ప్రజ్ఞుడైన విశ్వుడు కాడు (అనగా జాగ్రతావస్థయు, తద్గతమై సర్వప్రమాత ప్రమాణ ప్రమేయ వ్యవహారములు ప్రత్యక్ష అనుమాన. ఉపమాన అనుపలబ్ధి, అర్థాపత్తి జ్ఞానములును, శాబ్దికజ్ఞానమును, నిషేధింపబడి నవి) విశ్వతైజసాంతరాళస్థుడు కాడని (జాగ్రతావస్థనుండి నిద్రావస్థ పొందు సమ యమునందు చిత్తస్పందనము గలుగును అట్టి చిత్తస్పందనము నిషేధింపబడినది) చిదాత్మ ప్రాజ్ఞుడు కాడు. (అవిద్యాభంజకమైన అంతః కరణ వృత్తిరహితమై అవిద్యచే ఆవరింప

బడుటచే నిద్ర, అవిద్య నిషేధింపబడినది.) ఆత్మ జాగ్రత, స్వప్న, సుషుప్తులను ప్రకాశింప చేయుటచే అలుప్త ప్రకాశుడు, అన్యదృష్టి దర్శన రహితుడగుటచే అవ్యవహార్యుడు. ఇంద్రియములచే గ్రహింపబడనివాడు మనస్సుచే చింతింపబడని వాడు అగా మనో విషయుడు కాడు. శబ్దాతీతుడు, జాగ్రత, స్వప్న సుషుప్తులయందు అవ్యభిచారియై సాక్షియై "శ్లో" యచ్చాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయానిహ। యచ్చాస్య సంతతో భావస్తస్మాదాత్మేతి గీయతే॥ యని వచింపబడినటుల ఆత్మయనెడి ప్రత్యయముచే అపరోక్షముగ వ్యవహరింపబడెడి నిత్యచైతన్య జ్యోతియే తురీయుడు. జాగ్రదాదిస్థాన ధర్మ రహితుడగుటచే ప్రపంచరహితుడు, ప్రమాత ప్రమాణ ప్రమేయాది భేదవికల్పనా రహితుడగుటచే శాంతుడు, ప్రమాతృత్వాది త్రిపుటి ఆయాస రహితుడగుటచే సర్వమంగళ, ఆనంద రూపుడు. ద్వైత ప్రపంచ, తత్కారణ అవిద్యారహితుడగుటచే అద్వయుడు ఆత్మ. చతుష్పాదములు గలిగిన వాడని ప్రథమమున ఉపక్రమించి 'నాంతః ప్రజ్ఞం' యని విశ్వ తైజసప్రాజ్ఞులను ప్రతిషేధించుట యసమంజసమని శంకింపబని లేదు. విశ్వతైజస ప్రాజ్ఞులు అవిద్యా కల్పితులగుటచే రజ్వజ్ఞానముచే నారోపింపబడిన రజ్జువునందు కల్పింపబడిన సర్ప, స్రక్, భూఛిద్రములవలె మిథ్యాభూతులగుటచే విశ్వతైజస ప్రాజ్ఞుల కధిష్ఠానమైన తురీయుని బొందుటకు భేదవికల్ప నిషేధము చాలును. అవిద్యానివృత్తిచే స్వప్రకాశుడైన తురీయుడు శేషించును. తురీయము చతుర్థ వాచకమైనను అవిద్యాకల్పిత విశ్వతైజస ప్రాజ్ఞులకు విలక్షణుడై వానికి అధిష్ఠానమైనందున తురీయుడు విశ్వతైజస ప్రాజ్ఞ ధర్మ వర్జితుడగుటచే అద్వయుడు. అతనికి తురీయ పదము అవిద్యారోపితులైన విశ్వతైజసప్రాజ్ఞ దృష్టిలో నుపయోగింపబడినది. వేదాంతములయందు జాగ్రదాద్యవస్థలకు సాక్షియగు చిద్రూపుడైన ఆత్మ (తురీయుడు) బ్రహ్మ యని 'అయమాత్మా బ్రహ్మ' తత్త్వమస్యాది మహావాక్యములందు ప్రతిపాదింపబడుటచే వేదాంత ప్రకరణములను సద్గురువులవలన శ్రవణముచేసి, శ్రుత్యనుకూల తర్కముచే జగన్మిథ్యాత్వమునందును, ఆత్మకూటస్థ నిత్య జ్యోతి రూపత్వమునందును నిశ్చయము బొంది, జాగ్రత్స్వప్న సుషుప్తులను తద్ధర్మములను నిషేధించుచు బ్రహ్మాత్మైక్య ప్రత్యయ సంతానముచే ఏకాగ్రత (యోగము) నాశ్రయించి ధ్యానము చేయవలయును. నిధిధ్యాస సంస్కారముచే అంతఃకరణ చైతన్యముచే ఉజ్జ్వలమగును బ్రహ్మ, విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృత పంచమున కధిష్ఠానమగుటచేతను భగవంతుడగు సనత్కుమారునిచే 'ప్రమాదో వై మృత్యుః' యని వచింపబడినటుల జనన మరణ ప్రవాహమనగా బ్రహ్మనుండి జీవ భావమును బొందజేసిన అనాద్యవిద్య యగుటచే అనాద్య విద్యయే జీవుని సకల పుణ్యాపుణ్య కర్మబీజమగుటచేతను బ్రహ్మ

త్మైక్య నిదిధ్యాస జనిత ఆత్మసాక్షాత్కారముచే అనాదవిద్యయు తజ్జనిత సకల కర్మలును, అభినివేశములును నివర్తించుటచే జీవభావమునకు అధిష్ఠానమైన జీవుని స్వాభావిక రూపమైన బ్రహ్మపదము అవశ్యము సిద్ధించును.

తైత్తిరీయోపనిషత్ యందు "శ్రు॥ "ఓమితి బ్రహ్మ ఓమితీగ్ం సర్వం ఇత్యాది" మంత్రములచేతను ప్రశ్నోపనిషత్ యందు శ్రు॥ ఏతద్వై సత్యకామ పరంచాపరంచ బ్రహ్మయదోంకారః॥ మాండూక్యోపనిషత్ యందువలె ఇతర ఉపనిషత్ యందు ఈశ్వర వాచకమైన ప్రణవము "తస్యవాచకః ప్రణవః (పా. యో. సూ) ఉపాసనీయముగాను జ్ఞేయముగాను ప్రతిపాదింపబడినది. 'శ్రు॥ ప్రజాపతి లోకా నభ్యతప త్తేభ్యోఽభిత ప తేభ్య ఇత్యాది శ్రుతియందు ప్రజాపతి ఛందస్సులను పర్యాలోచనముచేసి వాని సారభూతములైన 'భూః భువః సువః యనెడి వ్యాహృతులను సారభూతములుగా గ్రహించెను. భూః భువః సువః వ్యాహృతులను పర్యాలోచనము జేయగా ప్రణవమును వాని సారభూతముగా గ్రహించెను. గనుక వేదములకు సారము ప్రణవమని యర్థము వేదములకు ఆద్యంతములందు ప్రయోగింపబడి దేవతలకు స్థానమై వేదసారభూతమై పరమాత్మ వాచకమైన ప్రణవమును తెలుసుకొనని వారికి వేదము వలన నేమి ప్రయోజనము. ప్రణవార్థమును గ్రహించినవారు వేదముయొక్క ప్రయోజనము పొందెదరని తైత్తిరీయారణ్యకమునందు ప్రతిపాదింపబడినది. ప్రణవము అ, ఉ, మ, యనెడి త్ర్యక్షరాత్మకము. ఓంకారము యొక్క ప్రథమ మాత్ర అకారము సర్వ వాక్ప్రపంచమును వ్యాపించి యుండుటచే అకారము జాగ్రితావస్థ, విశ్వుడు, విరాట్, ప్రథమ మాత్రయైన అకార ప్రధానముగా ప్రణవము నుపాసించువారు సర్వకామములను పొందెదరు. ద్వితీయమాత్రయైన ఉకారము అకారముకంటె శ్రేష్ఠమగుటచే స్వప్నావస్థ, తైజసుడు, హిరణ్యగర్భుడు, ఉకారమును ప్రధానముగా ప్రణవమును ఉపాసించు వారు విజ్ఞాన సంతతి వృద్ధిజేసెదరు. శత్రువులచే ప్రద్వేషింప బడరు. ప్రణవముయొక్క మూడవమాత్రయైన మకారము సుషుప్తి, ప్రాజ్ఞుడు, అవ్యాకృతుడు. మకార ప్రధానముగా ప్రణవము నుపాసించువారు జగద్యాథాత్మ్యమును తెలుసుకొనెదరు. ప్రణవముయొక్క నాలుగవమాత్ర అవ్యవహార్యము ప్రపంచ వర్జితము, అద్వైతరూపమైన ఆత్మయె. అనగా అకారము ఉకారమందును, ఉకారము మకారమందును మకారము ఓంకార (నాద) మందును లయము జేయగా నుదానుగతమై స్ఫురించెడి చైతన్యము ఆత్మ యని భావము ఇట్లు ప్రణవమును యావజ్జీవ ముపాసించువారు బ్రహ్మలోకమును బొందెదరు. ప్రణవార్థమును విచారించి ధ్యాన మథనముచే సాక్షిచైతన్యమును గ్రహించి బ్రహ్మాత్మైక్యనిష్ఠ బొందెడివారు ముక్తులు.

సమాప్తం

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(వైశాఖమాస సంచిక తరువాయి)

శ్లో॥ పురుష ఏవేద మిత్యాది వేదేషు సర్వకారణతయా యస్యసార్వాత్మ్యం
హాటకస్యైవ ముకుటాది తాదాత్మ్యం సరస మామ్నాయతే స త్త్వమసి తత్త్వమ్।

శ్రీ శంకర విజయము - సర్గ 10.

"పురుష ఏవేదగ్ం సర్వమ్" ఇత్యాది శ్రుతులయందు బ్రహ్మ జగత్కారణముగా ప్రతిపాదింపబడి కిరీటము మొదలగునవి బంగారమే యగు ముకుటస్వర్ణములకు తాదాత్మ్యము వలె జగమంతయు బ్రహ్మమే యని దృష్టాంత యుక్తులచే బోధించబడిన అఖండసచ్చిదానంద బ్రహ్మమె తత్త్వమసి మహావాక్యార్థతత్త్వము

పరిపూర్ణమైన సచ్చిదానంద బ్రహ్మ సార్వాత్మ్య భావమును, ప్రత్యగ భిన్నతత్త్వమును బోధించెడి శ్రుతులు ఉపనిషత్తులందు అనేకములు గలవు. వానిలో కొన్ని "శ్రు" పురుష వేదగ్ం సర్వం। యద్భూతం యచ్చ భవ్యమ్॥ భూత,భవిష్యద్వర్తమాన కాలమందు జగమంతయు పురుషుడే. 'శ్రు' ఆత్మైవేదగ్ం సర్వమ్" ఈ జగమంతయు బ్రహ్మమె 'శ్రు' సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి' ఇదంతయు బ్రహ్మమె. బ్రహ్మ జగమునకు జన్మ స్థితి లయకారణము యనియు, 'శ్రు' స ఏషోఽణిమైతదాత్మ్య మిదగ్ం సర్వమ్ స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో॥ ఇదియంతయు సత్. పదవాచ్యమైన సూక్ష్మమైన బ్రహ్మ "నీవు అది అయియున్నావు" అని ప్రపంచ బ్రహ్మలకు తాదాత్మ్యమును, జీవబ్రహ్మ తాదాత్మ్యమును ఉపక్రమాది షడ్లింగములచే బోధించుచు ప్రపంచవిలయమును బ్రహ్మైక్య సాక్షాత్కారమును ప్రతిపాదించుచున్నవి. ఇవి తైత్తిరీయ, మాండూక్య, చాందోగ్యోపనిషద్వాక్యములు. ముండకోపనిషత్ యందు శౌనకుడను ఋషి బ్రహ్మవిదుడగు అంగిరసుని "శ్రు" కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి" దేనిని తెలుసుకొనిన ఇదంతయు తెలియబడునో దాని నుపదేశింపుడని అడిగెను. ఆ ప్రశ్నకు సమాధానముగా అంగిరసుడు "శ్రు" యత్తదద్రేశ్య మగ్రాహ్యమగోత్ర మవర్ణ మచక్షుః శ్రోత్రం తదపాణిపాదం। నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యంతి ధీరాః" దృశ్యము కానిదియు, మూలము, వంశము లేనిదియు, స్థూలము కానిదియు శుక్లాది వర్ణ రహితమైనదియు చక్షుశ్శ్రోత్రాది జ్ఞానేంద్రియ రహితమైనదియు. వాక్పాణ్యాది కర్మేంద్రియ రహితమైనదియు, సర్వవ్యాపకమై అతిసూక్ష్మమైనదియు, నాశరహితమైనది నిత్యమైన సర్వస్థూల సూక్ష్మ భూతములకు కారణమైన బ్రహ్మ ధీరులు (సూక్ష్మబుద్ధిగల వివేకులు)

సాక్షాత్కారము బొందెదరు అని బ్రహ్మ జ్ఞానముచే సర్వవిజ్ఞానము బొందబడునని బ్రహ్మ సార్వాత్మ్య భావమును బోధించెను. ఛాందోగ్యోపనిషత్తుయందు శ్వేతకేతు ఉద్దాలక సంవాదముచే బ్రహ్మ సర్వాత్మ్య భావమును ప్రత్యగభిన్న బ్రహ్మదర్శనమును విశదీకరింపబడినది.

ఉద్దాలకుడను మహర్షి తన కుమారుడగు శ్వేతకేతువును వేదాధ్యయనము కొరకు గురుకులమునకు పంపెను. శ్వేతకేతువు గురువునొద్ద యిరువదినాలుగు సంవత్సరములు వేదమును, వేదాంగముల నధ్యయనము గావించెను. అతడు నిజగృహమునకువచ్చి తండ్రి నెదుటమానియై స్తబ్ధునివలె నిలుచుండెను. ఉద్దాలకుడు శ్వేతకేతువుతో నీవు కేవలము వేదాధ్యయనము చేసితివా లేక గురువునొద్దనే కారణభూతమైన బ్రహ్మవిషయమై శ్రుతి జనితజ్ఞానముచే, కార్యరూపమైన సర్వ జగము బ్రహ్మానన్యముగా శ్రుతమగునో నే బ్రహ్మ మననముచే జగమంతయు విమర్శింపబడునో, నే బ్రహ్మ విజ్ఞానముచే సర్వ జగము బ్రహ్మానన్యముగా విజ్ఞాతమగునో యా బ్రహ్మమును గురుకులమందు తెలుసుకొంటివా యని ప్రశ్నించెను. శ్వేతకేతువు, తండ్రి మాటలువిని నొక పదార్థ విజ్ఞానముచే మరియొక పదార్థ విజ్ఞానముటుల పొందబడునో బోధింపుడని వేడెను. ఉద్దాలకుడు తన పుత్రునకిట్లు ఉపదేశించెను. "శ్రుతి" యథా సౌమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజాతగ్ం స్యాత్ వాచారంభణం వికారో నామధేయం మృత్తి మృత్తికేత్యేవసత్యం ఏవం సదేవ సత్యమ్॥ ఒక మృత్పిండ విజ్ఞానముచే మృణ్మయములైన ఘటశరావాదికములెట్లు తెలియబడునో, అటులనే సద్రూపమైన బ్రహ్మజ్ఞానముచే బ్రహ్మ కార్యమైన సర్వజగము తెలియబడును. ఒక బంగారుముద్ద విజ్ఞానముచే యా బంగారముచే చేయబడు ముకుట కంకణాదికము లెట్లు తెలియబడునో అటులనే జగత్కారణమైన బ్రహ్మ విజ్ఞానముచే జగమంతయు తెలియబడును. ఘటశరావాదికములు మృద్వికారములగుటచే వ్యవహారము కొరకు మృత్తికయందు వివిధ ఆకారములు ఘటశరావాది నామములు కల్పించబడినవి. ఘటశరావాదులయందను గతమైన మృత్తిక కంటె ఘటశరావాది అన్యపదార్థములేదు ఘటశరావాదులు మృత్తిక కంటె వేరైనవికావు. అటులనే ముకుట కంకణాదికములయందు బంగారము కంటె వేరైన నామరూపాత్మకమైన ముకుట కంకణాదికములు లేవు. ముకుట కంకణాదికములు బంగారము మాత్రమే యగుటచే ముకుట కంకణాదికములయందును గతమైన (నిండియున్న) స్వర్ణ విజ్ఞానముచే బంగారు కార్యములైన ముకుట కంకణాదికములు తెలియబడును. అటులనే సర్వాత్మకమైన బ్రహ్మ విజ్ఞానముచే బ్రహ్మకార్యమైన సర్వ జగము విజ్ఞాతమగునని బోధించెను. ఇటులనే యాజ్ఞవల్క్యుడు తన భార్యయైన మైత్రేయికి 'శ్రుతి' మైత్రేయ్యాత్మనిఖల్వరే దృష్టే శ్రుతే

మతే విజ్ఞాతే ఇదం సర్వం విదితమ్॥ (బృ. 4-5-6) మైత్రేయి ఆత్మవిషయమైన వేదాంత శ్రవణముచేతను, తదర్థ మననముచేతను, ఆత్మ సాక్షాత్కారము చేతను ఇదంతయు (సర్వజగమును) విదితమగును యని బోధించెను.

పూర్వపక్షము : కార్యమైన జగము కారణుడైన బ్రహ్మకు అనన్యమైన బ్రహ్మ జగద్విశిష్టుడగును. విశేషణము విశేష్యమునకు భిన్నమైనందున జగము బ్రహ్మకు భిన్నమగును.

సిద్ధాంతము : జగము బ్రహ్మకు భిన్నము గాదు. అభిన్నమగాదు. భిన్నాభిన్నముగాదు. కార్యమైన జగము కారణమైన బ్రహ్మకు భిన్నమైనచో కార్య గతసత్తా (ఉనికి) కారణ గతసత్తా మాత్రమేనా? అన్యమా? కార్య సత్తా కారణగత సత్తా మాత్రమేగాన సత్తా ఏకమైనందున కార్యమునకు కారణవ్యతిరిక్త సత్తా లేదు. సత్తా ఏకమైనను కార్యము కారణమునకు భిన్నముగా ననుభవింపబడు చున్నదని శంకింపబనిలేదు. కార్య సత్తా కారణ సత్తా మాత్రమే మైనందున కార్యము అసద్రూపము. స్వతస్సత్తా రహితము. కనుక కార్యము కారణమును భిన్నమైనందున సద్రూపమనుట నసంగతము. అసత్యమైన కార్యము నరవిషాణమువలె వికల్ప మాత్రమైనది. కార్యసత్తా కారణసత్తాకంటె అన్యమైన యడల సద్రూపముగా భిన్నమా! అసద్రూపముగాభిన్నమా! ఉభయములు సద్రూపముచే భిన్నములని ఉభయములు సద్రూపములగుటచే, రూపముచే భేదమసంభవము. అసద్రూపముగా భిన్నమనిన అసద్రూపమైన కార్యమునకు వంధ్యాసుతునివలె కార్యత్వమసంగతము. ప్రధ్వంసాభావము (ఘటనాశనముచే గలుగుఘటాభావముధ్వంసాభావమనబడును. ప్రధ్వంసాభావము జనించును నిత్యమని తార్కికుల మతము) వలె అసద్రూపము గార్యముకావచ్చుననిన ప్రధ్వంసాభావము వస్తుత అత్యంతాభావ మాత్రమే యనిన కారక సంబంధ లక్షణ మంగతము. కార్యము అసత్యమైనను వంధ్యా సుతునివలె అత్యంతాసత్యము కానందున కార్యాసత్యత్వమునందు కించెము విశేష మున్నదనిన యా విశేషమేమి! కారకసంబంధమా! ఉత్పత్తిక్రియా సంబంధమా! కారక సంబంధమనిన వంధ్యాసుతునకు కారకసంబంధ ప్రసక్తి కలుగును. కార్యమునకు కారక సంబంధము కల్పించుటకు చెప్పబడు విశేషమే సంబంధమనిన విశేషము నిర్ధారితమైనందున సంబంధ రహితము. విశేషముకంటె సంబంధము వేరనిన యా విశేషమునే విశేషము కంటె వేరైనది! ఆ విశేషము పూర్వోక్త సంబంధమేనా! వేరైనదా! మూడవదా! ఆ విశేష పూర్వోక్త విశేషమేయైన అన్యోన్యాశ్రయత్వము. అన్యమైన చతుర్థాది విశేషములు అంగీకరింపబడవలెను గనుక అనవస్థా దోషము సంభవించును.

జనిక్రియ సంబంధమును పైయుక్తులచే కార్యమున కసంభవము కనుక సద్రూపమైన కార్యోత్పత్తి యసంగతము. సద సదాత్మకములు విరుద్ధములైనందున ఉభయాత్మక కార్యోత్పత్తి యసంభవము. కనుక కార్యము కారణమునకు భిన్నమైనదనియు భిన్నాభిన్నమైనదనియు నిరూపణానర్హము. కారణము కార్యమాత్రమగుట గాని, కార్యజ్ఞానముచే కారణ జ్ఞానము గల్గుటగాని యసంభవమగుటచే కార్యము కారణమునకభిన్నము గాదు. కారణాజ్ఞాన దశయందు కార్యము కారణమునకు భిన్నముగా దోచను లేక కారణము స్వరూపతః తెలియబడక కార్యముగా కనబడును. కార్యమైన ఘటమునకు పృథుబుధ్నోదరాద్యాకార విశేషములు ప్రతీతి మాత్రమై అసత్యములు. కారణమైన మృత్తికారూపముగా సత్యమైనవి. అటులనే నామరూపాత్మకమైన జగము అసత్యము. జగము కారణాత్మకముగా బ్రహ్మమేయగును. ఆత్మవిజ్ఞానముచే సర్వ ప్రపంచవిజ్ఞానమును 'పురుష ఏదగం సర్వం' ఇత్యాది శ్రుతులవలన బాధసమానాధికరణముచే బోధింపబడుచున్నది

(సశేషం)

గ్రంథ సమీక్ష

"హిందూమతము"

వెల 2 రూపాయలు

గ్రంథకర్త: ఆర్షవిద్యాభూషణ, శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు
ప్రిన్సిపాల్, సంస్కృత కళాశాల, కొవ్వూరు, పశ్చిమగోదావరిజిల్లా.

ప్రతి హిందువూ తప్పక పఠించవలసిన గ్రంథమిది. ఈ గ్రంథము నొక్కసారి చదివితే హిందూమతముపై, కేవలం అభిమానము మాత్రమేగాక భక్తిశ్రద్ధలు కూడ కుదురుకొనగల వనడంలో సందేహంలేదు. మన హిందూమతములో వర్ణవ్యవస్థ ప్రధానమైనది. ఈ విషయమునుగుర్తింపజేయుటలో రచయితల కృషి ఫలించినది. విగ్రహారాధన విషయంలో ఉపాసకుని శక్తి ననుసరించియే యుపాసన సాధనము లేర్పడవలెనుగాని పరమేశ్వర శక్తిని బట్టి యేర్పరచుట సాధ్యమా! కొండంత దేవునకు కొండంత పత్రి వేయకలమా! మనకు దృష్టి నిలచుటకై విశ్వవ్యాప్తిని తాత్కాలికముగా విగ్రహములో దర్శింతము. ఇది మన సౌకర్యముకొఱకేయని గుర్తింపవలయునని మన ఆర్ష విద్యాభూషణులు బహుచక్కగ సమర్థించారు. గ్రంథమంతయూ మిక్కిలి ప్రేరేపణా శైలిలో సాగినది.

సమీక్షకుడు

42

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గత సంచిక తరువాయి)

సమానాధికరణము నాలుగు విధములు. 'ఇదం రజతం' యను వాక్యమందు శుక్తిత రజత సమానాధి కరణము అధ్యాస సమానాధి కరణము. "రజతం శుక్తికమేవ" యను వాక్యమందు రజత శుక్తికములకు బాధసమానాధి కరణమని వచింపబడుచున్నది. అనగా శుక్తికజ్ఞానముచే అధ్యసింపబడిన రజతము బాధింపబడును. (విలయము పొందును.) "పురుష ఏవేదగ్ం సర్వం" "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇత్యాది వాక్యములందు ప్రపంచోపాదానమైన బ్రహ్మవిజ్ఞానముచే ప్రపంచము బాధింపబడుటచే బాధ సమానాధి కరణము బోధింపబడుచున్నది. 'నీలోత్పలం' యను వాక్యమందు నీలత్వ ఉత్పలత్వములకు విశేషణ విశేష్య సమానాధి కరణము నాలుగవ సమానాధి కరణము తాదాత్మ్య సమానాధి కరణము "తత్త్వమసి" యను మహావాక్యమందు ప్రత్యగాత్మ పరమాత్మల తాదాత్మ్యము. తాదాత్మ్య సమానాధి కరణముచే బోధింపబడుచున్నది. కనుక బ్రహ్మ విజ్ఞానముచే సర్వము బ్రహ్మరూపముగా గోచరమగునని భావము.

పూర్వపక్షము : ఘటపటాదుల యందు భేదమనుభవింపబడుటచే ఘటపటాది వస్తు భేదముగలదు. బ్రహ్మ ఘటపటాది పదార్థ సహితుడగుటచే బ్రహ్మ నిష్ప్రపంచుడను సమంజసము గాదు.

సిద్ధాంతము : ఇది ఘటము ఇది పటమని అనుభవింపబడుటచే ఘటపట స్వరూపములకు భేదముగలదని ప్రాభాకరులు వాదించెదరు. వారు ఘటపటస్వరూపములకంటె భేదమనెడి పదార్థము మరొండు లేదని అంగీకరించెదరు. నిర్వికల్పక వస్తువులందు స్వరూపముచే భేద మనుభవింపబడక పోయినను సవికల్పక వస్తువు భేద ప్రతియోగి సాపేక్షమైనందున ఘటపటములయందు భేదమున్నదని తెలియబడుచున్నందున వస్తురూపముకంటె వేరైన ధర్మము భేదమని వైశేషికులు వాదించెదరు. ప్రాభాకరుల వస్తుస్వరూప భేదవాదమును, వైశేషికుల భేదధర్మ వాదమును నిరసింపబడుచున్నవి. వస్తుస్వరూప భేదమనుపపన్నము. వస్తుస్వరూపము గ్రహింపబడునపుడు అన్యవస్తు స్వరూప గ్రహణ ప్రసక్తి లేనందున ఘటపట స్వరూపములయందు భేదమును గ్రహించుట యసంభవము. స్వరూపభేదమనగా స్వరూపము భేదమందు అంతర్భావము పొందునా! లేక స్వరూపమందు భేదము అంతర్భావము పొందునా! స్వరూపభేదమందు అంతర్భా

వము బొందెడి యెడల స్వరూప వ్యవహార లోపము. భేదము స్వరూపమంతర్భావము బొందునెడల భేదము మాత్రమే స్వరూపమునందంతర్భావము పొందునా? లేక భేద ప్రతియోగి ఘటిత భేదము అంతర్భావము పొందునా భేదము మాత్రమే అంతర్భావము బొందునెడల భేద వ్యవహారమే లేదు. భేద ప్రతియోగి ఘటిత భేద మంతర్భావము పొందునెడల పటభేదము ఘట మంతర్భావము పొందుటచే ఘటము పటమున కభిన్నమగును. చిత్సుఖాచార్యునిచే 'శ్లో॥ సాపేక్షత్వాత్సావధేశ్చ తత్త్వద్వైతపరిసంగతః ఏకాభావ వద సందేహాన్న రూపం వస్తు నోభిదా॥' యని పలుకబడినది. ఘటముకంటె పటము వేరైనది. ఘటపటములకు భేదము ఘటపటముల భేద ధర్మమని వాదించెడి వైశేషికుల వాదము నిరూపణానర్హము ఘటపటములందు కేవల భేదమే గోచరించునా! భేదపూర్వకమైన వస్తువు గ్రహింపబడునా! వస్తుపూర్వకమైన భేదము గ్రహింపబడునా! వస్తువు భేదము నొక పర్యాయమే గోచరించునా! భేద ధర్మ ప్రతియోగి గోచరింపక కేవల భేదము గోచరించుట నశక్యము. శబ్ద బుద్ధికర్మలు త్రిక్షణావస్థానముగలిగిన వగుటచే భేదమును గ్రహింపక భేదపూర్వక వస్తువును గ్రహించుట యసంభవము. ప్రథమమున వస్తువును గ్రహించి తరువాత భేదమును గ్రహించుటే నశక్యము. భేదజ్ఞానమునకు భేదధర్మప్రతియోగిజ్ఞానము కారణమగుటచే భేదధర్మప్రతియోగి జ్ఞానము పూర్వక్షణమందు నశించుటచే భేదమును వస్తువును నొకపర్యాయము గ్రహించుట దుర్లభము. దండీ దేవదత్తః ఇత్యాదులయందు దండవిశిష్టుడైన దేవదత్తుడు గ్రహింపబడుటచేతను విశేషణము విశేష్యమునకు భిన్నమగుటచేతను భేదముచే విశేషణములైన వస్తువులు భిన్నములనిన అటుల కాదు. విశేషణ విశేష్య భావముచేతనే భిన్నములా! భేదాంతరమా! విశేషణ విశేష్య భావముచే ఘటపటములు భిన్నములు. అదియే భేదమనిన ఆత్మాశ్రియ దోషము. విశేషణ విశేష్యభావముచే భిన్నములు. భిన్నములైనందున విశేషణ విశేష్యములనిన అన్యోన్యాశ్రయత దోషము. భేద వ్యక్తి పరంపరా స్వీకరింపబడిన యడల అనవస్థా దోషము. చిత్సుఖాచార్యునిచే ఇటుల చెప్పబడినది. "శ్లో" యుగ పద్గ్రహణాయోగాదీనవస్థా ప్రిసంగతః పరస్పరాశ్రియత్వాచ్చ ధర్మభేదేపి నాక్షధీః యని వస్తు భేదము నిరాకరింపబడినది. గనుక ఘటపటాద్యాకరములు మాయచే బ్రహ్మయందు కల్పింపబడినవి. వస్తు భేదము మిథ్యాభూతమైనది. (సశేషం)

(29వ పేజీ తరువాయి)

భాగమే మిగిలియున్నవి. అవికూడా క్రమంగా క్షీణించి చివరకు సంపూర్ణంగా నశించిపోతవి. ప్రవాహమును అనుసరించి యీదటము సులభమే కానీ దానికి యెదురుగా దానిని యెదిరించి యీదడమనేది సాహసకార్యము. ప్రవాహ వేగము యెంతెంత అధికంగా ఉండునో దానిని యెదిరించి యెదురుగా యీదడమనేది అత్యంత కష్టసాధ్యముగానుండును. పెద్దప్రవాహము ఉన్నయెడల దాని యెదురుగా యీదగలిగిన వాడు నిజంగా మొనగాడేమరి. అందువలన కృతయుగంలోని మత్స్యకూర్మాది అవతారము లందరికంటే త్రేతాయుగములోని రామ, పరశురామావతారములకంటె ద్వాపరయుగంలోని మత్స్యావతార, కృష్ణద్వైపాయనాది అవతారములకంటె ధర్మముయొక్క వగక్షీణించి అధర్మము తాండవించుచూ అత్యంతతీవ్రంగా ఉన్న యీకలియుగములో అధర్మవేగమును యెదిరించి నిర్మూలనచేసి ధర్మమును స్థాపించినటువంటి భగవత్పాదావతారము గొప్పదికాదా? మొనగాడి అవతారముగాదా! యీ దృష్టితో చూచిననూ భగవత్పాదావతారము గొప్పది. శంకరజయంతి జయంతీసార్వభౌమ మనిపించుకొంటున్నది (సశేషం)

(15వ పేజీ తరువాయి)

లక్షలకొలది సఖులు కలరు. నేనెట్లు నిత్యవిగ్రహుఁడనో అట్లే వీరంతయును నిత్యులే. నా తండ్రి నందుఁడును, తల్లియగు యశోదయును, శ్రీ దామాది సఖులును, గోపకులును, గోవులును, నాయీ బృందావనమును ఇవన్నియును నిత్యములు. సచ్చిదానంద రసమయములు. నాయీ బృందావన మనునది ఆనంద నిలయమైనదిగా భావింపవలయును.

శ్రీకృష్ణ తత్త్వమును ఓంకారమునకుఁ బోల్చుచు నిట్లు చెప్పఁబడినది.

శ్లో॥ రోహిణీ తనయో రామో అకారాక్షర సంభవః।
తైజసాత్మక ప్రద్యుమ్న ఉకారాక్షర సంభవః
ప్రాజ్ఞాత్మకోఽనిరుద్ధో వై మకారాక్షరసంభవః
అర్థమాత్రాత్మకః కృష్ణో యస్మిన్ విశ్వం ప్రతిష్ఠితమ్
కృష్ణాత్మికా జగత్కర్త్రీ మూల ప్రకృతి రాధికా
వ్రజస్త్రీ జన సంభూతః శ్రుతిభ్యో బ్రహ్మ సంగతః॥

రోహిణీ పుత్రుఁడగు బలరాముఁడు 'అ' కారమువలన (విశ్వుఁడు) బుట్టినాఁడు ఉకారమున తైజసాత్మకుఁడై ప్రద్యుమ్నుఁ డుదయించినాఁడు ప్రాజ్ఞాత్మకుఁడై మకారాక్షరము వలన అనిరుద్ధుఁ డుదయించినాఁడు. ఎవనియందీ విశ్వమంతయును బ్రతిష్ఠింపఁబడియున్నదో అట్టి అర్థమాత్రా స్వరూపుఁడగు [తురీయుఁడు] కృష్ణుఁడున్నాఁడు జగత్తునకు కర్త్రియును కృష్ణాత్మికయునగు రాధిక మూలప్రకృతి స్వరూపిణి. శ్రుతులు బ్రహ్మసాంగత్యముచే వ్రజస్త్రీ జన సంఘముగ నుదయించెను.

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

గతసంచిక తరువాయి

ఉద్దాలక మహర్షి శ్వేతకేతువునకు తత్త్వోపదేశము చేసిన శ్రు॥ "సవిషోఽణిమైతదాత్మ్య మిదగ్ం సర్వం స ఆత్మా తత్త్వమసి" అను మహావాక్యము గలిగిన ఛాందోగ్యోపనిషత్ షష్ఠాధ్యాయము ద్వితీయఖంధ ఉపక్రమమందు. శ్రు॥ "సదేవ సోమ్యేద మగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్" అనివిన బడినది. ఈనామ రూపాత్మక జగమునకు పూర్వము 'సత్' శబ్దవాచ్యమైన బ్రహ్మ మాత్రమే యుండెను. 'సత్' యనగా సత్తా (ఉనికి) మాత్రము అది అత్యంత సూక్ష్మమైనది. శబ్దస్పర్శాది విశేష రహితమైనది. నిర్గుణము అవయవ రహితమైనది. సర్వ వేదాంతములచే తెలియబడు విజ్ఞానము (చైతన్యము) అనగా స్థూలసూక్ష్మ ప్రపంచ సృష్టికి పూర్వము ఇది ఆకాశము ఇదివాయువు ఇది శబ్దము, ఇది స్పర్శము, ఇది ఇంద్రియము ఇది మనసు అని నామరూపాత్మగా వ్యవహరించుటకు వీలులేనిది. సత్' శబ్దబుద్ధిమాత్రగమ్యమైన బ్రహ్మ సుషుప్తినుండి ఉత్థితుడైన వానికి గోచరించు సుషుప్తికాలమందు సత్తావలె నుండెనని యర్థము. 'ఏవ' శబ్దముచేత ఘటశరీరములు చేయుటకుముందు మృత్తిక మాత్రమే నుండెనని చెప్పబడినట్లు కుండలు చేయు కుమ్మరివానిని నిషేధించుచు ప్రపంచ సృష్టికిముందు సద్రూపమైన బ్రహ్మ మాత్రమే యుండెను. 'ఏకమేవా ద్వితీయమ్' అను పదములచేత కార్యమైన జగదుత్పత్తికి హేతువు బ్రహ్మకంటె అన్యపదార్థము నిషేధింపబడినది, కుండలు చేయుటకు మృత్తిక కంటెవేరైన కుమ్మరివాడు అవసరమగునట్లు జగదుత్పత్తికి అన్యమైన నిమిత్త కారణము నిషేదింపబడినది. బ్రహ్మయందు సజాతీయ విజాతీయ, స్వగతభేదము నిషేధింపబడినది. మృత్తిక జడమగుటచే చేతనుడైన కులాలుడు ఘటోత్పత్తికి యవసరమగును. బ్రహ్మ చిద్రూపు డగుటచేఅభిన్న నిమిత్తఉపాదాన కారణుడై జగమును సృజించెను.

సృష్టికిపూర్వము సదభావముండెనని శూన్యవాదము శ్రుతియందు "తద్దైక ఆహురసద్ వేదమగ్ర ఆసీదేకమే వాద్వితీయం తస్మాద సతః సజ్జాయతే" యనిఉపన్యసింపబడి "కథమ సతః స జ్జా య తె సత్త్వేవ సోమ్యేదమగ్ర ఆసీత్" అభావము 'అసత్' నుండి యెట్లు వ్యవహారయోగ్యమైన జగముద్భవించును! కనుక సృష్టికి పూర్వము సద్రూపమేయుండెను అని శూన్యవాదము నిరసింపబడినది.

జగమునకు బ్రహ్మ అభిన్ననిమిత్తోపాదాన కారణశ్రుతిచె సాంఖ్యుల ప్రధాన మనెడి సత్వరజస్తమోగుణసామ్యావస్థయను

ప్రకృతి స్వతంత్రముగా జగత్కారణమను ప్రధానకారణవాదమును, ఈశ్వరుడు పరమాణువులను ఉపాదానముగా స్వీకరించి జగమును సృజించునను తార్కికుల పరమాణు వాదమును నిరసింపబడినవి.

బ్రహ్మ నిత్యుడు, చిద్రూపుడు, సర్వవ్యాపి, అద్వయుడు, నిరవయవుడగుటచే ప్రపంచసృష్టియందు బ్రహ్మయందువివిధమైన పరిణామముగాని వికారముగానియుండుట యసంభవము నిత్య శుద్ధబుద్ధముక్తస్వరూపుడైన పరమేశ్వరుడు "శు॥సోఽకామయతబహుస్యాంప్రజాయేయేతి - తదైక్షత" ఇత్యాది వాక్యములందు జగమును పర్యాలోచనచే సృజించెనని వినబడుటచే బ్రహ్మతన అనిర్వచనీయ మాయాశక్తిచే, సముద్రమునుండి తరంగ బుద్బుదఫేనము లుద్భవించునటులను, రజ్జ్వజ్ఞానముచే రజ్జువునందు సర్పము సృజింపబడునటులను, స్వప్నదృష్ట స్వాప్నిక ప్రపంచమును సృజించునటులను జగమును సృజించెను మాయ సదసదాత్మకముగా అనిర్వచనీయమగుటచే బ్రహ్మయందు ద్వైతాశక్తి లేదు. కనుక బ్రహ్మజగమునను అభిన్న నిమిత్తోపాదాన కారణుడై జగద్రూపముగా వివర్తము పొందెను. (సశేషము)

దారాపుత్రాది సౌఖ్యము ననుభవింపుటకు మనుష్యజన్మాదులతో పనిలేదు. ఏమి? ఆసౌఖ్యము పశుపక్ష్యాదులందు లేదా? కలదు. ఇకదుర్లభమగు మానవజన్మమును అందును దుర్లభమగు పురుషత్వమును, అందును గడు దుర్లభమగు వివేకమును సాధించి పశుపక్ష్యాదిజన్మ సులభమగు పుత్ర కళత్రాది సౌఖ్యము నోరు దెరుచుకొని యుండవలసినదేనా?

ఓ అర్జునా ! ఎవరేప్రకారముగ నన్ను సేవింతురో వారి నాప్రకారముగనే నేను గ్రహింతును. మనుజుల సర్వవిధముల నామార్గముననే అనుసరించు చున్నారు.

శ్రీకృష్ణభగవానుడు

నన్ను కర్మలంటవు నాకు కర్మ ఫలమందపేక్షయు లేదు. ఈ ప్రకారముగ నన్ను గూర్చి యెవడు తెలిసికొనునో అతడు కర్మములచే బంధింపబడడు.

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గత సంచిక తరువాయి)

ఆద్యంత రహితమై అద్వయమైన బ్రహ్మ పూర్వకల్ప ప్రాణి పుణ్యపాప కర్మ సంస్కారములు బ్రహ్మయందు ప్రళయ కాలమందు లీనమైయుండుటచే యా కర్మలు కాలముచే పరిపాకముబొంది ఫలప్రదానోన్ముఖమైనపుడు అంతః కరణోపాదాన భూతమైన సత్వవృత్తి సమాశ్రితమై సృజింపబడవలసిన కార్య ప్రపంచ విషయావృత్త్య వచ్ఛిన్నమై అభిన్న నిమిత్తోపాదనమై బహు భవనస్సృష్టి ఈక్షణమునచే జగమును సృజించెను. ఛాందోగ్య శ్రుతియందు "తదైక్షత బహుస్స్యాం ప్రజాయే యేతి తత్తేజోఽసృజత తత్తేజ ఐక్షత తదపోఽసృజత - తా అన్నమ సృజంత" యని సద్రూపమైన బ్రహ్మ అగ్ని, జలము, పృథివిని సృజించెనని వినబడినను తైత్తిరీయోపనిషత్తులయందు వినబడిన సూక్ష్మభూతముల సృష్టి పంచీకరణముద్వారా స్థూల భూతములైన ఆకాశాది భూతముల సృష్ట్యుపలక్షణమే యగును. పరమేశ్వరుడు సూక్ష్మ భూత పంచీకరణోపలక్షితమైన తేజోబన్నముల త్రివృత్కరణముచే జరాయుజ, అండజ స్వేదజ, ఉద్భిజములను భూతగ్రామముల సృజించెను. జరాయుజములనగా మనుష్యాది శరీరములు; అండజములనగా గ్రుడ్డునుండి ఉద్భవించు పక్షి పన్నగాది శరీరములు. స్వేదజములనగా మశకాదికములు. ఉద్భిజములనగా వృక్షాదులు, 'శ్రు॥' సేయం దేవతేమాస్తిస్రో దేవతా అనేన జీవాత్మనాను ప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి' యను శ్రుతిచే జగత్కారణుడైన బ్రహ్మ, జలతరంగ బుద్బుదాదులయందు సూర్యబింబమువలె చతుర్ముఖ బ్రహ్మాండాది అండజాది సర్వ శరీరముల యందు చిద్రూపముగా ప్రవేశించి పూర్వకల్పానుసరణముచే వివిధ నామ రూపములను సృజించెను అనగా యనేక నామరూపములచే వ్యవహరింపబడునది. బ్రహ్మయని భావము. పంచీకృతమైన స్థూలభూతములు వాని కారణమైన సూక్ష్మభూతముల కంటె వేరైనవి కావని అగ్నియొక్క యెరుపు, జలముయొక్క తెలుపు, భూమియొక్క నలుపు సూక్ష్మభూతము లవిమాత్రమే యనియు, స్థూలభూతములు నామరూపములచే వేరుగా వ్యవహరింపబడుచున్నను, స్థూలభూతములు మిథ్యాభూతములనియు సూక్ష్మభూతములు సత్యములనియు, అటులనే కార్యభూతములు కారణభూతానన్యత్వ మిథ్యాభూతత్వ ప్రతిపాదనచేత సకల స్థూల సూక్ష్మ ప్రపంచము పరమ కారణమైన సద్రూపమైన బ్రహ్మ నన్యత్వము అసత్యత్వము ప్రతిపాదింపబడినది "శ్రు॥" సఏషోఽణిమైతదాత్మ్యమిదం సర్వమ్ సఆత్మా తత్త్వమసి శ్వేతకేతో అను మహా వాక్యమందు ద్వితీయ భాగమైన

'స ఆత్మా తత్త్వమసి' అను భాగము వ్యాఖ్యానము చేయబడుచున్నది. ఉద్దాలక మహర్షి తన కుమారుడగు శ్వేతకేతువును నిమిత్తముగా సకలజీవులకు పరమపురుషార్థ హేతువగు బ్రహ్మవిద్య - పరమపావనియైన శ్రుతి సర్వాత్మ భావము బోధించి, నీవు సచ్చిదానందమై బ్రహ్మవని బోధించుచున్నది. జీవులు అనాద్య విద్యచే బ్రహ్మయందు మాయచే అధ్యసింపబడిన కార్యకారణ ప్రపంచమైన దేహము, ప్రాణములు, ఇంద్రియములు, మనోబుద్ధి చిత్తాహంకారములను అంతఃకరణము, శబ్దస్పర్శ రూప రసగంధములు ఆత్మయని భ్రమచే పుణ్యాపుణ్య కర్మవశమున జనన మరణ సంసారమును పొందుటచే అహం ప్రత్యయ విషయమైన ఆత్మయందు దేహాదిభ్రమ నివర్తింపజేసి శుద్ధమైన అపరోక్ష చైతన్యమునందు నిశ్చయముబొందజేయుటకు యుక్తులచే విచారించినది.

భుజింపబడిన అన్నము జఠరాగ్నిచే పచనము చేయబడి మూడు విధములుగా విభజింపబడును. స్థూలభాగము పురీషమగును. మధ్యమ భాగము అన్నధాతువు మాంసమగును. సూక్ష్మధాతువు అన్నరసముగా పరిణమించి హృదయమునుబొంది సూక్ష్మనాడులయందు ప్రవేశించి వాగాది ఇంద్రియములకు స్థితిగలిగించి మనోరూపముగా పరిణమించును. గనుక మనస్సు అన్న పరిణామ వికారమగుటచే అనిత్యమే యగును. ఆత్మగాదు.

త్రాగబడిన జలము మూడు విధములుగా విభజింపబడి స్థూలధాతువు మూత్రమగును మధ్యమ ధాతువు రక్తమగును సూక్ష్మ ధాతువు ప్రాణమగును.

భుజింపబడిన తైల ఘృతాది తేజము మూడు విధములుగా విభజింపబడి స్థూల ధాతువు ఎముకలగును. మధ్యమధాతువు ఎముకలయందుండు మజ్జ యగును. సూక్ష్మ ధాతువు వాగింద్రియ మగును. అందువలన తైలఘృత భక్షణముచే వాక్ విశదమై మాట్లాడుటకు సమర్థుడగును.

అన్నము భుజించని యెడల మనస్సు, ఇంద్రియములు దుర్బల మగును. జలము త్రాగని యెడల ప్రాణములు క్షీణించును. తైలఘృతాదులు భుజించని యెడల వాగింద్రియము దుర్బలమగును.

అన్నము (పృథివి) జలము అగ్ని పరిణామముచే, దధి మథనముచే సర్పి ఉద్భవించునటుల, అన్న, జల, ఘృతాదులు జఠరాగ్నిచే మథింపబడి స్థూలదేహము, ఇంద్రియములు, మనస్సు (అంతఃకరణము)గా పరిణమించుటచే దేహము, ప్రాణము ఇంద్రియములు అంతఃకరణములు భౌతికములై అనిత్యములు జడములై నందున చిద్రూపుడైన ఆత్మగావు. కనుక ముముక్షువులు భౌతికములైన దేహేంద్రియ ప్రాణ అంతఃకరణలయందు ఆత్మబుద్ధి వదలి అపరోక్ష చైతన్యమందు ఆత్మబుద్ధి పొందవలయును.

(సశేషము)

“తత్త్వమసి తత్త్వమ్”

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

[గత సంచిక తరువాయి]

అనేక విధ పుష్పములనుండి నానావిధ వృక్షరసములను తేనెటీగలు స్వీకరించి తేనె తెట్టెను పెట్టినపుడు తేనెనుండి పుష్పరసములను వేరుచేయుటకు వీలులేనటులను తేనె నుండి వృక్షరసముల మధురామ్ల తిక్తకటుకాది రసములను వేరుగా తెలియనేరనటుల సర్వజీవులు వ్యాఘ్రముగాని సింహము మనుష్యుడు, కీటము, పక్షులు సుషుప్తిపొందినపుడు వారి వారి కర్మ జ్ఞాన వాసనలు సద్రూపమైన ఆత్మయందు ఏకీభవించి వేరు వేరుగా తెలియబడక పోవుటచే సుషుప్తియందు సర్వజీవులు బ్రహ్మను పొందియు మరల అవిద్యావశమున మరల మరల సింహాది రూపము వ్యవహరించుటచే కామ కర్మ వాసనలకు కారణమైన అవిద్యా నాశనముచే జగద్యోనియైన బ్రహ్మను శాశ్వతముగా పొందెదరు.

శాఖాపత్ర పుష్పాద్యవయవములు గలిగి మహా వటవృక్షమునకు అతిసూక్ష్మమై వట బీజము కారణమై వటవృక్షమును కలిగియుండుటచే అనిసూక్ష్మమై వటబీజము అన్వేషించుటకు దాని కార్యమైన వృక్షమును నిరాకరించవలయును అటులనే జగమునకు కారణమైన బ్రహ్మను అన్వేషించుటకు శ్రద్ధయు బాహ్యవిషయముల యందనాసక్తియు చిత్త సమాధానములు ఆరోపిత జగన్నిరాకరణము లేనియెడల ఆత్మసిద్ధింపదు.

పూర్వము గాంధార దేశము నొక గ్రామము నుండి నొక పురుషుని తస్కరులు నేత్రముల బంధించి విజనారణ్య ప్రదేశమును తీసికొని పోయి ధనము నపహరించి అరణ్యమునందు వదలిరి. ఆ పురుషుడు ఏదిక్కు తెలియక తన గ్రామమునకు వెళ్ళలేక రోదనము చేయుచుండగా దయాళువైన నొక పురుషుడు నేత్ర బంధనమునువిప్పి గాంధారగ్రామ మార్గమును ఉపదేశింపగా నొక్కొక గ్రామము తెలిసికొనుచు స్వగ్రామము చేరెను. అటులనే అనాద్య విద్యచే జీవులు పాపపుణ్య కర్మవశమున తిర్యగాది యోనులయందు జనించి అనేక దుఃఖయుతులై నొకానొక జన్మయందు పూర్వపుణ్యాతిశయముచే విరాగము బొంది దయాళువైన శ్రోత్రియ బ్రహ్మవిదునిచే ఉపనిషజ్ఞానమును బోధింపబడి బ్రహ్మ సాక్షాత్కారముబొంది శరీరపాతమువరకు ప్రారబ్ధకర్మ ననుభవించి జనన మరణ రహితమైన బ్రహ్మను పొందెదరు. తస్కరాదుల యందారోపింపబడిన దోషమును పరీక్షించుటకు అగ్నితప్తమైన పరశును తస్కరాదుల

హస్తముచే పట్టించెదరు తప్తపరశును గ్రహించిన పురుషుడు నిర్దోషియై సత్యము పలికిన యెడల అగ్నితప్తమైన పరశు నాతని హస్తమును దహింపదు. అతడు నిర్దోషియని బంధమునుండి విముక్తుడగును. దోషియైన పురుషుడు తప్తపరశును హస్తముచే గ్రహించినపుడు నతడు అసత్యమును అనుసంధానము చేయుటచే నతని హస్తము దహింపబడి దోషమునిరూపింపబడి కారాగారబద్ధుడగును. అటులనే సత్య చిద్రూపమైన బ్రహ్మను తనుగా గుర్తించి అనుసంధానముచే వర్తమానకాలమందు ఆనందమనుభవించుచు జనన మరణ సంసారబంధ విముక్తుడగును. అసత్యమైన జగమును, జీవభావము ననుసంధానముచేయు పురుషుడు సంసారదుఃఖము లనుభవించుచు జనన మరణముల పొందును. ఛాందోగ్యాది సకలోపనిషత్తుల యందును ఉపక్రమాది షల్లింగములచే జీవబ్రహ్మ తాదాత్మ్యము బోధింపబడుచున్నది ఛాందోగ్యోపనిషత్ యందు "శ్రు॥ సదేవసోమ్యేద మగ్రమాసీత్ ఏకమేవాద్వితీయం"యని ఉపక్రమము "సఆత్మా తత్త్వమసి" యని ఉపసంహారము. "శ్రు॥ సఏషోఽణిమై తదాత్మ్యగం తత్సత్యం సఆత్మాతత్త్వమసి శ్వేతకేతో" యని తొమ్మిది పర్యాయములు శ్వేతకేతువును నిమిత్తముగా సకలజీవులకు నుపదేశము అభ్యాసము. ప్రమాణాంతరా నధిగతా ద్వితీయ బ్రహ్మతత్త్వము "శ్రు॥ ఆచార్యవాన్ పురుషో వేద తస్యతావదేవ చిరం యావన్నవిమోక్ష్యే" ఇత్యాది వచనములచే అపూర్వఫలము బోధింపబడినది. "శ్రు॥ అనేక జీవే నాత్మనాఽను ప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి" "ఏనాశ్రుతం శ్రుతం" ఇత్యాది వాక్యములు అర్థవాదములు. మృల్లోహ తప్తపరశు గ్రహణ దృష్టాంతములచేతను సృష్టిస్థితి సంహారవచనములచేతను ఉపపన్నత్వ వినబడినది. గనుక జీవేశోభయ లక్షిత అఖండ చైతన్యము తత్త్వమస్యాది మహావాక్య తత్త్వమనియు తన్నిష్ఠచే పరమ పురుషార్థమైన మోక్షము సిద్ధించుననియు తాత్పర్యము తత్త్వమసి మహావాక్యమందు 'తత్' 'త్వం' పదములకు ముఖ్యార్థము స్వీకరించుటచే 'నీలోత్పలం' యను వాక్యమందు వలె విశేష్య విశేషణ రూపసంసర్గికార్థము గాని 'దండే దేవదత్తః' యను వాక్యమందువలె విశిష్టార్థమును గాని బోధింపబడుటలేదు. తత్త్వమసి మహావాక్యము సజాతీయ విజాతీయ స్వగత భేద రహితమైన బ్రహ్మమును బోధించుచున్నది. 'నీలోత్పలం' యను వాక్యమందు ఉత్పల ద్రవ్యమునకు నీలత్వము గుణమగుటచే ఉత్పలమందు శుక్లరక్తాది గుణ వ్యావర్తకముగా నీల గుణ విశేషణమును నీలత్వమందు ఘటాది పదార్థవ్యావర్తకముగా ఉత్పల విశేష్యమును జెప్పబడుచున్నది. 'దండే ధేవదత్తః' యను వాక్యమందు దేవదత్తుడు దండ విశిష్టుడని చెప్పబడుటచే దేవదత్తునకు దండమునకు భేదమునంగీకరించియే తత్కాలిక సంబంధము పలుకబడినది. అటు

లనే 'తత్త్వమసి' మహావాక్యమందు సంసర్గికార్థము వచింపబడిన యెడల జీవబ్రహ్మలకు భేదము సిద్ధమగుటచే తత్త్వమసి మహావాక్యమునకు సంసర్గికార్థము గాని విశిష్టార్థము గాని బ్రహ్మవిదులు అంగీకరింపలేదు. 'అహం బ్రహ్మ' యను ప్రతిపత్తివాక్యమందు వాచ్యములైన 'అహం' 'బ్రహ్మ' యను పదములకు అన్యోన్యభేద వ్యావర్తకములుగా విశేషణ విశేష్యభావార్థము విద్వాంసులకు సమ్మతము గాదు. బ్రహ్మ సర్వగతుడై యుండును జీవుడు బ్రహ్మయొక్క అంశరూపుడైనందున బ్రహ్మాంతర్గతుడగుటచే జీవుడు బ్రహ్మవిశిష్టుడని యర్థము తత్త్వవిదులు స్వీకరింపలేదు. ఇంకను తటాక మహాజలమందు జలపూర్ణమైన ఘటము ముంచబడిన యెడల తటాక మహాజలమునకును ఘటస్థజలమునకునేకత్వము వలె జీవబ్రహ్మైక్యము స్వీకరింపబడినదని శంకింప బనిలేదు. తటాక మహాజలమునకు ఘటస్థ జలమునకును భేదముండుటచే జీవ బ్రహ్మల అభేదముపై దృష్టాంతమందువలె స్వీకరింపబడలేదు తత్త్వమసి మహావాక్యము అఖండార్థము బోధించుచున్నది. అఖండార్థత యనగా అపర్యాయ శబ్దములకు సంసర్గరహితమైన ప్రమిత జనకత్వము. 'ప్రకృష్ట ప్రకాశశ్చంద్రః' యను వాక్యమందు అల్పతేజోవంతములైన నక్షత్రాదిక తేజవ్యావర్తకముగాను ప్రకాశ రహితములైన మేఘవ్యావర్తకముగాను చంద్రుడు ప్రకృష్టప్రకాశుడనియు ప్రకృష్ట ప్రకాశరూపుడు చంద్రుడనియు ప్రకృష్ట ప్రకాశునకు చంద్రునకు తాదాత్మ్య సమానాధికరణముచే ఐక్యము బోధింపబడుచున్నది. అట్లులనే 'తత్త్వమసి' మహావాక్యమందు 'తత్' పద లక్ష్యార్థమైన మాయ తత్కార్య వ్యతిరిక్తుడైన బ్రహ్మకును 'త్వం' పదలక్ష్యార్థమైన అపరోక్ష చైతన్యమునకును మహాకాశ ఘటాకాశములకువలె ఐక్యము బోధింపబడుచున్నది ఘటాకాశము' మఠాకాశము, మేఘాకాశము ఉపాధిభేదముచే భిన్నముగా ప్రతీతమైనను ఘటాకాశ మఠాకాశ, మహాకాశములు ఆకాశముమాత్రమే యగునటుల జీవేశ్వరోపాధుల నిరసించి ప్రత్యగాత్మ పరమాత్మల ఐక్యము అనగా ప్రత్యగాత్మ పరమాత్మయనియు పరమాత్మయే ప్రత్యగాత్మయనియు అఖండ చైతన్యము బోధింపబడుచున్నది. సంసర్గికార్థమును స్వీకరించిన యెడల "శ్రు॥ భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" 'అయమాత్మా బ్రహ్మ' "బ్రహ్మవేద బ్రహ్మైవభవతి" ఇత్యాది శ్రుతులచే వినబడు బ్రహ్మాఖండ రూపావగతి ఫలము అనర్థమగును. జీవేశ్వరుల ఉపాధులైన వ్యష్టి సమష్ట్యాత్మకమైన సకలజగము మాయకమైనందున మిథ్యాభూతమైన సకల జగము నిరసించి సమాప్తమైన బ్రహ్మమాత్రము గ్రహింపబడుటచే తత్త్వమసి మహావాక్యార్థము అఖండరసముగా బ్రహ్మవిదులు స్వీకరించిరి. "శ్లో॥

సంసర్గో వా విశిష్టో వా వాక్యార్థో నాభిష్టాం మతః యని శ్రీ భగవత్పాదులవారిచే సమ్మతః అఖండైక రసత్వేన వాక్యార్థో విదు వచింపబడినది. (సశేషము)

(22 వ పేజీ తరువాయి)

చేసియున్న అపార్థములను వేదాంతములోని యదార్థమైన అర్థముతో కలసిపోయి వాటిని విడదీసి తెలుసుకొనుట అందరికీ దుస్సాధ్యమైనప్పుడు భగవత్పాదులు వచ్చి పరమహంస ధోరణిలో వేదాంతములోని యదార్థమైన అర్థమును అర్థాభాసములను ఆలోచించి విడదీసి తెచ్చియున్నారు. వారికి నేను నమస్కరించుచున్నాను అని కల్పతరు కారులయిన అమలానంద సరస్వతీస్వాములవారు చెప్పినారు. అందువలన భగవత్పాదులు వారికి పరమహంసులుగా దర్శనమిచ్చి యున్నారని తెలియవచ్చినది.

సర్వదా స్మరింపదగినదేది! హరినామము,
కాని యువనభాష కాదు.
బుద్ధిమంతులు నుడువ ద నిదేది!
పరదోషమును, అనృతమును

శ్రీ శంకర భగవత్పాదులవారు.

నేను ఆనందుడను సత్యబోధ స్వరూపుడను-ఈ రీతిగ బ్రహ్మను చింతన మొనర్ప వగును. ఈ ప్రపంచము మిథ్యయే. సత్యమగునది నా అన్వయ బ్రహ్మస్వరూపియే.

శ్రీ శంకర భగవత్పాదులవారు

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

జీవబ్రహ్మ తాదాత్మ్యమును బోధించెడి మహా వాక్యములు ఉపనిషత్తులయం దనేకములు గలవు. అందు ఋగ్వేదాంతర్గతమైన ఐతరేయోపనిషత్ యందు 'ప్రజ్ఞానం బ్రహ్మ' యను వస్తు ప్రతిపాదక వాక్యము, శుక్ల యజుర్వేదాంతర్గతమైన బృహదారణ్యకోపనిషత్ యందు 'అహం బ్రహ్మాస్మి' యను అనుభవ వాక్యము, సామవేదాంతర్గతమైన ఛాందోగ్యోపనిషత్ యందు 'తత్త్వమసి' యను ఉపదేశ వాక్యము, 'అథర్వ వేదాంతర్గతమైన మాండూక్యోపనిషత్' యందు 'అయమాత్మా బ్రహ్మ' యని సాక్షాత్కార వాక్యము యని వివేచనము పరిపూరార్థమును బోధించెడి మాహా వాక్యములకు ఆకాంక్షా పూరకములైన వాక్యములు అవాంతర వాక్యములు. 'తత్త్వమసి' యను మహావాక్యమునకు 'సదేవ సత్యం' యనెడి అవాంతర వాక్యము ఆకాంక్షాపూరకము. వాక్యము పద సమూహమైనందున పదార్థములచే వాక్యార్థము గోచరించును. పదార్థము పదశక్తిచే తెలియబడును. పదములకు యోగ్యేతరాన్విత స్వార్థాభిధాన సామర్థ్య మొకటియే యుండునని అన్వితాభిధాన వాదులందురు. పదార్థమును తెలిపెడి పదశక్తి స్మరణ జనితమైన తాత్పర్యమే వాక్యార్థమని అభిహితాన్వయ వాదులనెదరు. అభిహితాన్వయవాదుల మతము నవలంబించి తత్త్వమస్యాది మహావాక్యములందు పదముల శక్తిచేతనే, ఆకాంక్షాయోగ్యత, ఆసక్తులు గలవు. తత్త్వమస్యాది మహా వాక్యములందు పదముల శక్తిచేతనే వాక్యార్థము ప్రతిపాదింపబడుటచే సిద్ధాంతము లక్షణమును స్వీకరింపకయె నిర్వహింప బడుచున్నది. 'ఘటోఽనిత్యః' యను వాక్యము స్వతంత్రముగా ఘట పదశక్తిచే అన్వయము పొందుటచే లక్షణ మక్కర లేదు. "ఘటోనిత్యః" యను వాక్యమందు ఘట పదమునకు ఘటత్వమునందు అన్వయింపవలయును. అటులనే ఉపక్రమాది షల్లింగములచే 'తత్' 'త్వం' పదార్థములను శోధించిన పదశక్తిచే అంతః కరణాదులకు అపరోక్షమైన అహంప్రత్యయ విషయమైన చైతన్యమే సర్వప్రపంచ మాయాధిష్ఠానమైన బ్రహ్మ చైతన్యమని అన్యోన్యతాదాత్మ్యము లక్షణము స్వీకరింపకయేబోధింపబడుచున్నది. ఆచార్యులు లక్షణమును స్వీకరించుటయు 'తత్' 'త్వం' పదముల ప్రతీత్యర్థములను నిరసించుటకే యగును. గనుక 'తత్త్వమసి'యను మహావాక్యము సంసర్గికార్థము గాని విశిష్టార

మును గాని బోధింపక సకలోపనిషత్తులచే బోధింపబడిన అఖండైకరసత్వమే ప్రతిపాదింపబడినదని బ్రహ్మవిదుల మతము.

పదములయొక్క వాచ్యార్థమును స్వీకరించుటవలన వాక్యతాత్పర్యము ప్రత్యక్షాది ప్రమాణ విరోధమైనచో వాచ్యార్థమును వదలని అర్థాంతర ప్రతీతిలక్షణమనబడును. లక్షణము జహల్లక్షణము అజహల్లక్షణము జహదజహల్లక్షణమని త్రివిధము. 'గంగాయాం ఘోషః'యను వాక్యమందు గంగకువాచ్యార్థమైన గంగా ప్రవాహమందు గొల్లపల్లెనుండుటకు నసంభము గనుక గంగా పదవాచ్యార్థమైన గంగా ప్రవాహమును వదలి తద్వినాభూతమైన గంగా తీరమందు వర్తించుట జహల్లక్షణమనబడును. "మనో బ్రహ్మేత్యుపాసీత" యను వాక్యమందు మనస్సు ఏకరసమైన బ్రహ్మయగుట ననుపపన్నమగుటచే వాచ్యార్థమైన బుద్ధి వృత్తినివదలి బుద్ధి వృత్తి సాక్షి చైతన్యమందు జహల్లక్షణముచేవర్తించును. 'శ్వేతోధావతి' యను వాక్యమందు శ్వేతపదమునకు వాచ్యార్థమైన శ్వేతగుణమునందు వర్తించు ఏ అనుపపన్న మగుటచే వాచ్యార్థమైన శ్వేతత్వమును వదలక శ్వేతమాశ్రయించిన అశ్వమునందు వర్తించుట ఆజహల్లక్షణమనబడును 'సత్యంజ్ఞానమనంతం బ్రహ్మ' యను వాక్యమందు సత్యజ్ఞానానంతములు ధర్మములని ప్రసిద్ధములగుటచే నిర్విశేషుడైన బ్రహ్మయందు వర్తించుట విరుద్ధమగుటవలన సత్యజ్ఞానానంతాది శబ్దములు వాచ్యార్థమును వదలక సత్య జ్ఞానానంత స్వరూపుడైన వస్తువు బ్రహ్మ యని సత్యజ్ఞానానంత శబ్దములు వర్తించుట అజహల్లక్షణము 'సోఽయందేవదత్త'యను వాక్యమందు నొక కాలమందును నొకదేశమందును చూడబడిన దేవదత్తుడు మరియొక దేశకాలమందు చూడబడినయడల 'వాడు యీ దేవదత్తుడు' యని భిన్నములైన దేశకాలములను వదలి ఉభయ దేశకాలములందు అనుగతమైన దేవదత్తుని అంశయందు వర్తించుటచే యీ వాక్యము జహద జహల్లక్షణములచే రక్షింపబడిన దేవదత్తునియందు వర్తించుచున్నది.

(సశేషము)

గురిని గొట్టువాడు మనసును, చూపును, చేతిని, బాణమును నొక్కచోట కదలండ నిలుపుచున్నాడు. వానికి కొంచెమేనియు పొరపాటు కల్గినచో దాని బాణప్రయోగ మేమగు చున్నది. వ్యర్థమగు చున్నదికదా. అటులనే యాత్మను దెసిలికొనువానికి అవధానము ఆవశ్యకమని యెఱుంగ వలయును.

శ్రీ శంకర భగవత్పాదులు,

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

తత్త్వమస్యాది మహా వాక్యములందు 'సోఽయం దేవదత్తః' ఇత్యాది వాక్యమందు వలె భాగలక్షణము (జహదజహల్లక్షణము) స్వీకరింప వగును. మరియొక లక్షణము స్వీకరింప దగదు. 'సోఽయం దేవదత్తః' యను వాక్యమందు 'సః' 'అయం' శబ్దములకు ఆయా దేశ భేదము చేతను పరోక్షా పరక్షత్వముల చేతను వాచ్యార్థము స్వీకరించుట విరుద్ధమగుట వలన 'సః' 'అయం' పదములందు విశిష్టాంశముల వదలి దేవదత్తుని మాత్రమందు తాత్పర్యము వర్తించును. అటులనే 'తత్త్వమసి' మహా వాక్యము 'తత్' 'త్వం' పదముల వాచ్యార్థముచే పరోక్షా పరోక్షత్వముల చేతను సర్వజ్ఞత్వ కించిజ్ఞత్వములచేతను జీవేశ్వరుల తాదాత్మ్యము విరుద్ధమగుటచే విరుద్ధములైన అంశలను వదలి ఉభయతానుగతమైన అఖండ చైతన్యమునందు వర్తించును 'సోఽయం దేవదత్తః' యనువాక్యము 'ఇతడు దేవదత్తుడా?' యని సంశయ,విపర్యయములు బొందు పురుషుని గురించి అతడు యా దేవదత్తుడను సంగతి తెలుసుకొనుటకు (పరోక్ష జ్ఞానము గలుగుటకు) ప్రయోగింప బడలేదు. దేశకాల విశేషాంశములను వదలి ప్రత్యక్షముగా నున్న దేవదత్త వ్యక్తిని లక్షించుచున్నది. అటులనే తత్త్వమసి మహావాక్యము జీవేశ్వరైక్య విషయమై పరోక్ష జ్ఞానము మాత్రము గలుగుటకు వచింపబడుట లేదు. జీవేశ్వరుల విశిష్టాంశములైన మాయోపాధి అంతఃకరణోపాధులను వదలి ఉభయానుగతమైన శుద్ధ చైతన్యమును లక్షించుచున్నది. అన్వయ వ్యతిరేకముల చేతను ఉపనిషదవాంతర వాక్యములచేతను 'తత్' 'త్వం' పదార్థములను శోధింపగా 'తత్' 'త్వం' పదలక్ష్యార్థ ఐక్యబోధచే అఖండ చైతన్య అనుభవ రూపమైన వాక్యార్థ ప్రతిపత్తి గలుగును. 'తత్త్వమసి' మహావాక్యము 'ఆదిత్యోయూపః' యజ్ఞ యూపమును ఆదిత్యునిగా ప్రశంసించునటుల స్తుతిపరముగాదు. ఆత్మ నిర్గుణుడగుటచే 'సింహో మాణవకః' ఇత్యాది వాక్యములవలె గౌణార్థముగాదు ఆత్మనిత్య చిద్రూపుడగుటచే బ్రహ్మకార్యము 'మృద్ఘటః' యను వాక్యమువలె కార్యకారణ భావము బోధించుట లేదు. 'తత్' 'త్వం' పదలక్ష్యార్థములయందు అఖండార్థము బోధింపబడుటచే 'వాచం ధేనుముపాసీత' ఇత్యాది వాక్యములవలె ఉపాసనాపరము కాదు. అహం

బ్రహ్మాస్మ్యాది మహావాక్యవలన దోషములు నశించును. గనుకను 'అహంబ్రహ్మాస్మి' పరోక్ష జ్ఞానము బొంది ధ్యానముచేయుట క్రమముగా అపరోక్షజ్ఞాన హేతువగుటచేతను మహావాక్య జప, ధ్యానములు మందతర మందప్రజ్ఞుల కుపయోగమగును. 'అధ్యారోపాపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే' 'అవిద్యానిలయః జ్ఞాతత్వేనోపలక్ష్యతే' 'అధిష్ఠానావశేషోహి నాశో కల్పితవస్తునః' యను సంప్రదాయిక బ్రహ్మవిదులచే వచింపబడునటుల బ్రహ్మ యందు ఆరోపింపబడిన మాయ తత్కార్య విలయముచే అధిష్ఠానమైన బ్రహ్మపొంద బడును. ఉపనిషద్వాక్యములచే ఆత్మానాత్మ లక్షణములు తెలిసికొనుటయు అపరోక్ష చైతన్యము బ్రహ్మయని తెలియుట పరోక్ష జ్ఞానమే యగును పరోక్షజ్ఞానము దోషహర మైనను పరమపురుషార్థముగాదు. ధర్మాద్యా సనివృత్తిచే పరోక్షజ్ఞానము గలుగును. బ్రహ్మ యందారోపింప బడిన సకలజగమును శాస్త్రముద్వారా విచారించి వాని సాక్షా త్కారముపొంది ఆరోపింపబడిన అనాత్మ ప్రపంచముని అవిద్యాది దేహ బాహ్య ప్రపంచమును (స్థూలసూక్ష్మ కారణ ప్రపంచ మును నిషేధించగా (అపవాదముచేయగా) వస్త్వధ్యాసానివృత్తిచే బాధిత ప్రపంచము నకు అధిష్ఠానమైన వాక్యార్థమైన అఖండ బ్రహ్మతత్త్వము అనుభవరూపముగా పొంద బడును. అందులకే భృగువు తన తండ్రియగు వరుణుని 'అధీహి భగవోబ్రహ్మ' బ్రహ్మోప దేశము చేయుమని వేడగా బ్రహ్మ చరా చరాత్మకమైన సర్వప్రపంచమునకు సృష్టి స్థితిలయ కారణమనియు బ్రహ్మవిద్యా సాధ నము చిత్తైకాగ్రత యనియు అందులకు శ్లో|| మనసశ్చేంద్రియాణాం చహ్యైకాగ్ర్యం పర మతపః| తజ్జ్యాయః సర్వధర్మేభ్యః సధర్మః పరఉచ్యతే| యని శ్రుతి స్మృతులు ప్రమాణ మనియు వచించి వరుణుడు పంచకోశాత్మక మైన అన్న, ప్రాణ, మనో, విజ్ఞానరూపమై వ్యష్టి సమిష్ట్యాత్మకమైన సర్వజగమును అప వాదముచేసి ఆనందశబ్ద లక్షితమైన జీవే శోభయలక్షిత అఖండ చైతన్యమును బ్రహ్మగా ప్రతిపాదించెను. కనుక తత్త్వ మస్యాది మహావాక్య ప్రతిపత్తియె బ్రహ్మ విద్యయనియు బ్రహ్మ విద్యయే బ్రహ్మసాక్షా త్కారమనియు, బ్రహ్మ సాక్షాత్కారమే అనుభవరూపమైన బ్రహ్మయనియు, ముక్తి యనియు అందులకు "నహిబ్రహ్మానుభవో బ్రహ్మ సాక్షాత్కారో నిత్యశుద్ధ స్వభావ బ్రహ్మణోఽతిరచ్యతే' యను సర్వజ్ఞుడగు వాచస్పతి వాక్యములు ప్రమాణములనియు వ్యాఖ్యానము చేయబడినది.

(సశేషము)

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

శ్లో॥ యశ్చాహమత్ర వర్ష్మణి భామి సోఽసా
యోఽసా విభాతి రవి మండలే సోఽహమితి
వేదవాదినో వ్యతిహారతో యదధ్యాపయతి
యత్న తస్తత్త్వమసి తత్త్వమ్ ॥ 6

శంకరవిజయము సర్గ-10

ఈశరీరమునందు ప్రకాశించుచున్న నేను (ఆత్మ) ఆదిత్యమండలమందు ప్రకాశించుచున్న యతడు (పరమాత్మ) యని బ్రహ్మవాదులు శిష్యులకునుపదేశించుచున్న తత్త్వమే తత్త్వమసిమహావాక్యార్థతత్త్వము.

ఎవని యిచ్ఛచే ప్రేరితములైన మనస్సు, ప్రాణము, వాగింద్రియము, శ్రవణేంద్రియము వాని వ్యాపారములందు ప్రవర్తింపుచున్నవి? జడములైన దేహేంద్రియాదులు క్రియాజ్ఞాన శక్తులైన ప్రాణమనములనే దేవుడు ప్రేరేపించునని నొక శిష్యుడు తన గురువును ప్రశ్నించెను. గురువు తన శిష్యునితో నిట్లనెను సర్వవ్యాపి చిద్రూపుడైన ఆత్మజడములయిన మనో ప్రాణేంద్రియములను నధిష్ఠించి వానికి మనన, ప్రాణన శ్రవణాది సామర్థ్యమును గలుగజేయుటచే నవి వాని విషయములందు ప్రవర్తింపు చున్నవి. ఆత్మ అసంగ నిత్య చిద్రూపుడేగను మలిన సత్వ ప్రధానమాయ పరిణామములైన దేహాద్యుపాధి సంపర్కవశమున ప్రేరకుడగును.

ఆత్మ రూపాదిరహిత మగుటచే చక్షురింద్రియము ఆత్మవిషయమై ప్రవర్తింపలేదు. ఆత్మ వాక్ప్రవర్తక విషయములైన జాతి, గుణక్రియ సంబంధ రహితుడగుటచే వాగింద్రియము ప్రవర్తింపలేదు, కనుక మేము ఆత్మను ఇంద్రియమనముల విషయముగా తెలుసుకొని శిష్యులకు బోధింపలేము. లోకమునందు నొక వస్తువు తెలుసుకొనబడినదని తెలుసుకొనబడ లేదని బుద్ధి యుండవచ్చును. ఆ ఆత్మ తెలుసుకొన బడెడిదానికంటెను, తెలుసుకొనబడనిదానికంటెను అన్యమైనది యనగా ఇంద్రియమనములచే తెలియబడనిదియు, వేదాంతవాక్య మూలమైన గురూపదేశముచే తెలియ బడు నది-ఋ భావము ఏది వాక్కుచే వర్ణింపబడదో శ్రవణేంద్రియముచే వినబడదో మనస్సుచే ఘటాదులవలె జ్ఞాన క్రియచే తెలియబడదో నది ఆత్మయని తెలియుము. ఏ దేవుడు ఇంద్రియాదికరణములను వానివ్యాపారములందు ప్రేరేపించునో వాడు ఆత్మయని తెలియుము.

శిష్యుడు ఆత్మ తత్త్వమును యథార్థముగా గ్రహించెనో లేదో యనిపరీక్షించుటకు గురువు శిష్యునితో ఏది నీవు బాగుగా తెలుసుకొంటి నని తలచెదవో యది మిథ్యాభూతమయినది. ఆత్మగాదు. నీవు ఆత్మను తెలుసుకొంటివా! యని ప్రశ్నించెను. శిష్యుడు ఏకాంతప్రదేశమున పర్యాలోచనముజేసి అన్వయ వ్యతిరేకములచే దేహాది అనాత్మను నిరాకరించి అంతఃకరణవృత్తులకు సాక్షియైనఆత్మ సాక్షాత్కారము బొందెను. అతడు గురుని జూచి నేను ఆత్మను బాగుగా తెలుసుకొంటిననితలుపను, తెలుసుకొనబడలేదని తలుపను. ఉపదేశముచే జ్ఞాతా జ్ఞాతములకన్యమై ఇంద్రియాదులకు విషయముగాక ఇంద్రియాది జడవర్గమును సన్నిధిమాత్రమున వాని వ్యాపారములందు ప్రవర్తింపజేయుసాక్షి చైతన్యమైన బ్రహ్మ సాక్షాత్కారము బొందితి నని స్వానుభవమును విన్నవించెను. ఆత్మ సాక్షాత్కారము బొందిన పురుషులు విద్యా బలముచే అపవర్గము బొందుదురు.

మహర్షులు బ్రహ్మ విచారణ చేయుచు ఋగ్వేదమునందు "ఆత్మావా ఇదమగ్ర ఆసీత్ నాన్యత్కించ మిషత్" ప్రపంచ సృష్టి పూర్వము ఆత్మమాత్రమే యుండెననియు, మరియొక పదార్థము కొంచెమైనను లేదనియు ఆత్మయే హిరణ్యగర్భునిద్వారా విరాట్పురుషుని సృజించె ననియు, పరమేశ్వరుడు దేవతలను సృజించుటకై విరాట్పురుష విగ్రహమందు యింద్రియముల కల్పించి ఇంద్రియాధిష్ఠాన దేవతలను సృజించె ననియు ఇంద్రాది దేవతలకు క్షుత్పిపాసలు కల్పించి వారి అన్నముకొరకు గవాశ్వాది పశువులతో ప్రయోజనము లేనందున విజ్ఞానముచే క్రతువుల నాచరించి దేవతలకు హవిస్సు నిచ్చెడి మనుష్యజాతిని సృష్టించె ననియు, మనుష్య పశ్వాది శరీరములందు అగ్ని వాగింద్రియమునందును, వాయువు ఘ్రాణేంద్రియమునందును సూర్యుడు చక్షురింద్రియ మందును దిగ్దేవత శ్రవణేంద్రియ మందును ఓషధి వనస్పతులు రోమములుగాను చంద్రుడు మనోరూపముగా హృదయమందును మృత్యువు అపాన రూపముగా నాభియందును జలము రేతోరూపముగా శిశ్నమునందు ప్రవేశించిరనియు అందువలన మనుష్యాది జీవులు క్షుత్పిపాసలు బొందిరనియు తరువాత పరమేశ్వరుడు లోకములను లోకపాలురను సృజించెననియు పరమేశ్వరుడు ఏ ఇంద్రియముద్వారా ప్రవేశింపవలయునని పర్యాలోచనము చేసి ఇంద్రియాదులకు సంబంధములేని బ్రహ్మరంధ్రము ద్వారా శరీరములందు ప్రవేశించెననియు, ప్రాణము పాదముల బొటనవేళ్ల ద్వారా ప్రవేశించెనని ఋగ్వేద బ్రాహ్మణమందు వినబడుటచే ఇంద్రియ మనములను అధిష్ఠించి ఇంద్రియాదుల వాని వ్యాపారములయందు ప్రవర్తింపచేయుచున్న చిద్రూపుడైన ఆత్మ పాదములద్వారా ప్రవేశించిన ప్రాణమా! లేక పరమేశ్వరుడా! ఆ పరమేశ్వరుడెవరు! యని చింతించిరి. జీవుడు

దేనిచే చూచును! దేనిచే వినును! దేనిచే వాసనచూచును! దేనిచే శబ్దమునుచ్చరించును! దేనిచే మంచి చెడు రుచులను తెలుసుకొనును! అనగా చక్షురాది ఇంద్రియభూతమైన అంతఃకరణము ద్వారా చూచుట వినుట మొదలైనవి చేయునని భావము. శుక్ల యజుర్వేదమందుగూడ "మనసా హ్యేవ పశ్యతి మనసా శృణోతి హృదయేన హి రూపాణి జానాతి" యని వినబడినది. కనుక సంజ్ఞానాది అంతఃకరణ వృత్తుల ఉపలబ్ధంబనగా అంతఃకరణ వృత్తుల పొందుచు అంతఃకరణ వృత్తుల స్ఫూర్తి రూపుడైన ఆత్మయే వరేణ్యుడు ఉపాసింపదగినవాడు సాక్షాత్కారము బొందదగినవాడని నిశ్చయము బొందిరి.

సంజ్ఞానాది అంతఃకరణ వృత్తులు "శ్రు॥ సంజ్ఞానమాజ్ఞానం విజ్ఞానం ప్రజ్ఞానం మేధా దృష్టి ధృతిర్మతిర్మనీషా జూతిః స్మృతిః సంకల్పః క్రతురసుః కామో వశ ఇతి" చేతన భావము, ఆజ్ఞాపించుట, కళాధి పరిజ్ఞానము, గ్రంధ ధారణ సామర్థ్యము, ఇంద్రియముల ద్వారా సర్వవిషయముల బొందుట, శరీర ఇంద్రియములను నిలుపుకొనుట, అభిమానము, చింతించుట రోగాదులచే దుఃఖము, స్మరణము, రూపాదుల సంకల్పించుట, నిశ్చయము, జీవన క్రియానిమిత్తవృత్తి, విషయకాంక్ష, విషయాభిలాష మొదలగునవి శుద్ధ చైతన్యరూపుడైన బ్రహ్మ ఉపాధి భూతజనిత గుణ నామధేయములు, సంజ్ఞానం మొదలగు అంతఃకరణ వృత్తులు చైతన్యముయొక్క నామధేయములు సాక్షాత్ చైతన్యముగావు "శ్రు॥ సర్వాణ్యేవైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవంతి" "శ్రు॥ ఏష బ్రహ్మైష ఇంద్ర ఏష ప్రజాపతిరేతే సర్వే దేవా ఇమాని చ పంచ మహాభూతాని పృథివీ వాయురాకాశ ఆపో జ్యోతీంషీత్యేతానీమాని చ క్షుద్ర మిశ్రాణీవ" చైతన్యమైన ఆత్మయే సర్వాంతర్యామి, హిరణ్యగర్భుడు చైతన్యమే ఇంద్రుడు దేవతలు పంచభూతములు సూర్యాది జ్యోతులు క్షుద్ర భూతములు, పక్ష్యాదులు చైతన్యమే. వృక్షములు, గవాది పశువులు, ఏనుగులు, పన్నగములు సర్వస్థావర జంగమములు చిద్రూపుడైన ఆత్మయే. చైతన్యమునందే సర్వ ప్రపంచము సృజింపబడుచున్నది. చైతన్యముచే పాలింపబడుచున్నది. చైతన్యముయందు సర్వ జగము లయమగుచున్నది. "శ్రు॥ ప్రజ్ఞా ప్రతిష్ఠా ప్రజ్ఞానం బ్రహ్మ" సర్వ జగమునకు చైతన్యమే ఆధారము చైతన్యము బ్రహ్మ బ్రహ్మయయిన ఆత్మ చైతన్యనిష్ఠచే వామదేవాది పూర్వఋషులు జనన మరణముల నుండి ముక్తి బొందిరి.

ఛాందోగ్యోపనిషత్ యందు "శ్రు। అథ య ఏషోఽన్తరాదిత్యే పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రుర్హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వ ఏవ సువర్ణః। తస్య యథా కప్యాసం పుండరీకమేవమక్షిణీ తస్యోదితి నామ స ఏష సర్వేభ్యః పాప్మభ్య ఉదిత ఉదేతి హ వై సర్వేభ్యః పాప్మభ్యో య

ఏవం వేద" "శ్రు॥ అథాధ్యాత్మమ్-అథయ ఏషోఽన్తరక్షిణి పురుషో దృశ్యతే" యని వినబడినది. ఆదిత్యుని అంతరమున (మధ్య) దర్శింపబడుచున్న (ఉపాసింపబడుచున్న) హిరణ్మయ పురుషుడు. దేవునియందు బంగారు వికారము అసంభవమైనందునను, ఋగాది మంత్రములచే ప్రతిపాదింపబడువాడని వినబడుటచేతను పాపాది దోషరహితుడని వినబడుట చేతను, సువర్ణ శబ్దముచేతను జ్యోతిర్మయుడని గ్రహింపనగును. ఆదిత్య పురుషుని మీసములు (కేశములు) నఖాగ్రములు సహా జ్యోతిర్మయములైనవనియు వినబడినది. ఆదిత్య పురుషుని దర్శనము బ్రహ్మచర్యాది తపోసాధనలచేత ననివృత చక్షుషధ్యానముచేతను సాధ్యమగును. ఆదిత్య పురుషుని నేత్రములు కప్యాసనము (కోతిఆసనము) వలె పుండరీకము వలె తేజోవంతములైనవని వర్ణింపబడినవి. ఆదిత్య పురుషుడు సకల పాపరహితుడనియు, యా దేవుని నుపాసించువారలు సకల పాప విముక్తులగుదురనియు యా దేవుడు ఋక్సామయజుర్వేదాత్మకుడనియు, ప్రణవ రూపుడనియు ఊర్ధ్వలోకములకు ఆధారుడు, దేవతల కోరికల నిచ్చేవాడు సకల జగత్కారణుడనియును వినబడినది. ఇది దేవత సంబంధము పురుషసంబంధముగా 'శ్రు॥ అథయ ఏషోఽన్తరక్షిణి పురుషోదృశ్యతే సైవార్క్సాముగదుక్థం తద్యజుస్తద్బ్రహ్మ' యని వినబడినది. అనగా నేత్రము నందు దర్శింపబడుచున్న పురుషుడు ఋగ్సామయజుర్వేదాత్మకుడు. అతడు స్వాహా స్వధా వషట్ దాదిరూపుడు. అతడు జగత్కారణుడు. అతడు ప్రణవ రూపుడు. మనుష్య కోరికల నిచ్చువాడు. క్రిందిలోకములకు ఆధారుడు. అతడు వాయుసోమ సూర్యాత్మకుడు అతడు నేత్రమునందు కనపించు ఛాయాపురుషుడు కాడు. దేవతాసంబంధముగా వినబడిన హిరణ్యశ్మశ్రు హిరణ్యకేశాది గుణములు గలిగిన ఆదిత్యపురుషుడు, మనుష్యసంబంధముగా వినబడిన చాక్షుష పురుషుడు ఉపాధి భేదము గలిగినను సమానలక్షణములు వినబడినందున ఒకడే యగును. భేదసంశయము కూడదు.

(సశేషము)

మహారాజ్యల భారతీయ సాంస్కృతిక వేదాంత పాఠశాల

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాధశర్మ

(గతసంచిక తరువాయి)

ఈ చాంధోగ్యశ్రుతుల తాత్పర్యమందు సంశయము. ఈ శ్రుతులయందు ఉపాసనీయుడుగా ప్రతిపాదింపబడిన పురుషుడు ఎవరు? విద్యా కర్మాతిశయమున సూర్యమండలాధిపత్యము వహించిన నొక పురుషుడు (ఆదిత్యక్షేత్రజ్ఞుడు) చక్షురింద్రియమునుగూడ అధిష్ఠించిన ప్రేరకుడగు ఆదిత్యదేవతయా! లేక నిత్య సిద్ధుడగు బ్రహ్మయా! శ్రుతియందు ఆదిత్యపురుషుడు బంగారు మీసములు బంగారు నేత్రములు మొదలైన గుణములచే రూపవంతుడుగావినబడినందునను పరమేశ్వరునకు రూపము లేనందునను, ఆదిత్యపురుషునకు 'య ఏషోఽన్త రాదిత్యే' యని ఆదిత్యమండలము ఆధారముగా వినబడినందునను అటులనే అక్షిపురుషునకుగూడ 'తస్యైతస్యత దేవరూపం యదముష్యరూపమ్'. అదియే రూపము. చక్షురింద్రియము ఆధారముగా వినబడినందునను, పరమేశ్వరునకు నే యాధారము లేక సర్వ జగదాధారమై స్వమహిమచే నుండువాడగుటచేతను సర్వగతుడై నిత్యుడగుటచేతను, ఆదిత్యపురుషుడు దేవతల కోరికల నిచ్చుట అక్షిపురుషుడు మనుష్య కోరికల నిచ్చుటయును ఐశ్వర్య హద్దు వినబడుట చేతను పరమేశ్వరుడు సర్వలోకములకు సర్వభూతములకు అధిపతి పాలకుడు సర్వేశ్వరుడైనందునను, శ్రుతియందు ప్రతిపాదింపబడిన పురుషుడు ఆదిత్య మండలాభిమానియైన సంసారియైన ఆదిత్యక్షేత్రజ్ఞుడగు నొక దేవతయగునని—అటుల కాదు. పై ఛాందోగ్య శ్రుతులయందు ఉపాసనీయుడుగా ప్రతిపాదింపబడిన పురుషుడు పరమేశ్వరుడే యగను. సంసారియైన ఆదిత్యమండలాభియైన దేవత కాదు. కారణమేమన ఆదిత్యపురుషునియందును అక్షిపురుషునియందును పరమేశ్వరుని ధర్మములు వినబడుచున్నవి. 'స ఏష సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః' యని ఆదిత్యపురుషునియందును 'యన్నామ తన్నామ' యని సమాన ధర్మములు అక్షిపురుషునియందును సర్వపాపరహితుడనియు, ఋగాది సర్వవేదాత్మకుడనియు పృథివ్యాది సకల దేవతాత్మకుడనియు వినబడుటచే యీ ధర్మములు 'య ఆత్మాఽపహత పాప్మా' ఇత్యాది శ్రుతులచే సర్వపాపరహితు ఋగాది వేద పృథివ్యాది దేవతాత్మకుడు పరమేశ్వరుడగుటచేతను 'యద్వ ఇమే వీణాయాంగాయంత్యేతం తే గాయంతి తస్మాత్తేధన సనయః' యని వినబడుటచే వీణా మొదలగు లౌకిక గానములయందు పరమేశ్వరుడు గానము చేయబడుటచేతను,

శ్లో॥ యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవవా। తత్తదేవావగచ్ఛత్వం మమ తేజోంశ సంభవమ్॥

యని శ్రీకృష్ణభగవానుడు పలికినటుల ఈ శిల్పత్వాది సకలదేవతా

మహత్త్వము, లోక కామే శితృత్వము పరమేశ్వర మహత్త్వమే యగును. హిరణ్యశ్మశ్రు హిరణ్యకేశత్వాది గుణములు పరమేశ్వరుని ఇచ్ఛావశమున బొందిన మాయామయ రూపమై సాధకుల ఉపాసనకొరకు బొందబడినవగును. ఆదిత్యపురుషునకు సూర్యమండలమును అక్షిపురుషునకు నేత్రమును ఆధారముగా వినబడుటచేతను పరమేశ్వరుడు ఆధారరహితుడగుటచే ఈ శ్రుతులయందు పరమేశ్వరుడు ప్రతిపాదింపబడ లేదని యనిన పరమేశ్వరుడు శబ్ద స్పర్శ రూపరహితుడై సర్వవ్యాపి స్వమహిమచే నుండువాడగుటచే అధ్యాత్మ, అధి దైవత విభాగము నపేక్షించి ఉపాసకుల ఉపాసనా సౌకర్యముకొరకు పరమేశ్వడే అధిష్ఠాన విభాగముచే బోధింపబడుచున్నాడు.

ఆదిత్యాది శరీరాభిమానియైన జీవునికంటె వేరైన అంతర్యామియైన ఈశ్వరుడు 'శ్రు॥ య ఆదిత్యే తిష్ఠన్నాదిత్యాదంతరో యమాదిత్యో న వేదయస్యాదిత్యః శరీరం య ఆదిత్యమంతరో యమయత్యేషత ఆత్మాంతర్యామ్యమృతః" యను బృహదారణ్యక శ్రుతియందు' ఆదిత్యాది జీవులకంటె వేరైన ఆదిత్యాది మండలముల నధిషించి ఆదిత్యాది విజ్ఞానాత్మ కంతరమున ఆదిత్యాది దేవతల నియమించుచున్న పరమేశ్వరుడు ప్రతిపాదింపబడుటచే తను, 'అథయ ఏషోఽంతరాదిత్యే పురుషో దృశ్యతే' 'సయఏషోఽంతరక్షిణిపురుషో దృశ్యతే' ఇత్యాది ఛాందోగ్యశ్రుతులయందు సచ్చిదానందుడైన పరమేశ్వరుడు ప్రతిపాదింపబడుచున్నాడు కనుక చక్షురాది ఇంద్రియ, మనో ప్రేరకుడై ఇంద్రియమనములగోచరుడై అవిద్యచే కల్పింపబడిన సంజ్ఞానాది సర్వ అంతఃకరణవృత్తులు నామధేయములుగాగలిగి, అంతఃకరణవృత్తులకు సాక్షియై, అహం ప్రత్యయ విషయమైన అపరోక్ష చైతన్యము తత్త్వమస్యాది మహావాక్యములందు 'త్వం' పదలక్షితమైన కేవలాత్మకును ఆదిత్య మండలము నధిష్ఠించి, ఆదిత్య దేవతను అంతర్యామియై నియమించుచు సర్వపాపరహితుడై, సర్వ జగమును మాయామాత్రమున సృష్టి స్థితిలయములచేయుచు సర్వవేదాత్మకుడు, సర్వదేవాత్మకుడు సత్, చిత్, ఆనంద లక్షణములచే బోధింపబడు తత్త్వమస్యాది మహావాక్యములందు 'తత్' పదలక్షితమైన బ్రహ్మకును 'శ్రు॥ సయశ్చాయంపురుషే। యశ్చాసావాదిత్యే। సఏకః సఏవంవిత్॥' ఇత్యాది శ్రుతులయందు అభేద ప్రతిపత్తి బోధింపబడినది. తత్త్వమస్యాది మహావాక్య తత్త్వమును బ్రహ్మవిదులు తమ శిష్యులకు బోధింతురు.

(సశేషం)

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాధశర్మ

(గత సంచిక తరువాయి)

శ్లో॥ వేదానువచనసద్ధానముఖధర్మైః
శ్రద్ధయానుష్ఠితైర్విద్యయాయుక్తైః
వివిదిషంత్యత్యంత విమలస్వాంతా
బ్రాహ్మణాయద్బ్రహ్మతత్త్వమసి తత్త్వమ్॥

శంకర విజయము సర్గ-10

శ్రుతిస్మృతులచే విధింపబడిన సద్దానము మొదలగు ధర్మముల దేవతోపాసనలతో గూర్చి శ్రద్ధతో అనుష్ఠానము చేయుటచే పరిశుద్ధ మనస్కులయిన బ్రాహ్మణులు తత్త్వమస్యాది వాక్య ప్రతిపాదితమైన బ్రహ్మ తత్త్వమును తెలియగోరెదరు. "శ్రు॥ తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసా అనాశకేన" "యవిద్య యోపనిష దాకరోతి తద్వీర్య వత్తరం భవతి" యను శ్రుతులు ప్రమాణ వచనములు. వేదమనగా నేమి? దాని లక్షణ మేమి? ప్రయోజనమేమి? అధికారులెవరని, దాని ప్రామాణ్య మెట్లనిన ఇష్టప్రాప్తి అనిష్ట పరిహారము కొరకు అలౌకిక ఉపాయము తెలియచేసెడి గ్రంథము వేదము. అలౌకిక మనగా ప్రత్యక్ష అనుమానాది ప్రమాణములచే తెలియబడనిదని యర్థము. జ్యోతిష్టోమాది ఇష్టప్రాప్తి హేతువును, సురాపానాది అనిష్ట ప్రాప్తిహేతువును విధింపబడు కర్మానుష్టానముచేత బొందబడు పుణ్యము, స్వర్గాదులును, నిషిద్ధ కర్మాచరణచే బొందబడు పాపము, నరకమును వేద శాస్త్రములచేతప్ప ఊహా మాత్రమున ఎవరిచేతను తెలియబడవు గనుక వేదలక్షణము అటుల పలుకబడినది. శ్లో॥ ప్రత్యక్షేణానుమిత్యా వాయస్తూపాయో నబుధ్యతే। ఏతంవిదంతి వేదేన తస్మాద్వేదస్య వేదతా॥ వేద విషయము తెలియుట ప్రయోజనము. వేద విషయము తెలియకోరువాడు అధికారి. దానితో ఉపకార్యోపకారక భావము సంబంధము అందరు ఇష్టప్రాప్తి అనిష్ట నివృత్తి కోరుటచే సర్వులకు వేదాధికారమున్నదా? యనిన అటులకాదు స్త్రీ శూద్రాదులకు లేదు ఉపనయన సంస్కారము గలిగినవారికి వేదాధికారము గలదు. శ్లో॥ స్త్రీ శూద్రద్విజ బంధూనాం త్రయీన శ్రోత్రగోచరా। ఇతి భారతమాఖ్యానం మునినాకృపయా కృతమ్॥ యను వ్యాస వచనములు గనుక ఉపనయన

సంస్కారముగలిగిన త్రైవర్ణులు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు) మాత్రమే వేదాధికారము గలదు.

వేదప్రామాణ్యమెటులనిన వేదముస్వతః ప్రమాణము. వేదము సర్వజ్ఞుండగు పరమేశ్వరునిచే రచింపబడినదగుటచేతను, పురుష బుద్ధికియుండెడి భ్రమాదిదోషములు లేనందునను, వేదము నిత్యమైనందున వక్తృదోష శంక లేనందునను వేదము స్వతః ప్రమాణము. వేదము అపౌరుషేయము (పురుషునిచే రచింపబడనిది) యనుటకు ప్రమాణము శ్రు॥ ఋచః సామాని జజ్ఞిరే 'ఛందాంసిజజ్ఞిరె తస్మాత్' 'యజుస్తస్మాద జాయత' నిత్యమనుటకు శ్రు॥ వాచా విరూప నిత్యయా (ఋ. 10-60-6) ప్రమాణములు. అందులకే బాదరాయణుడు 'శాస్త్రయోనిత్వాత్' యను సూత్రముచే పరమేశ్వరుడు వేదకారణముగా పలికెను

వేదము పరమేశ్వరుని నుండి ఉత్పన్నమగుటచే బ్రహ్మ సమాన నిత్యముగాదు, వేదము కాల, ఆకాశాదులవలె సృష్టికాలమందు నుత్పన్నమై ప్రళయకాలమందు పరమేశ్వరుని యందు లయమగుచు ప్రవాహ రూపము యీ వేదమే ఉత్పన్నమగుటచేతను, ప్రతి జగత్ స్థితి కాలమందును యీ వేదమే పాఠకులచే అధ్యయనము చేయబడుటచేతను, వసిష్ఠాదులు అధ్యయనముచేసిన వేదమే అస్మదాదులు అధ్యయనము చేయుటచేతను, స్థితి కాలమందు ప్రవర్తించిన వేదము ప్రళయ కాలమందు పరమేశ్వరుని లయమై అగిత్యక్తముగాక యీ వేదమే మరల సృజింపబడుటచేతను, వేదము సకల బ్రహ్మాండములందుండు జీవ సముదాయ వ్యవస్థను తెలుపుటచేతను, వేదమునందు తెలుపబడిన ఇంద్ర విష్ణ్వాది దేవతల సహస్రాక్ష చతుర్భుజాది విగ్రహ లక్షణములు దేవతా ధర్మములు నిత్యమగుటచేతను వేదము నిత్యమని ప్రతిపాదింపబడినది. కనుక వేదము అపౌరుషేయము. స్వతః ప్రమాణము నిత్యము.

"శ్రు॥ స్వాధ్యాయోఽధ్యేతవ్యః" (తై. ఆ. 2) యని వేదాధ్యయనము విధింపబడినది. కేవల వేదపాఠ బహుపుణ్య జనకమైనను వేదాధ్యయనము అర్థజ్ఞానము కొరకు విధింపబడినది. 'బ్రాహ్మణేన నిష్కారణో ధర్మషడంగో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ' యను వాక్యముచే వేదార్థ జ్ఞానము లేక మంత్రార్థము, మంత్ర వినియోగము, కర్మానుష్ఠానము దేవతారూపము తెలియబడదు గనుక వేదాధ్యయనముచేసి వేదార్థము విచారింపవలయును. "శ్రు॥ ప్రజాపతిర్యజ్ఞానసృజత। అగ్నిహోత్రం చాగ్నిష్టోమంచ పౌర్ణమాసీంచోక్థ్యంచ। అమావాస్యాంచాతిరాత్రంచ। ఇత్యాది శ్రుతులచే యజ్ఞములను ప్రజాపతి సృజించెననియు యజ్ఞానుష్ఠానము సర్వ పాపములనుండి విముక్తుడగునని 'సర్వంపాప్మానం తరతి తరతి బ్రహ్మహత్యాం యోఽశ్వమేధేన యజతేయ ఉచైనమేవం వేద'యని వినబడు

టచే యజ్ఞానుష్ఠానము చేయుటకు వేదాధ్యయనము అర్థవిచారణ విధింపబడినది.

వేదము రెండు 'కాండలు' గలిగినది పూర్వకాండయందు నిత్యనైమిత్తిక, కామ్య నిషిద్ధ రూపమైన చతుర్విధ కర్మ ప్రతిపాదింపబడినది. నిత్యనైమిత్తికానుష్ఠానముచే వాని చేయకుండ ఉండుటచే గలిగెడి ప్రత్యవాయము పరిహారమగును. నిత్యనైమిత్తిక కర్మ అనుష్ఠింపనియెడల గలిగెడి ప్రత్యవాయము. శ్లో॥ విహితస్యాననుష్ఠానాన్నిందితస్యచ సేవనాత్। అనిగ్రహాచ్చేంద్రియాణాం నరః పతనమృచ్ఛతి॥ (యాజ్ఞవల్క్య స్మృతి) 'యావజ్జీవం అగ్నిహోత్రం జుహుయాత్' 'అహరహః సంధ్యా ముపాసీత' ఇత్యాది శ్రుతులచే నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానము విధింపబడుటచే స్వాభీష్టమైన స్వర్గప్రాప్తి. 'తద్యథా ఆమ్రే ఫలార్థే నిర్మితే చ్ఛాయాగంధావిత్యనూత్పద్యేతేఏవంధర్మం చర్యమాణోఽర్థా అనూత్పద్యంతే' యను ఆపస్తంబవచనములు అనగా మామిడిపండ్ల కొరకు వేయబడిన మామిడిచెట్టు కోరిన మామిడిపండ్లను యిచ్చుటయె గాక. మంచి నీడయు మంచి వాసనయు యిచ్చునట్లుల ధర్మానుష్ఠానముచే స్వర్గాదులు గలుగుటచే గాక యశము, ఆరోగ్యము, వర్చసు, మేధా, మొదలగు అనేక అవాంతర ఫలములనిచ్చును. నిషిద్ధ కర్మలను వర్జించుటచే నరకపాతాది ప్రత్యవాయములు పరిహరింపబడును. నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానముచే. అంతఃకరణ శుద్ధిపొంది బ్రహ్మజ్ఞాన హేతువగును. యజ్ఞాది కర్మానుష్ఠానముచే స్వర్గముపొంది! మరల జననము గలుగుటచే జన్మరాహిత్యము కొరకై ఉత్తరకాండ (జ్ఞానకాండ) వర్తించును. ఉత్తరకాండయందు ప్రతీకోపాసనలు, అహంగ్రహోపాసనలు, బ్రహ్మజ్ఞానము నుపదేశింపబడినవి. ప్రతీకోపాసనచే విద్యుల్లోక గమనము పునరావృత్తి. అహం గ్రహోపాసలచే బ్రహ్మలోకము పొందబడు క్రమముక్తి గలుగును. బ్రహ్మజ్ఞానముచే వర్తమాన శరీర పాతముచే సద్యోముక్తి గలుగును. వేదమార్గము సర్వాభీష్టములు, స్వర్గము, పరమ పురుషార్థమైన మోక్షము గలుగ చేయును. గనుక వేదమాత కామధేనువు. వేదమార్గమునే ఆశ్రయింప వలయును.

వేదము ఒకటైనను ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము అను నాలుగు విధములు ఋగ్వేదము 8 అష్టకములు, 94 అధ్యాయములు 2009 వర్గలు గలిగినది. ఋక్కులు పాదబద్ధ గాయత్ర్యాది ఛందోవిశిష్టములు. దీనికి ఐతరేయ బ్రాహ్మణమనియు, శాంఖ్యాయన బ్రాహ్మణమనియు రెండు బ్రాహ్మణములు గలవు ఆశ్వలాయన శాంఖ్యాయన సూత్రము లీ వేదమునకు సంబంధించినవి.

యజుర్వేదము కృష్ణ యజుర్వేదమనియు, శుక్లయజుర్వేద మనియు ద్వివిధము కృష్ణ

యజుర్వేదమునకే తైత్తిరీయ శాఖయని నామాంతరము గలదు. ఈ వేదముసంహిత (44 ప్రశ్నలు) బ్రాహ్మణము (28 ప్రశ్నలు) అరణ్యకము (10 ప్రశ్నలు)గలది. ఆపస్తంబ, బోధాయన సత్యాషాఢ హిరణ్యకేశీయ, భారద్వాజ, వైఖానస కల్పసూత్రము లీవేదమునకు సంబంధించినవి.

శుక్ల యజుర్వేదము—ఇందు మాధ్యందిన శాఖయనియు కణ్వశాఖ యనియు రెండు శాఖలు గలవు. ఈ వేదము 40 అధ్యాయములుగలది. ఈ వేదమునకు శతపథబ్రాహ్మణముగలదు. పారస్కర కాత్యాయనాదికల్పసూత్రము వెవేదమునకు సంబంధించినవి.

సామవేదము—ఈ వేదసంహిత పూర్వార్చికము 6 ప్రపాఠములు ఉత్తరార్చికము 9 ప్రపాఠములు గలది ఈ వేదమునకు 8 బ్రాహ్మణములు గలవు గోబలలాట్యాయన ద్రాహ్యాయణాది సూత్రములు దీనికి చేరినవి.

అధర్వణవేదము-ఈ సంహిత 20 కాండలు అనేక అనువాకములుగ విభజింపబడినవి. ఇందు గోపథ బ్రాహ్మణము గలదు. కౌశిక కల్పసూత్రమిా వేదమునకు చేరినవి. వేదాంగములు శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము జ్యోతిషము కల్పము యనునవి ఆరు.

శిక్షావ్యాకరణములు వర్ణోచ్చారణ, పదసాధుత్వము కొరకు వినియోగము నిఘంటువు వైదిక మంత్రపదములకు అర్థము గోచరించుటకు ఉపయోగము. ఛందస్సు, ఋఙ్మంత్రములకు ఛందో విభాగముచే దేవతా మంత్రార్థ జ్ఞానముకొరకు ఉపయోగము దీనిని పింగళ నానాచార్యులను వారొనర్చిరి. జ్యోతిషము ప్రతి వేదమునకు వేర్వేరుగగలవు లగధుడను మహాత్ముడు దీనిని రచించెను, దీని సిద్ధాంత భాగముచే వేదోక్త కర్మానుష్ఠాన యుక్త కాలము తెలియదగును జాతక భాగముచే మనుజుల వివాహ సంతానాది విశేషములు పుణ్యకర్మ ఫలములును, రోగ, అపమృత్యు కాలములు తెలిసికొని వానిని గ్రహారాధన మంత్ర జపాదులచే నివారించుకొనవచ్చును.

(సశేషము)

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలరఘునాథశర్మ

(చైత్రమాసం సంచికతరువాయి)

కల్పము – దీనియందు వేదమంత్రములకు వినియోగము తెలుపబడి యుండును. కృష్ణ యజుర్వేదమునకు ఆపస్తంబాది కల్పసూత్రములు గలవు. ఇట్లే ప్రతి వేదమునకు వేర్వేరుగ కల్పసూత్రములు గలవు. వేదమునకు ఉపాంగములు నాలుగు. పురాణము సర్గప్రతిసర్గవంశ మన్వంతర వంశానుచరిత ప్రతిపాదకములు వ్యాసమహర్షి చేరచింపబడిన బ్రాహ్మము పాద్మము వైష్ణవం, శైవం భాగవతం, నారదీయం, మార్కండేయం, ఆగ్నేయం, భవిష్యం, బ్రహ్మవైవర్తం, లైంగం వారాహం, స్కాందం, వామనం, కౌర్మం, మాత్స్యం, గారుడం, బ్రహ్మాండమని 18 పురాణములు. రామాయణాది ఇతిహాసములు ధర్మముల బోధించెడి మన్వాదిస్మృతులు. ఇవి ధర్మ. బ్రహ్మనిష్ఠలను గాథారూపముగా వివరించుచున్నవి. న్యాయశాస్త్రము గౌతమ ప్రణీతము ప్రమాణ ప్రమేయ, సంశయ, ప్రయోజన, దృష్టాంత, సిద్ధాంత, వయతర్క నిర్ణయ, వాద, జల్ప, వితండ, హేత్వాభాస, ఛల, జాతి నిగ్రహస్థానములను, షోడశ పదార్థ లక్షణ బోధకశాస్త్రము. ఇతి తత్త్వజ్ఞాన పరీక్షకు నుపయోగము. వైశేషికశాస్త్రము ద్రవ్య గుణకర్మ సామాన్యవిశేష సమవాయములను ఆరు భావపదార్థములను, అభావమను సప్తమపదార్థము బోధించునది కాణాదప్రణీతము.

మీమాంసా ద్వివిధము - పూర్వ మీమాంసా, ఉత్తరమీమాంసా, పూర్వమీమాంసా శాస్త్రము జైమిని మహర్షిచే రచింపబడి కుమారిలభట్ట శబరమునులచే వివరింపబడినది. పూర్వమీమాంస శాస్త్రము 12 అధ్యాయములుగలది. 'అథాతో ధర్మజిజ్ఞాసా' మొ॥ 'అన్వాహార్యదర్శనాత్' సూత్రములు గలది. దీనియందు దేవతాకాండయను పేరుగల సుప్రసిద్ధ భాగమునందు యజ్ఞాది కర్మానుష్ఠానమున్ను దేవతోపాసనయు వివరింపబడినది.

ఉత్తమీమాంసా వేదవ్యాస మహర్షిచే రచింపబడిన 4 అధ్యాయములు 555 సూత్రములుగలది. 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' మొదలు 'అనావృత్తిః శబ్దాత్' యనుసూత్రం వరకు గలది. దీనికి శ్రీమచ్ఛంకర భగవత్పాదులవారు భాష్యమును రచించిరి. ఇది శాస్త్రములలో మూర్ధన్యము. దీనియందు ఉపనిషద్వాక్యముల నర్థము పూర్వపక్ష సిద్ధాంత

రూపము విమర్శింపబడి పరమాద్వైత తత్త్వమందు శాస్త్రార్థము పర్యసింపబడినది. ప్రథమాధ్యాయ పాదమందు సర్వవేదాంత వాక్యములకు సాక్షాత్ పరంపరగా ప్రత్యగభిన్న బ్రహ్మయందు సమన్వయము ప్రదర్శింపబడినది. స్పష్టబ్రహ్మ లింగ వేదాంత వాక్యములు విచారింపబడినవి. 2 వ పాదమందు అస్పష్ట బ్రహ్మలింగ వాక్యములు విచారింపబడినవి. 3 వ పాదమందు అస్పష్ట బ్రహ్మ లింగవాక్యములు జ్ఞేయబ్రహ్మ విషయములు. 4వ పాదమందు సందిహ్యమాన అవ్యక్త, అజాది పదములు చింతింపబడినది. ద్వితీయ అధ్యాయమందు సాంఖ్య, కాణాదమాతాది దుష్టత్వం ప్రదర్శింపబడి ఖండింపబడినది. తృతీయఅధ్యాయమందు సాధనచతుష్టి సంపత్తి నిరూపణం. తత్ త్వంపదార్థశోధనముజీవ బ్రహ్మైక్యనిరూపణ చేయబడినది. ప్రాసంగికముగా సగుణోపాసన (అహంగ్రహోపాసనలు) విమర్శింపబడినవి. 4 వ అధ్యాయమందు నిర్గుణ బ్రహ్మవిద్యకు కావలసిన ఆశ్రమధర్మాది బహిరంగ సాధనములు శమదమాదులు శ్రవణమనననిధిధ్యాసలు అంతరంగిక సాధనలు సాక్షాత్కారము, జీవన్ముక్తి విదేహముక్తి లక్షణములు సర్వశాస్త్ర విషయములు విమర్శింపబడినది. ఇది ముముక్షువులచే అత్యాదరణీయము. వేదమునుండియే ఆయుర్వేదశాస్త్రము క్షత్రియులు అభ్యసింపవలసిన అస్త్రశస్త్రప్రయోగముల బోధించెడి ధనుశ్శాస్త్రము, కామశాస్త్రము, గంధర్వవేదశాస్త్రము, చతుష్షష్టి కళాశాస్త్రములు ఉద్భవించినవి. వెదాధికారములేని శూద్రాదులు పురాణ స్మృతివచనములచే బోధింపబడిన విధముగా సదాచారాముతో కర్మ దేవతోపాసన చేయవలయును. పురాణ స్మృతులు వేదార్థప్రకాశములగుటచే పురాణోక్తముగాశ్రద్ధాభక్తి,నియులచేశబరి, విదురుడు మొదలగు మహాభక్తులవలె సులభముగా తరింపగలరు. సత్త్వాదిగుణ విభాగంచే సృజింపబడిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు స్వాభావిక ధర్మము భగవద్గీతయందిట్లు వివరింపబడినది.

శ్లో॥ శమోదమస్త పశ్శౌచం క్షాంతిరార్జవమేవచ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్।

అంతరింద్రియ నిగ్రహము, బహిరింద్రియనిగ్రహము, శౌచము, ఓర్పు, ఋజుభావము, శాస్త్రజ్ఞానము, ఆత్మజ్ఞానము, ఆస్తికభావము వేదములయందు శాస్త్రజ్ఞులయందు శ్రద్ధావిశ్వాసము, బ్రాహ్మణ స్వభావమున పుట్టిన కర్మ.

శ్లో॥ శౌర్యం తేజోధృతిర్దాక్ష్యం యుద్ధేచాప్య పలాయనమ్।
దానమీశ్వర భావశ్చక్షాత్రం కర్మ స్వభావజమ్॥

శౌర్యము, ప్రాగల్భ్యము, ధైర్యము, లొంగనుండకుండుట. చేయవలసిన కార్యములందు వ్యామోహరహితముగా చేయుట, యుద్ధము

నందు వైరపరాన్ముఖముబొందకుండుట వైరుల ఎదుర్కొనుట, ద్రవ్యదానమందు ముక్తహస్తత, ప్రభుశక్తి ప్రకటీకరణము క్షత్రియుల స్వభావమున బుట్టిన కర్మ.

శ్లో॥ కృషిగౌరక్ష్యవాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మశూద్రస్యాపి స్వభావజమ్ ॥

భూవ్యవసాయము, గోరక్షణము, వ్యాపారం వైశ్యస్వభావజకర్మ పరిచర్యకర్మ శూద్రస్వభావజము 'స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతేనరః' "స్వభావనియతంకర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్" ఇత్యాది భగవంతునివాక్యములచే బ్రాహ్మణాది వర్ణులు వారి స్వభావ కర్మానుష్ఠానముచే పాపనిర్ముక్తులై స్వర్గాపవర్గములు పొందెదరని విశదమయినది.

శ్లో॥ ఆచారః పరమోధర్మం శ్రుత్యుక్తః స్మార్త ఏవచ ।
తస్మాదస్మిన్సదాయుక్తో నిత్యంస్యాదాత్మవాక్ ద్విజః ॥
ఆచారాద్విచ్యుతో విప్రో న వేద ఫలమశ్నుతే ।
ఆచారేణతు సంయుక్తః సంపూర్ణ ఫలభాగ్భవేత్ ॥

దేశధర్మములు, జాతిధర్మములు, కుల ధర్మములు శ్రుతి స్మృతులచే విధింపబడి సదాచారము అనుష్ఠించుటవలన శాస్త్రీయకర్మానుష్ఠానఫలము బొందును. ఆచార హీనుడు శాస్త్రోక్త కర్మానుష్ఠాన ఫలము పొందడు. (మనుస్మృతి)

(సశేషము)

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

'శ్రు॥ త్రయోవై ధర్మ స్కంధాః । బ్రహ్మచర్యాచార్య కులేవాసీత ప్రథమః । యజ్ఞదానాధ్యయనమితి ద్వితీయః । తప ఇతి తృతీయః త్రయ ఏతే పుణ్యలోకాభవంతి । బ్రహ్మసంస్థో అమృతత్వ మితి " వేదముచే విధింపబడిన ధర్మశాఖలు మూడు. ఉపనయన సంస్కారముచే ప్రారంభమై గురుకులమందు వేదాధ్యయనముచేసి వేదవేదాంగ అర్థవిచా విచారము చేయవలసినది నిత్యము అగ్నికార్యము సంధ్యోపాసన చేయుచు నిశితమైన నిష్ఠచే జరుపవలసినది.

"వేదస్యాధ్యయనం సర్వం గుర్వధ్యయన పూర్వకష్" వేదవేదాంగములు గురుముఖముగా అధ్యయనము చేయవలయును. ఇది ప్రథమము బ్రహ్మచర్యాశ్రమము వివాహముతో ప్రారంభమగు గృహస్థాశ్రమమువందు శ్రుతి స్మృతులచే విధింపబడు యజ్ఞములు, వేదాధ్యయనము. ఒక వేదమైనను లేక తనశాఖ వేదమైనను, లేక కొన్ని ప్రశ్నలనైనను కొన్ని మంత్రములనైనను నిత్యము అధ్యయనము చేయవలయును. ఇది రెండవ ధర్మశాఖ. బ్రాహ్మణులకు యజన, యజన, అధ్యయన అధ్యాసనదాన ప్రతిగ్రహములందు అధికారము గలదు. క్షత్రియ, వైశ్యులకు యజన, అధ్యయన, దానములందు మాత్రమే అధికారము గలదు.

వానప్రస్థాశ్రమమందు భార్యా పుత్రాదుల వదలిగాని వారితోగాని అరణ్య విజన ప్రదేశమునందు నివసింపవలెను. ఈ ఆశ్రమమందు కంధమూలాదులు భుజించుచు తపమాచరింపవలెను. రోజునకొకసారి భుజించి జితేంద్రియుడై నిత్యము అగ్నిహోత్రాది కర్మలనాచరించుచు నిత్యము గాయత్రీజపమాచరించుచు యోగాభ్యాసపరుడై ఆశ్రమ ధర్మము నాచరింపవలయును. ఈ మూడుములు ధర్మశాఖలు పుణ్యలోకములు పొందచేయును.

'బ్రహ్మసంస్థో అమృతత్వమితి' యని వినబడిన తురీయాశ్రమము సన్యాసాశ్రమము. సన్యాసాశ్రమమందు కుటీచకుడు శిఖాయజ్ఞోపవీతములతో దేవతారాధనపరుడై వేదాధ్యయనము చేయుచు తీర్థయాత్రల సేవింపవలెను.

హంసశిఖుడు వర్జించి నిత్యము సావిత్రీ జపము చేయుచు మౌనియై కృచ్ఛ్రచాంద్రాయణాదుల నాచరించుచు పరోక్షష్ఠ గలిగి యుండవలెను.

పరమహంస శిఖాయజ్ఞోపవీతములనునిత్య కర్మలను వర్జించి అక్షమాలను ధరించి భిక్షాన్నము భుజించుచు సద్గురువులవద్ద బ్రహ్మ విచారణ చేయుచుండవలెను. సన్యాసులు దండమును జలపాత్రను ధరింపవలెను ఇది బ్రహ్మవిద్యకు లక్షింపబడిన ఆశ్రమము. వన్ని ఆశ్రమములవారు 'అగ్నిరితి భస్మ' ఇత్యాది మంత్రములతో జపింపబడిన భస్మ త్రిపుండ్రమును ధరింపవలెను. ఉపాదులవలన జనించిన మనోదోషములు నశించి ఉద్రేకములు క్షీణించి బుద్ధిసాత్వికమగును. ఉపవాసములచే శరీరము శుష్కింపచేయకూడదు.

యోగ. తపములకు భంగము కలుగును సాంతపన మనగా గోమూత్రము గోమయము గోక్షీరము గోఘృతము గోదధి కుశోదకము సేవించుచుండవలెను. దీనిచే దోషములు తొలగి మనోబుద్ధి బలముకలుగును. చాంద్రాయణ [illegible] నుండి [illegible] 16వ వంతు తగ్గించు [illegible] ప్రమాణము) శుక్లపాడ్యమి మొదటిపూర్ణిమ వరకు కుక్కుటాండ ప్రమాణము గలిగిన ఒం అన్నపిండమును వృద్ధిచేయుట చాంద్రాయణవ్రతమనబడును. దీనివలన దోషములు నివారించి అంతఃకరణ పరిశుద్ధమగును.

(సశేషము)

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

[గత సంచిక తరువాయి]

సన్యాసాశ్రమము బ్రహ్మచర్యాశ్రమము నుండిగాని, గృహస్థాశ్రమము నుండి గాని వానప్రస్థాశ్రమమునుండిగాని సంపూర్ణవైరాగ్యము గలిగినపుడు పొందవచ్చును. "శ్రు॥ బ్రహ్మచర్యాద్వా గృహాద్వా వనాద్వా యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్", వానప్రస్థాశ్రమమునుండి సన్యాసాశ్రమము స్వీకరింప వలయునని నియమము లేదు.

సన్యాసాశ్రమము స్వీకరించుటకు బ్రాహ్మణులకే అధికారము గలదు. క్షత్రియ వైశ్యులకు అధికారము లేదు అందుకనియే శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో 'కర్మణ్యేవాధికారస్తే' యనెను. సంస్కారముగా పురుషుని చిత్తమును పరిశుద్ధముచేసి బ్రహ్మ విషయక జ్ఞానము పొందుటకు యోగ్యముచేయునటుల సంస్కరించునది. ద్విజులావశ్యకముగా నాచరింపవలసిన సంస్కారములు నలుబది.

1) గర్భాదానం : దీనిచేత గర్భమున విడువబడు వీర్యము మోహమై గర్భము ధరింపబడును. బీజదోషమును గర్భదోషమును హరించును.

2) పుంసవనం :- ఈ సంస్కారముచే పుత్రుడు కలుగును.

3) సీమంతం :- ఇది ఒక గర్భసంస్కారము,

4) జాతకర్మ :- దీనిచేత గర్భమునందు శిశువు చేయు గర్భజలపాన దోషము నివర్తించును.

5) నామకరణము :- ఈసంస్కారముచేత ఆయుర్వృద్ధియు, తేజోవృద్ధియు, వ్యవహార సిద్ధియు గలుగును.

6) అన్నప్రాశనం :- మాతృగర్భసంబంధమగు మలవస్తుసేన దోషము పోవును.

7] చౌడము:- జలఆయుస్తేజోవృద్ధిగలుగును.

8) ఉపనయనము:-ద్విజత్వసిద్ధి గలుగును వేదాధ్యయనాధికారము గలుగును. గాయత్రీమహామంత్రము ఉపదేశింపబడును. శ్రౌతాధికారియగును.

9) ప్రాజాపత్యం :- కాండర్షి ప్రజాపతి అనుగ్రహార్థము చేయవలయును.

10) సౌమ్యం :- సోముడు వేదమునకు కాండర్షి గనుక తదనుగ్రహార్థము యీవ్రతము చేయవలయును.

11) ఆగ్నేయం :- అగ్నియు వేదమునకు కాండర్షిగనుక చేయవలయును.

12) వైశ్వదేవం :- విశ్వదేవులు కాండర్షులుగాన చేయవలయును.

13) సమావర్తనం :- స్నాతక వ్రతము

గృహస్థాశ్రమము స్వీకరించునపుడు చేయవలెను.

14) వివాహము :- దీనివలన దేవ పితృ ఋణముల తీర్చుటకు సమర్థుడగును. యజ్ఞ దానాధ్యయనాదులకు యోగ్యుడగును.

15, 16, 17, 18, 19 దేవయజ్ఞము పితృయజ్ఞము, భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము, బ్రహ్మయజ్ఞమను పంచ యజ్ఞములు అగ్నియందు హోమముజేయుట, పితరులకు పిండ ప్రదానముచేయుట, భూతతృప్తికొరకు అన్నమునిచ్చుట, అతిథులకు భోజన మిచ్చుట, వేద వేదాంగముల నిత్యము అభ్యసించుట యనునవి.

20) అష్టకము - పితరులకు భోజనమిచ్చునది.

21) పార్వణ :- ప్రతి పాడ్యమియందున గృహస్థు లోనరింపవలెను.

22) శ్రాద్ధం :- మాసశ్రాద్ధము కృష్ణ పక్షమందు శ్రద్ధతో జేయవలసినది.

23) శ్రావణి :- శ్రావణ పూర్ణిమనాడు చేయుసర్పబలి యనునది.

24) అగ్రహాయణి :- మృగశిరానక్షత్ర పూర్ణిమనాడు చేయవలసినది.

25) చైత్రీ : చిత్తానక్షత్రయుత పూర్ణిమనాడు చేయవలసిన ఈశానబలి.

26) ఆశ్వయుజి :- ఆశ్వయుజ శుద్ధపూర్ణిమనాడు చేయవలసినది.

27) అగ్న్యాధేయం :- అగ్నిహోత్రము దీనిచే గ్రహింపబడును.

28) అగ్నిహోత్రం :- అగ్ని కొరకు హోమము చేయబడు కర్మ.

29) దర్శపూర్ణమాసములు :- ఆహితాగ్నియగువాడు శుక్లకృష్ణ ప్రతిపత్తులయందు చేయవలసిన ఇష్టిభేదములు.

30] చాతుర్మాస్యములు:- వైశ్వదేవము, వరుణ ప్రఘాసము, సాకమేధము, సునాసీరీయమను నాలుగు వ్రతములు.

31] ఆగ్రయణేష్టి :- అగ్నిహోత్రికు సస్యాదిము నియ్యబడునది దీనితరువాత నవీనధాన్యములను మనము భుజించెదము.

32] నిరూఢపశుబంధము: ఆరుమాసముల కొకసారిగాని సంవత్సరము కొకసారిగాని చేయవలసిన యాగము.

33] సౌత్రామణి: ఈయాగమునకు ఇంద్రుడధిదేవత.

34] అగ్నిష్టోమం :- అగ్నిని స్తుతించు మంత్రములు. దీని యంత్యమున నుండుటచే ఈయాగము అగ్నిష్టోమమనబడును.

35] అత్యగ్నిష్టోమము :- ఎక్కుడు ఫలమిచ్చు మరియొక యజ్ఞము.

36] ఉక్థ్యము :- అప్రగీత మంత్రముల స్తోత్రములచే చేయబడు సంస్కారము.

37 షోడశీ :- ప్రజాపతి సర్వయజ్ఞములను తేజోవంతము నగు భాగము 16 భాగములు

[illegible]గా నొఃకర్త్రృణ ఇది సామవేదాం[illegible]

[illegible] వాజపేయము. :- ఈ యజ్ఞమందు [illegible]గాని, ఘృతముగాని స్వీకరింపనగును.

[illegible] [illegible]రాత్రి :- ఈయజ్ఞము ఒకరాత్రి [illegible] [illegible]వ కాలము చేయవలసినది.

[illegible] [illegible]ప్తోర్యామము :. ఈయజ్ఞ మాచ[illegible]వలన దేవతలు ప శ్వా ది క ము ల [illegible]

[illegible]ద్విజులు ఆచరింపవలసిన కర్మలు [illegible] సంధ్యా, జపో, హో మం [illegible]చ పూజనం. ఆతిధ్యం వైశ్య[illegible]ర్మాణి దినే దినే - ఇవిఏడు.

[illegible]ము క.

[illegible] :- శరీరపరిశుద్ధి చేసి శాస్త్రీయ [illegible] యోగ్యత గలుగచేయును. [illegible]ణ సూక్తము దోష[illegible]

[illegible] సంధ్యావందనము త్రిసంధ్య[illegible] కాలాతీతమైన ప్రా[illegible] వలెను. 'అసావాది[illegible]రుడు ఆదిత్యమండలము [illegible]వుడు తనకు ఐక్యము [illegible] చేయవలెను.

జపము :- ఉపనయనందునుపదేశింపబడిన గాయత్రిని నిత్యము జపింపవలెను. వేళ్ళ యందు నిత్యము గృహస్థుడు బ్రహ్మచారి 108 జపించవలెను. వానప్రస్థుడు 1000 జపం పవలెను 'నగాయత్ర్యాః పరంమంత్రం న మాతుః పరదేవతా' యని శ్రీ భగవత్పా దులవారు వచించినటుల యీ మంత్రము అమోఘమైనది. 24 అక్షరములు గలిగినది. బ్రహ్మతత్వమును వర్ణించునది ఈ మంత్ర మునందు సూర్య, వేదమాత, శుద్ధబ్రహ్మో పాసనలు ఇమిడి వున్నవి. ఈ మంత్రమునకు భూః, భువః సువర్లోకములుత్రిగుణాత్మకమైన స్థూలసూక్ష్మ కారణప్రపంచమంత్రముప్రణ వార్ధమైన బ్రహ్మయే ఆ తేజోవంతమైన ఆరాధింపవలసిన స్వప్రకాశుడైన బ్రహ్మయే మా అంతఃకరణవృత్తుల ప్రేరేపించు అపరో క్షసాక్షిచైతన్యము యని తత్త్వమస్యాది మహావాక్యార్థము. ఈ మంత్రానుష్ఠానము వలన తేజోబల ఆరోగ్యములు బుద్ధి కుశలత అంతఃకరణ పరిశుద్ధి సకలపాపనివృత్తి బ్రహ్మ లోకము, జీవన్ముక్తికలుగును. నరకాదిప్రత్య వాయము గలుగును.

హోమము :- బ్రహ్మచారులు అగ్నికా ర్యము, గృహస్థులు ఔపోసనహోమము నిత్యము సాయం ప్రాతఃకాలముల యందు అగ్ని నారాధింపవలెను. (సశేషము)

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

[గత సంచిక తరువాయి]

దేవతార్చనము- ఇది పురుషసూక్త విధానమనియు, బోధాయనోక్తసూత్ర ప్రకారమనియు ద్వివిధము. దీనియందు శివుని, అంబను, విష్ణు, రవి, వినాయకులను పూజింపవలయును. పురుషసూక్త రుద్రములచే అభిషేచనము చేయవలయును. షోడశోపచారములచే పూజింపవలయును. ఆయా దేవతల స్థానముల గుర్తించి పీఠమునందుంచి అర్చింపవలయును.

ఆతిథ్యం- భోజనమునకు పూర్వము గోదోహనకాలము అతిథికొరకు వేచియుండవలెను. అతిథివిష్ణువు అతడే శివుడు అతడే బ్రహ్మ. అతిథికి అర్ఘ్యపాద్యాదుల నిచ్చి ఆరాధించి భోజన మివ్వవలెను. అతిథులకు అన్నమీయునంత శక్తి లేనియెడల వ్యంజనాదియుతమగు యొక గ్రాసమైనను ఉదక పాత్రనైనను ఈయవలయును.

వైశ్వదేవము

సాయంప్రాతఃకాలములయందు గృహాశ్రమి యగువాడు వైశ్వదేవ మాచరింపవలయును. దీనిచే కూరగాయలు తరుగునప్పుడు (బండినీ) నూరుట (పేషిణీ), పొయియందు నిప్పునరాజవేయుట (చుల్లి) నీటికడవలుంచుట (ఉదకుంభీ) అలుకుట, చిమ్ముట (మార్జని) చేయుటయందు క్రిమికీటాదు లెన్నియో చచ్చుట సంభవించును గనుక పంచసూన నివృత్తికొరకు పంచయజ్ఞములు నాచరింపవలయును.

బ్రహ్మయజ్ఞము- ద్విజుడు నిత్యము వేదమును వేదాంగములను నిత్యము కొంచెమైనను అధ్యయన మొనర్పవలయును. దేవర్షి పితృతర్పణముల నొనర్పవలయును. నిత్యము స్వపితృతర్పణముల నొనర్పవలయును. దీనిచే దేవర్షి పితృఋణములు తీరును.

మనుజునకు (1) దయ- శత్రువునైనను ఆపత్తునందు రక్షించు దయ, (2) క్షాంతి - ఇతరుడు తనకు దుఃఖము గలుగచేసినను మనసునందుగాని పరునియందుగాని కోపము లేకుండుట (3) అనసూయ- గుణవంతుల గుణాదులు వెల్లడిచేయకపోవుట అసూయ అదిలేమి అనసూయ;- 4) శౌచం- పతితుల పొత్తును అభోజ్యపదార్థములను పరిహారము చేయుచు స్వధర్మమున ప్రవర్తించుట 5) అనాయాసము- శరీరమునకు కాయాపము గలుగజేయు క్షుద్రకర్మల నాచరింపకుండుట. 6) మాంగల్యము- నింద్యములగు పనులను వదలి ప్రశస్తమగు పనులొనర్చుట 7) అకార్పణ్యము-లోభిత్వ లేక దేశకాలపాత్ర

నెరిగి భక్తితో శక్తికొలది దానమిచ్చుట 8) అస్పృహ-వస్తువుల నపేక్షింపకుండ ఉండుట. ఈ ఎనిమిది సద్గుణము లుండవలెను. ఇవి గలిగినచో ధర్మానుష్ఠానఫలము పొందును. ఈ అష్టగుణములు లేనియెడల ధర్మానుష్ఠాన ఫలము బొందక నష్టకష్టముల పొందును.

దేవతోపాసన- బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, స్కంద, విఘ్నేశ్వర, సూర్యుడు మొదలైన విశిష్ట దేవతలు విదేహముక్తులు. వారు బ్రహ్మస్వరూపులు. శ్లో॥ యతీనాం మంత్రిణాంచైవ జ్ఞానినాం యోగినాంతథా! ధ్యానపూజానిమిత్తం హితనుం గృహ్ణాతి స్వేచ్ఛయా॥ యని చెప్పబడినటుల పరమేశ్వరుడు బ్రహ్మ విష్ణ్వాదిదేవత రూపము బొందుటచే వారిని పరమేశ్వరదృష్టితో ఆరాధింపవలయును. భజ్=ఆరాధన యను ధాత్వర్థమునుండి కాయిక వాచిక మానసికములచే దేవతల నారాధింప వలయును. దేవతావిగ్రహములందు దేవతాదృష్టిచే పరిచర్య చేయుట కాయికము. దేవతల వర్ణనము, దేవతల పరిణయ విక్రమములు దుష్టశిక్షణశిష్టరక్షణములుపురాణేతిహాసములద్వారా గ్రహించుటచే భక్తి దృఢమగును. దేవతల నామములు దేవతాలీలలను వర్ణించు కథలను పఠించుట, సంకీర్తనము చేయుట వాచిక ఆరాధన, విష్ణ్వాది దేవతామంత్రజపము, ధ్యానము మానసికభక్తి. కాయిక వాచిక మానసికభక్తులలో ఉత్తరోత్తరములు శ్రేష్ఠములు. దేవతకు స్థూల, సూక్ష్మ, స్వరూపములను మూడురూపములు గలవు. స్థూలరూప మనగా శంఖచక్ర గదాపద్మముల ధరించిన నీలమేఘఛాయగలిగిన విష్ణుమూర్తి త్రిశూలము సర్పములను వ్యాఘ్రచర్మము ధరించిన త్రినేత్రశివమూర్తి. స్థూలరూపమునందు ధ్యానముప్రథమసోపానము. 'మంత్రోవై దేవతా' యనునటుల దేవతయొక్క సూక్ష్మరూపము యాదేవతాకమంత్రము. అనగా మంత్రావచ్ఛిన్న చైతన్యము. మంత్రవర్ణములు దేవతవిగ్రహావయవములు దేవత మంత్రరహస్యము నెరిగి దేవత సూక్ష్మరూప ధ్యానముచే మంత్రజపముచే ప్రతిబంధక పాపనివృత్తి గలిగి దేవతసాక్షాత్కారము గలుగును. సర్వాభీష్టసిద్ధి గలుగును. "ఉపాసనో నామ నైరంతర్యేణ తాత్పర్యపురస్సరో వ్యవహారః" యని శ్రీ విద్యారణ్యులవారిచే పలుకబడినట్లు నిరంతరం భక్తిచే దేవతాలోక గమనము దేవతాసాయుజ్యము గలుగును. దేవతస్వరూపము తత్త్వమస్యాది మహావాక్య విచారణచే పొందబడు అఖండ సచ్చిదానంద అపరోక్ష చైతన్యము. ఉపనిషదర్థమును సద్గురువులవలన శ్రవణముచేసి దేవతస్వరూపధ్యానముచే జననమరణసంసారమునుండి విముక్తుడగును.

(సశేషము)

"తత్త్వమసి తత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

[గత సంచిక తరువాయి]

విరాడుపాసన

సమష్టిస్థూల శరీరాభిమానియైన పరమేశ్వరుని (విరాట్పురుష) నని ఉపాసన శ్రుతిస్మృతులయందు ప్రతిపాదింపబడినది. చతుర్దశలోకములయందు ఊర్ధ్వ సప్త లోకములు పరమేశ్వరుని కటి ప్రదేశ పైభాగము. అధో లోకములు జఘనము క్రిందిభాగము. ప్రపంచ శరీరుండగు భగవంతుని ముఖంబువలన బ్రాహ్మణులు, భుజములనుండి క్షత్రియులు, ఊరువులనుండి వైశ్యులు, పాదంబులనుండి శూద్రులు జనించిరని చెప్పుదురు. భూలోకంబు కటిపర్యంత ప్రదేశము భువర్లోకము నాభి సువర్లోకము హృదయము మహర్లోకము వక్షము జనలోకము కంఠము తపోలోకము స్తనద్వయము సత్యలోకంబుశిరము, జఘనప్రదేశంబు అతలము తొడలు వితలము జానువులు సుతలము జంఘలు తలాతలంబు గుల్ఫములు మహాతలంబు పాదాగ్రంబులు రసాతలము పాదతలంబు పాతాళంబని సర్వలోకమయునిగా వర్ణింతురు. పురుషోత్తమునివలన సర్వ జంతుజాలంబులు వహియు యుదయించి సప్త ధాతువులు అందు దంతు రోమంబులు ఉష్ణిక్ఛందము త్వక్ ధాత్రి ఛందము, మాంసము త్రిష్టుప్ ఛందము, స్నాయువు అనుష్టుప్ఛందము, అస్థి జగతీఛందము, ప్రాణము బృహతీఛందము లుదయించుటచే వేదపురుషుడని మహాత్ములు వచింతురు. పరమ పురుషుని మనసునుండి చంద్రుడును, చక్షువునుండి సూర్యుడును, ఇంద్రాగ్నులు ముఖమునుండియు, ప్రాణము నుండి వాయువును, నాభినుండి అంతరిక్షము, శిరమునుండి స్వర్గము, శ్రవణేంద్రియంనుండి దిక్కులును జనించిరి. సర్వకర్త, సర్వభోక్త యగు పరమేశ్వరుని నుపాసించువారు ముక్తులగుదురు పునరావృత్తి రహితమైన లోకములకు బోయెదరు. శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు దర్శింపజేసిన విశ్వరూపము దీనికి ఉపలక్షణమేయగును. పురుషసూక్తము విరాడ్పురుషుని వర్ణించుచున్నది. అహంగ్రహోపాసన శ్రుతులయందు స్వతంత్రములైన అహంగ్రహోపాసనలు అనగా నేనుఉపాసింపబడెడి పురుషుడను అని వర్ణాశ్రమధర్మముల యందు వర్తింపుచు సాక్షాత్కారపర్యంతము (యావజ్జీవము) ఉపాసన చేయువారలు దేవయానము, అర్చిరాదిమార్గమని చెప్పబడు ఉత్తరాయణ మార్గమున బ్రహ్మలోకమును పొందెదరు. వేదమందు అహంగ్రహోపాసనలు 32 యుండుటచే వానియందు ఒక ఉపాసనమాత్రము చేసినచాలునని నానా శబ్దాది

భేదాత్ (బ్రసూ 3-5-58) ఇత్యాది సూత్రములందు నిర్ణయింపబడినది. తైత్తిరీయోపనిషత్ యందు పఠింపబడిన మహాచమస విద్యయు దాని ఫలమైన బ్రహ్మలోక మార్గమును యించుక విమర్శింపబడును. "భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః। తాసాముహ స్మైతాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి। తద్బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః। భూరితి వా అయంలోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువరిత్యసౌలోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేనవావ సర్వే లోకా మహీయంతే। భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జ్యోతీంషి మహీయంతే। భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయంతే। భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువరితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయంతే। తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽస్మై దేవా బలిమావహంతి మహాచమస మహర్షిచే అనుష్ఠింపబడినదగుటచే ఈవిద్య మహాచమస విద్యయనబడును. పై మంత్రములచే అంగోపాసన విధింపబడుచున్నది. భూః యను వ్యాహృతియందు పృథివి అగ్ని, ఋగ్వేదము, ప్రాణదృష్టిచేతను, 'భువః' యను వ్యాహృతియందు అంతరిక్షము, వాయువు, సామవేదం అపానవాయువు దృష్టిచేతను, 'సువః' యను వ్యాహృతియందు స్వర్గము, ఆదిత్యుడు, యజుర్వేదము, వ్యానవాయుదృష్టి చేతను, 'మహః' యను వ్యాహృతియందు అంగదేవతలకాత్మస్థునగు ఆదిత్యుడు, చంద్రుడు, ప్రణవము అన్నముల దృష్టిచేతను షోడశ కళలు గలిగిన పరమేశ్వరోపాస విధింపబడుచున్నది. ఉపాస్యుడైన పురుషుడు "స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః తస్మిన్నయం పురుషో మనోమయః అమృతో హిరణ్మయః" యని ప్రధానోపాసన వినబడినది. ఉపాస్యుడైన పరమేశ్వరుడు హృదయ పుండరీకమునందుండుననియు, నతడు మనోమయుడు స్వయంప్రకాశచిన్మాత్రుడనియు వర్ణింపబడుచున్నది. ఉపాసకుడు మరణించినపుడు లింగశరీరయుక్తుడై సుషుమ్న నాడిద్వారా ఉత్క్రమణ బొందును అతడు సూర్యరశ్మిని ప్రవేశించి దానిననుసరించి ఉత్తరాయణ మార్గమున అగ్నిలోకము వాయులోకము వరుణ ఇంద్ర ప్రజాపతిలోకములు దాటి ఆదిత్యలోకము దాటి బ్రహ్మలోకమునకుబోవునపుడు అప్సరసలు గ్రోపను జూపుదురు. బ్రహ్మలోకమందు తన కోరికననుసరించి స్థూలశరీము స్వీకరించిగాని లేక స్వీకరింపకయు బ్రహ్మలోక సుఖ మనుభవించి బ్రహ్మవిచారముచే నిర్గుణ బ్రహ్మాత్మ సాక్షాత్కారము బొంది బ్రహ్మపదము బొందుదురు.

యజ్ఞాది కర్మలు ఇష్టాపూర్తము లాచరిం

చువారు దక్షిణాయన (పితృయానము) మార్గమున స్వర్గలోకపితృలోకములకు బోయెదరు యజ్ఞకర్త యజ్ఞమునందు అగ్నిహోత్రమునందు ప్రక్షేపించిన చరుపురోడాశాదికములు దర్భలు శ్రద్ధతో నీయబడుజలాధికములు సూక్ష్మరూపములుగా నుండి యజ్ఞకర్త మరణానంతరము నతని శరీరోత్పత్తిజేయును యజ్ఞకర్త స్వర్గమునందు బహుకాలము సుఖమనుభవించి పుణ్యము క్షీణింపగనే ద్యులోకాదుల ద్వారా క్రిందికి బడి పాపపుణ్యముల ననుసరించి ఉచ్ఛనీచ జన్మములపొందును.

నిషిద్ధ కర్మలాచరించి పాపములనార్జించువారు పరమేశ్వర నిర్మితములయిన సప్తనరకములందు బహుదుఃఖముల ననుభవించి తరువాత వారి కర్మలననుసరించి తిర్యగాది యోనులందు జన్మించెదరు.

శ్రు॥ ఋతం తపః సత్యం తపః శ్రుతం తపః శాంతం తపః దమస్తపః శమస్తపోదానం తపోయజ్ఞం తపోభూర్భువః సువర్బ్రహ్మైతదుపాస్వైతత్తపః. మనసుచే యదార్థవస్తు చింతనము తపము. యదార్థభాషణము ప్రియహిత వచనములు తపము పూర్వోత్తర మీమాంసార్థశ్రవణము తపము ఇంద్రియోపరతితపము ఉపవాసాదులచే శరీరకర్షణము తపము సాత్త్వికదానము క్షేత్రాదులయందు చేయు దానము తపము. అగ్నిహోత్రాది శ్రౌతస్మార్తకర్మానుష్ఠానము తపము. భూరాదిలోకత్రయాత్మకుడగు విరాడ్ దేవరూపోపాసన తపము.

పుణ్యక్షేత్రములందు ఉత్తమ నదీప్రాంతములయందు జేయబడు తపము క్షేత్రమహిమగుణాధిక్యము బొందును.

శ్లో॥ తపోవిద్యా చ విప్రస్య నిశ్శ్రేయసకరం పరమ్
తపసాకిల్బిషం హంతివిద్యయాఽమృతమశ్నుతే॥ మనుస్మృతి॥

ఆశ్రమ విహితమైనకర్మ ఆత్మజ్ఞానము మోక్షసాధనము విహితకర్మ శ్రద్ధతో చేయుటయె తపము. తపముచే దురితములు నశించును. ఆత్మజ్ఞానముచే పరమపురుషార్థమైనమోక్షం సిద్ధించును.

" తత్త్వమసి తత్త్వమ్ "

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(ఆశ్వయుజమాసం సంచిక తరువాయి)

శ్లో॥ శమదమోపరమాదిసాధనైర్ధీరా
స్వాత్మనాత్మనియదన్విష్య కృతకృత్యాః
అధిగతామిత సచ్చిదానందరూపా
నపునరిహ ఖిద్యంతే తత్త్వమసితత్త్వమ్।
శ్రీ శంకరవిజయము- సర్గ 10

అంతరింద్రియనిగ్రహము, బహిరింద్రియ నిగ్రహము, మొదలగు అంతర్ముఖసాధనములచే తపోసంపన్నులైన ధీరులు బుద్ధియందు ఆత్మను సచ్చిదానందరూపమైన బ్రహ్మగా నిశ్చయ సాక్షాత్కారము బొంది మరల జననమరణాది సంసారదుఃఖము బొందరో నదియే తత్త్వమస్యాది మహావాక్యార్థ తత్త్వము.

శ్రుతి స్మృతి పురాణేతిహాస సర్వశాస్త్రములచే బ్రహ్మసచ్చిదానందరూపము, జగన్మిథ్యాత్వము, జీవబ్రహ్మైక్యమును బోధించెడి తత్త్వమస్యాది ఉపనిషద్వాక్య జ్ఞానముచే కర్మబంధము తొలగి జనన మరణము నుండి మోక్షముకలుగునని ప్రతిపాదింపబడుచున్నది. తార్కికులు (ద్వైతవాదులు) అధ్వరమీమాంసకులు కర్మజ్ఞానసముచ్చయవాదులు ఉపనిషన్మతమును ఆక్షేపించుచు అవిద్యాతద్విలయము నిరూపణానర్హమనియు, కేవల కర్మోపాసనలచే మోక్షము కలుగుననియు, కొందరు కర్మజ్ఞాన సముచ్చయముచే మోక్షము కలుగుననియు, శ్రుతులయందు ప్రత్యేకజ్ఞాననిష్ఠ నెక్కడను ప్రతిపాదింపబడలేదనియు, సర్వకర్మసన్యాసపూర్వకమైన తురీయాశ్రమము శ్రుతిసమ్మతముగాదనియు వాదించుచు భగవద్గీతా ఉపనిషత్తులకు (పూర్వవృత్తికారులు) కర్మజ్ఞానసముచ్చయపరముగా వ్యాఖ్యానముచేసిరి. శ్రీమచ్ఛంకర భగవత్పాదులవారు ద్వైతకర్మవాదములన్ నిరసించి పరమాద్వైత ఉపనిషన్మతమున స్థాపించిరి. కర్మ, ఉపాసన, ఆత్మజ్ఞాన వ్యవస్థను, తురీయాశ్రమ వ్యవస్థను, బ్రహ్మనిష్ఠను విశదముచేయుటకు వారిసంవాదగ్రంథ మించుక నుదహరింపబడుచున్నది.

ద్వైతవాదుల పూర్వపక్షము:-

ప్రతిమనుజుడును కర్తృత్వభోక్తృత్వాకార నిశ్చయముచే నాత్మ ననుభవించుటచే ఆత్మ సందిగ్ధవిషయము కానందునను, తమఃప్రకాశములవలె అత్యంత విలక్షణములై చేతన జడములును ప్రత్యక్, పరాగ్భూతములును, దృగ్దృశ్యములు నయిన ఆత్మానాత్మలయందు పరస్పరాధ్యాస నిరూపణానర్హమయినందునను, ప్రసిద్ధ శుక్తికయందు ప్రసిద్ధమైన రజతము అధ్యసింపబడునటుల ఆత్మ ప్రసిద్ధము

ప్రసంగుదువను, ఆత్మానాత్మలయందు ఇతరేతరాధ్యాస అంగీకరించినయెడల ప్రత్యక్ష ప్రమాణ విరోధము, శూన్యవాదప్రవేశము గలుగును గనుక అవిద్యా నిరూపణానర్హమైనందున ఆత్మవిచారణచే అవిద్య నివర్తించుట మోక్షము సిద్ధించుట అసంభవము. కర్మ, దేవతోపాసనలచే మోక్షము సిద్ధించును.

బ్రహ్మవాదుల సిద్ధాంతము

తమఃప్రకాశములవలె విరుద్ధస్వభావము గలిగిన అస్మత్ ప్రత్యయ గోచరమైన చిదాత్మయందు 'యుష్మత్' ప్రత్యయగోచరమైన (దేహాదులు) విషయములును చిదాత్మయందు వాని ధర్మములును ఆరోపింపబడును. ప్రత్యగ్భూతమైన చిదాత్మను పరాగ్భూతమైన దేహాది విషయములను వివిక్తముగా తెలిసికొనక మిథ్యాజ్ఞానముచే నిర్వికారమైన చిదాత్మను అసత్యములై జడములైన దేహాదులను జోడించి 'ఇది నేను' 'అది నాది' యనెడి నైసర్గిక లోకవ్యవహారము ప్రసిద్ధము. అధ్యాస యనగా 'స్మృతిరూప పరత్ర పూర్వదృష్టావభాసః' యనగా పూర్వసంస్కార (వాసన) జనితమైన స్మృతిరూపమైన పూర్వదర్శిత వస్తువును అన్యవస్తువునందు ఆరోపించుట ఆరోపింపబడిన వస్తువు సద్రూపముగాగాని అసద్రూపముగాగాని నిరూపణానర్హమైనందున నిది వేదాంతుల అనిర్వచనీయఖ్యాతి మతము. శుక్తికమందు రజత మారోపింపబడినపుడు దేశాంతరీయ రజతము తత్కాలమందు స్మృతిగలిగి దేశాంతరీయ రజతావయవములు ఆరోపింపబడునను అన్యథాఖ్యాతి మతమందును, లోకసిద్ధమైన రజతమునకు శుక్తిక రజతమునకు భేదము గ్రహింపక పోవుటయన అఖ్యాతివాదుల మతమందును బాహ్యశుక్తికమందు బుద్ధిస్థరజత మారోపింపబడునను ఆత్మఖ్యాతివాదుల మతమందును అధ్యాస లక్షణము అన్యవస్తుధర్మము అన్యవస్తువందు ఆరోపించుట యనునది సమానము. దృష్టిదోషముచే శుక్తికమందు రజతము ఒక చంద్రునియందు యిద్దరు చంద్రులు స్ఫటికమందుదాని సన్నిధియందున్న జపాకుసుమ ఎర్రదనము ఆరోపించుట ప్రసిద్ధము. శుక్తికము మొదలైన వస్తువులు ఇంద్రియగోచరములై నెదుటనుండిన వానియందు రజతాదులు ఆరోపింపబడుటచే శుక్తికాదులవలె ఇంద్రియ గోచరములైన పదార్థములయందె అధ్యాసయుండునని నియమము లేదు. చక్షురింద్రియమునకు గోచరము గాని గగనమందు బాలురచే తలమలినాదులు ఆరోపింపబడుచున్నవి. అటులనే ఇంద్రియ గోచరము గాకపోయినను అస్మత్ ప్రత్యయ విషయమై నిత్యాపరోక్షమై సర్వవ్యవహార హేతువై నిత్య ప్రసిద్ధమైన ప్రత్యగాత్మయందు అహంకారాది అనాత్మాధ్యాస ఉపపన్నము. ఈ అధ్యాసనే పండితులు అవిద్య యందురు. శుక్తికమందారోపింపబడిన రజతము దేశాంతరమందు సత్యమైనందున దేహాదులకు సత్యత్వ మంగీకరించుట అద్వైత

విరోధమనిన నటులగాదు. అధ్యాస యనగా అన్యవస్తువునందు దానిబుద్ధియని చెప్పబడి నదిగదా? అధ్యాసకొరకు అధ్యసింపబడు వస్తుసత్యత్వముతో బనిలేదు. పూర్వ దృష్టత్వముమాత్రమే అధ్యాస కుపయోగమైనందున పూర్వభ్రమజనిత సంస్కారజనిత స్మృతిచే అంధపరంపరగా అనాద్య నిర్వచనీయా విద్యచే అహంకారాధ్యాస ఉపపన్నము. సర్వజగము ఆత్మయం దధ్యస్తమగుటచే దేశాంతరము లేనందున ఆత్మ అద్వితీయమే యగును శుక్తిక రజితాపవాదముచే రజితాసత్యము సిద్ధించినట్లు ఆత్మానాత్మల పరస్పరాప వాదముచే శూన్యవాద ప్రసక్తిగలుగుటనను అసంగతము. ఆకాశము వాయ్వాదిభూతముల కసంహతమగునటుల ఆత్మదేహాదుల కసంహతము సంహతమనగా గృహావయములైన స్తంభాదికములు నొక దానితో నొకటి సంబంధము గలిగియుండి నొకదాని నాశనముచే మరియొకటి నశించుట) ఆత్మయందు దేహాదులు కల్పితములగుటచేతను ఆత్మ నిరవయుడు, నిత్యుడు నిర్గుణుడగుటచే ఆత్మకు దేహాదులతో నేమియు సంబంధములేదు. కనుక పరస్పరాధ్యాసచే శూన్యవాద ప్రదేశ ప్రసక్తి లేదు. ఆత్మ నిరవయుడైనందున దేహాదులు ఆత్మయందు కుండలో బదరికఫలమువలె గాని, గోడమీద చిత్రమువలెగాని తిలలలో తైలమువలె గాని నుండుట యసంభవము. దేహము, ప్రాణములు ఇంద్రియములు, అంతఃకరణము సకల ప్రపంచము నిష్క్రియ శుద్ధ ఆనందస్వరూపుడైన ఆత్మయందు ఆరోపింపబడుటచే వాచిక కాయిక మానసిక కర్మలన్నియు ఆత్మయందు అనాత్మాధ్యాస మూలకములగుటచే లౌకికకర్మలవలె వైదిక కర్మలన్నియును ప్రత్యక్షాది ప్రమాణములును, అంతఃకరణ ధర్మములైన సుఖదుఃఖ కామఇచ్ఛా క్రోధాదులును ఆత్మయందు ఆరోపితములై జననమరణరూప సంసార హేతువులైనందున శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన సద్గురువులనాశ్రయించి వేదాంతశాస్త్ర శ్రవణ మనన నిదిధ్యాసరూపమైన బ్రహ్మనిష్టను అవగతి పర్యంతము (బ్రహ్మసాక్షాత్కారము పర్యంతము) చేయుటచే సకల అవిద్యాకర్మబీజములు నశించి ముక్తి సిద్ధించును.

(సశేషము)

సమానా హృదయానివః	–	మీమనస్సులు పరస్పరభేదము లేనివగునుగాక.
అహమిన్ద్రోఽపరాజిగ్యే	–	నేనే ఆత్మను, నన్నెవడును పరాజితుని జేయ లేదు.
		ఋగ్వేదము

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచికతరువాయి)

అధ్వర మీమాంసకుల పూర్వపక్షము :-

విధ్యుక్త నిత్యనైమిత్తిక కర్మలనాచరించుటచే ప్రత్యవాయము జనించనందునను, నిషిద్ధకర్మలవర్జించుటచే నరకాద్యధోగతి లేనందునను కామ్యకర్మలవర్జించుటచే ఉత్తరజన్మ లేనందునను ప్రారబ్ధకర్మానుభవముచే క్షయమగుటచేతను మోక్షము కేవల కర్మలచే సిద్ధించును.

ఉత్తరపక్షము (బ్రహ్మవాదులసమాధానము)

ఎంత సూక్ష్మదృష్టిగల పండితుడైనను కామ్యనిషిద్ధ కర్మలను నిశ్శేషముగా వర్జింపనశక్యము. కామ్యకర్మలను వర్జింపవలయునని శ్రుతులయందెక్కడను విధింపబడదు. ప్రమాదముచేతనైనను జేయబడిన కామ్యనిషిద్ధ కర్మలు పునర్జన్మ కలుగజేయును. నిత్యనైమిత్తిక కర్మలు దురితక్షయము జేసినను అనేక జన్మలయందు ఆచరింపబడిన కర్మలు నిశ్శేషముగా నశించునని ప్రమాణము కన్పించదు. సంచితపాపకర్మలు నశించినను పుణ్యకర్మలు నశించనందున జన్మహేతువగును. ఇంకను శ్రు॥ తద్యథేహ కర్మజితో లోకః క్షీయత ఏవ "ఇత్యాదిశ్రుతులయందు" యత్కృతం తదనిత్యం' యను వ్యాప్తిచేతను సత్యకర్మఫలము స్వర్గాది విశ్వజనన్యాయముచే నిర్ణయింపబడుటచేతను, మోక్షము నిత్యమగుటచేతను, మోక్షము కలుగజేయనేరవు. అన్ని కర్మలు మోక్షముకొరకు విధింపబడినయెడల బృహస్పతి సవనము బ్రాహ్మణుడు చేయవలయుననియు, రాజసూయము క్షత్రియుడాచరింపవలయుననియు కర్మాధికార వ్యవస్థయుండదు. కర్మలన్నియు అవిద్యాహేతువులైనందున అజ్ఞానమును నివర్తింపనేరవు.

జ్ఞానకర్మ సముచ్చయవాదుల పూర్వపక్షము

కేవలకర్మలు మోక్షసాధనములు కాకపోయినను జ్ఞానకర్మ సముచ్చయముచే ముక్తి కలుగును, శ్రు॥ కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః (ఈశా-1) 'యావజ్జీవమగ్నిహోత్రంజుహుయాత్' 'యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరం భవతి' 'విద్యాంచావిద్యాంచయస్తద్వేదోభయగ్ం సహ, అవిద్యయామృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే' 'కర్మణైవహిసంసిద్ధిమాస్థితా జనకాదయః' ఇత్యాది శ్రుతిస్మృతులచే జ్ఞాన కర్మ సముచ్చయము విధింపబడుచున్నది. విహితకర్మ త్యాగముచే ప్రత్యవాయము వినబడుచున్నందునను పరివ్రాజకుడు భిక్షాస్నానశౌచాదులయందు ప్రవర్తించునట్టుల జ్ఞానియు కర్మలయందు ప్రవర్తించుటకు విరుద్ధము లేనందునను జ్ఞానకర్మసముచ్చయముచే మోక్షము సిద్ధించును. శ్రుతు

లచే సర్వకర్మసన్న్యాసము విధింపబడినది. కర్మాచరణాశక్తులైన అంధులు మొదలయినవారి విషయము కావచ్చును.

బ్రహ్మవాదుల సిద్ధాంతము :...

జ్ఞానకర్మ సముచ్చయము అసంభవము. వాఙ్మనఃకాయికములైన కర్మలన్నియు కామప్రయుక్తములు. కామము హేయోపాదేయరహితమైన బ్రహ్మయందు అవిద్యాజనితము. జ్ఞానము వస్తుతంత్రము (వస్తుయాథాత్మ్యస్థితిననుసరించినది) గాన అవిద్యానాశకము. కర్మ పురుషతంత్రము. (పురుష బుద్ధిననుసరించి చేయుటగాని, చేయకపోవుటగాని, విపరీతముగా గాని చేయునవి.) కర్మలన్నియు 'నేను కర్మలను చేయవలసినవాడను. కర్మఫలమును అనుభవించువాడను. (కర్తను, భోక్తను) యని నిష్క్రియ శుద్ధ స్వరూపుడైన ఆత్మయందు కర్తృత్వము, భోక్తృత్వము లారోపింపబడి చేయబడును. ఆత్మవిషయమైన యాథాత్మ్య జ్ఞానము నేను నిష్క్రియ శుద్ధబుద్ధముక్త స్వరూపుడనైన బ్రహ్మనని నిశ్చయము. ఒక స్థాణువుయందు తిమిరప్రకాశములవలె విరుద్ధములైన చోరబుద్ధియు స్థాణుబుద్ధియు నుండనేరనటుల ఆత్మయాథాత్మ్య జ్ఞానమును కర్తృత్వ భోక్తృత్వబుద్ధియు నొకపురుషునియందుండనేరవు. కర్మజనిత ఫలము అనిత్యము. జ్ఞానఫలము నిత్యమైన మోక్షము గనుక జ్ఞానకర్మసముచ్చయముగాని అంగాంగిభావముగాని అసంభవము. ఆత్మజ్ఞానము కర్మాంగముగా నెక్కడను విధింపబడలేదు. ఆత్మజ్ఞానము ప్రయాజాదులు యజ్ఞాంగము విధింపబడినటుల కర్మాంగముగా కర్మప్రకరణమందు విధింపబడలేదు. కర్మ ప్రకరణ సన్నిధియందు పఠింపబడనందున ప్రకరణస్థానములు లేవు. కర్మ జ్ఞానములకు సమాన సంజ్ఞ లేనందున సమాఖ్య లేదు. గనుక జ్ఞానకర్మలకు సముచ్చయముగాని అంగాంగిభావముగాని అనుపపన్నము. (పూర్వ మీమాంసాశాస్త్రమందు చాతుర్మాస్య ప్రయాజాది యజ్ఞకర్మయందు ప్రధానకర్మ. అంగ కర్మలను విచారించుటకు శ్రుతి, లింగ, వాక్య ప్రకరణ' స్థాన, సమాఖ్యలను ఆరు విచారింపబడును.) "కుర్వన్నేవేహ కర్మాణి" "యావజ్జీవ మగ్నిహోత్రం జుహుయాత్" ఇత్యాదికర్మవాక్యములు అజ్ఞానివిషయములు.

(సశేషము)

" తత్త్వమసి తత్త్వమ్ "

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

'శ్రు॥ య దేవవిద్యయా కరోతి' యను విషయము ఉద్గీథోపాసనావిషయము. లేక దేవతోపాసనతో గూడిన విధ్యుక్తకర్మ శ్రద్ధతో నాచరించిన తపోఫలము నిచ్చునని యర్థము. 'శ్రు॥ విద్యాంచావిద్యాంచయస్తద్వేదోభయగ్ంసహ' యనెడి మంత్రము నందు అవిద్య యనెడి పదమునకు కర్మయనియు, విద్య యనెడి పదమునకు దేవతోపాసన యనియు విధ్యుక్తకర్మ దేవతాభక్తి ఉభయానుష్ఠానఫలము విధింపబడినది. 'శ్రు॥ దూరమేతే విపరీతే విషూచీ నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః' ఇత్యాది శ్రుతులచే క్రియాకారకఫలములు (ఐహిక, స్వర్గాది అనిత్యసుఖములు) నిందింపబడును 'శ్రు॥ ఆనందం బ్రహ్మణోవిద్వాన్' 'శోకంతరతి ఆత్మవిత్' ఇత్యాది శ్రుతులచే సర్వకర్మ సన్యాసపూర్వకమైన బ్రహ్మనిష్ఠ ప్రతిపాదింపబడుచున్నది. అవిద్వాంసునకు ఈశ్వరార్పణబుద్ధిచే చేయబడు ఆశ్రమధర్మానుష్ఠానముచేనిత్యానిత్యవస్తువివేకాదిసాధన చతుష్టయసంపత్తి పొంది విద్యోత్పత్తికొరకు వివిదిషాసన్యాసమును, విధ్యుక్తానుష్ఠానముచే దేవతోపాసనచే అంతఃకరణ పరిశుద్ధిపొంది ఆత్మవిచారణచేసిన విద్వాంసునకు నిరాటంక బ్రహ్మనిష్ఠకొరకు విద్వత్సన్యాసము విధింపబడినది. జనకాదికర్మయోగులు గృహస్థాశ్రమునందుండియు జ్ఞాననిష్ఠనుపొందుట జ్ఞానకర్మసముచ్చయమునకు లింగముగాదు బ్రాహ్మణులకే సర్వకర్మసన్యాసమున కధికారమున్నందున జనకాది రాజర్షులు గృహస్థాశ్రమునందేయుండిరి. బ్రాహ్మణులైనను కొందరు పుత్రాదిప్రతిబంధముచే సన్యసించక పరివ్రాజకుని సమబుద్ధి కర్తృత్వభోక్తృత్వ రహితమైన అసంగచిద్రూప ఆత్మభావము నవలంబించుటచే జ్ఞానకర్మ సముచ్చయము లేదు 'శ్రు॥ బ్రహ్మచర్యాద్వాగృహాద్వావనాద్వా' ఇత్యాది శ్రుతులు వేదాధ్యయనాది ఆశ్రమవిధులను నివర్తించి సాధనచతుష్టయసంపత్తి పొందిన పురుషుడు నేయాశ్రమమునుండియైనను సన్యసింపవచ్చునని బోధించుచున్నవిగని కర్మానధికారులకు సన్యాసమును విధించుటలేదు. బ్రహ్మచర్యాశ్రమమునుండియె సర్వకర్మసన్యాసముజేసి శ్రవణ మనన నిధిధ్యాసాదులద్వారా బ్రహ్మనిష్ఠను బొందుట సాంఖ్యయోగమనియు, గృహస్థాశ్రమము స్వీకరించి వేదాధ్యయన యజ్ఞాది కర్మలు ఈశ్వరార్పణబుద్ధిచే అనుష్ఠించి అంతఃకరణ పరిశుద్ధినిబొంది బ్రహ్మనిష్ఠను బొందుట కర్మయోగమనియు, ఈ రెంటిను భిన్నపురుషులచే ననుష్ఠేయములగుటచే జ్ఞానకర్మ సముచ్చయము లేదని శ్రీకృష్ణభగవానునిచే 'శ్లో॥ లోకేస్మిన్ద్వివిధానిష్ఠా' ఇత్యాది శ్లోకములచే వచింపబడినది.

స్వధర్మానుష్ఠాన శాస్త్రోక్తకర్మానుష్ఠాన

అవశ్యకతను ఫలమును శ్రీకృష్ణభగవానుడు 'శ్లో॥ న కర్మణా మనారంభాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే। న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి॥' యజ్ఞాది శాస్త్రోక్తకర్మలు పూర్వజన్మముయందుగాని యీజన్మయందుగాని అనుష్ఠానముచే దురితక్షయము బొంది అంతఃకరణ పారిశుద్ధ్యము పొందుటద్వారానే జ్ఞానయోగము నిష్క్రియాత్మస్వరూపావస్థానము బొందబడుననియు శాస్త్రోక్తకర్మానుష్ఠానము ప్రారంభించకుండ ఆత్మజ్ఞానము బొందబడదనియు, శ్లో॥ ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే॥ జ్ఞానయోగారూఢత కోరువానికి (కర్మఫల సన్న్యాసికి) కర్మాచరణమే సాధనము, 'స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః' 'సహజం కర్మ కౌంతేయ స దోషమపి న త్యజేత్' 'యజ్ఞ దాన తపః కర్మ పావనాని మనీషిణామ్' మనుజుడు న వర్ణాశ్రమ విహితకర్మ దోషవంతమైనను గుణాత్మకమైనందున త్యజింపకూడదని ము, స్వకర్మానుష్ఠానముచే మనఃకాయేం య దోషములు నశించి జ్ఞాననిష్ఠాయో త బొందుననియు, యజ్ఞము, దానము, తపము, విధ్యుక్తకర్మానుష్ఠానము మనుజుని పవిత్రము చేయుననియు వక్కాణించెను.

శ్రీమచ్ఛంకరభగవత్పాదులవారు 'కార్యం సర్వమేతద్యథోక్తం కర్మ చ జ్ఞానం చ సమ్యగనుష్ఠితం నిష్కామస్య ముముక్షోః సత్త్వశుద్ధ్యర్థం భవతి। సకామస్య తు జ్ఞానరహితస్య కేవలాని శ్రౌతాని స్మార్తాని చ కర్మాణి దక్షిణమార్గప్రతిపత్తయే పునరావృత్తయే చ భవంతి। (కేనోపనిషద్భాష్యం) విధ్యుక్తమైన శ్రౌత స్మార్తకర్మలు దేవతోపాసన శ్రద్ధా ఈశ్వరార్పణబుద్ధిచే అనుష్ఠానము అంతఃకరణ పరిశుద్ధిబొందజేసి జ్ఞానోత్పత్తిచేయును. కామ్యకర్మ పునరావృత్తి సంసారహేతువగును. 'ఫలనిరపేక్షజ్ఞానకర్మసముచ్చయానుష్ఠానాత్ కృతాత్మసంస్కారస్య ఉచ్ఛిన్నాత్మజ్ఞానప్రతిబంధకస్య ద్వైతవిషయ దోషదర్శనో నిర్జ్ఞాతాశేష బాహ్యవిషయత్వాత్ సంసారబీజమజ్ఞానముచ్చిఛిత్సతః' ఫలనిరపేక్షకమైన కర్మ దేవతోపాసన సముచ్చయానుష్ఠానముచే సంస్కారముబొంది ఆత్మజ్ఞానోత్పత్తి ప్రతిబంధము వీడినవాడు ద్వైతదోషదర్శనముచే బాహ్యవిషయాసక్తివీడి ప్రత్యగాత్మతత్త్వమును అన్వేషించును'.

(సశేషము)

"తత్త్వమసితత్త్వమ్"

బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ

(గతసంచిక తరువాయి)

ఇత్యాదనేక భాష్యవచనములచే బోధించిరి. ఉపనయనమునకు పూర్వము సన్యాసాశ్రమము నిషేధింపబడుటచే బ్రహ్మచర్యాశ్రమమునుండి సన్యాసాశ్రమము స్వీకరించినను ఉపనయనము ప్రభృతి వేదాధ్యయనము సంధ్యోపాసన, గాయత్రీ జపము అగ్నికార్యము, గురుకులవాసము బ్రహ్మచర్యాశ్రమమందు అనుష్ఠింప వలయును. సన్యాసాశ్రమమందును "స్నానం శౌచం తథా భిక్షా నిత్య మేకాంత సేవనమ్। సర్వేషు వేదేషు అరణ్య మావర్తయేత్। స్వశాఖోపనిషద్గీతాం విష్ణోర్నామ సహస్రకం, శ్రీరుద్రం ప్రణవం చైవ నిత్యమావర్తయేద్యతిః యశ్శతరుద్రీయ మధీతే సోఽగ్ని పూతో భవతి। ఇత్యాది ప్రమాణములచే విధింప బడినది తదనుష్ఠానముచేత ప్రత్యవాయము గలిగి జ్ఞాన ప్రతిబంధము గలుగును. సన్యాసాశ్రమమందు యజ్ఞాది పూర్వ ఆశ్రమ కర్మ మాత్రమే నిషేధింపబడినది. యత్యాశ్రమ విహిత కర్మానుష్ఠానము ప్రతిబంధము తొలగి ఆత్మ విచారణచే జ్ఞానోత్పత్తి గలుగును.

శారీరక మీమాంసా వార్తిక మందు శ్రీ శృంగేరీ పీఠాధీశులగు శ్రీ అభినవ ద్రవిడాచార్య శ్రీ బాలకృష్ణానంద సరస్వతీ స్వాములవారు "అథయది తురీయాశ్రమేఽపి కర్మసత్వాత్ తత్ప్రకరణ కర్మ త్యాగే నతుకీయాశ్రమ వర్ణనం కథం యోజనీయ మిత్యాశంక్యతదోజన ప్రకారం దర్శయతి కర్మాపి బహులం బ్రహ్మ చర్యే వేదాధ్యయన తదభ్యాస గురు శుశ్రూషాది కర్మ బాహుళ్యం గార్హస్థే జ్యోతిష్టోమ దర్శ పూర్ణమాస చాతుర్మాస్య వైశ్వదేవ బలిహరణాది కర్మ లావణ్యం వనేఽహో రాత్రిషు తపస్యాది బాహుళ్యం ఏవం విధం త్రివిధ మాశ్రమం బ్రహ్మచారీ భవేత్ గృహీ భవేత్ వనీ భవేత్ ఇతి శ్రుతి సముపాత్తమే తాదృశ మాశ్రమత్రయం విధి పూర్వకం పరిహృత్య తుకీయాశ్రమమ్ కర్మ బాహుళ్యాత్ తం స్మృతి నివృత్త్యై శుద్ధాంతః కరణో బ్రాహ్మణః గృహ్ణాతి. తథాచ ఆశ్రమత్రయ విహిత కర్మ త్యాగ ఏవ విధి పూర్వకమామ్నాతః శ్రుతిషు స్మృతిషు నతు యత్యుచితకర్మత్యాగోఽపి తథా చ స్వాశ్రమోచిత ధర్మ అనాశ్రయణే ప్రత్యవాయాత్ సాక్షాత్కార ప్రతిబంధో భవేదేవ"యని వచించిరి.

నిత్యనైమిత్తిక శాస్త్రోక్త కర్మలు బ్రహ్మవిద్యకు బహిర్ముఖ సాధనములు. అంతర్ముఖ సాధనము సాధన చతుష్టయ సంపత్తి. బహిర్ముఖ సాధనములైన కర్మలచే అంతఃకరణ సంస్కారము బొందినను అంతర్ముఖము బొందనిది ఆత్మదర్శనము దుర్లభమగుటచే బ్రహ్మవిద్యకు సాధన చతుష్టయ సంపత్తి

ముఖ్యావసరము. అందులకే శ్రీ వ్యాస భగవానుని ప్రాథమికసూత్రమందు (అథాఽతో బ్రహ్మజిజ్ఞాసా) 'అథ' శబ్దమునకు నిత్య నైమిత్తిక వేదోక్త కర్మానుష్ఠానము తరువాత యని యర్థము స్వీకరింపబడక అంతర్ముఖ సాధనములైన సాధన చతుష్టయ సంపత్తి తరువాత బ్రహ్మవిచారణ ప్రవర్తించుననియు చేయవలయుననియు అర్థమును భాష్యకారులు నిర్వచించిరి.

సాధన చతుష్టయము నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రఫలవిరాగము, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము. నిత్యానిత్య వస్తువివేకమనగా బ్రహ్మసత్యమనియు, ప్రపంచము మిథ్యాభూతమనియు నిశ్చయము. దేహాది బ్రహ్మలోకపర్యంతము భోగములన్నియు తుచ్ఛములనియు, జననమరణ సంసార హేతువులనియు దేహాది బ్రహ్మపర్యంతము భోగములందు విరాగము ఇహాముత్రఫలవిరాగము. చాతుర్మాస్యాదియజ్ఞకర్మలచే పొందబడు స్వర్గఫలము 'శ్రు॥ అక్షయం హవై చాతుర్మాస్యయాజినః సుకృతం భవతి ఇత్యాది శ్రుతులయందు అక్షయ సుఖము వినబడినను యజ్ఞకర్మజనితసుఖము నిత్యమని తాత్పర్యము లేదు. ఇతర వైదిక కర్మఫలముకంటె దీర్ఘకాలము సుఖమునిచ్చునని తాత్పర్యము. గనుక ముముక్షువు అనిత్యములైన స్వర్గాదిసుఖములనుండి విరాగము పొందవలయును. శమాదిషట్కసంపత్తియనగా శమము, దమము, ఉపరతి, తితీక్షా, శ్రద్ధా, సమాధానము. మనస్సును బాహ్య విషయములందు చలింపకుండ నిగ్రహించుట శమము. వాక్, పాణి, పాద, పాయూపస్థలను కర్మేంద్రియములను, త్వక్ చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములను జ్ఞానేంద్రియములనువిషయములనుండి నిగ్రహించి స్వగోళకములందు నియమించుట దమము. అంతఃకరణ వృత్తులను బాహ్యవిషయాలంబన రహితముగా జేయుట ఉపరతి. సర్వదుఃఖములను ఇతరులకు ఏమి అపకారము చేయక చింతారహితముగా సహించుట తితీక్ష. శాస్త్రముయందు గురువాక్యములయందు సత్యత్వ అవధారణ శ్రద్ధా. బుద్ధిని శుద్ధాత్మయందు స్థాపించుట సమాధానము. అవిద్యచే కల్పితములైన దేహాది అహంకారజడవర్గమును ఆత్మగాదని శాస్త్రయుక్తులచే నిరాకరించి స్వరూపజ్ఞానముచే ముక్తి పొందుటకు కోరిక ముముక్షుత్వ మనబడును. వైరాగ్య ముముక్షుత్వములు తీవ్రముగా నుండిన ముక్తి శీఘ్రముగా సిద్ధించును. మోక్షసాధనలయందు ఆత్మానుసంధాన రూపమైన భక్తి శ్రేష్ఠమైనది మోక్షఫలము నిచ్చును.

బ్రహ్మవిద్య గురూపదేశ పూర్వకముగా గురువనుగ్రహముచేపొందవలయునని శ్రుతిస్మృతులు ప్రతిపాదించుచున్నవి "శ్రు॥ తద్విజ్ఞానార్థం సగురు మేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ (ముం 1-2-12) బ్రహ్మవిజ్ఞానముబొందుటకు శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడైన గురుని గురించి సమి

ధలు మొదలగు ద్రవ్యములు పాలితోషికము లుగా తీసుకొని పోవలయుననియు "శ్రు॥ ఓం సుకేశాచ. భారద్వాజః శైబ్యశ్చ సత్యకామః సౌర్యాయణీచ గార్గ్యః కౌసల్యాశ్చాశ్వలా యనో భార్గవో వైదర్భిః కబంధీకాత్యాయ నస్తేహైత్ బ్రహ్మపరా బ్రహ్మనిష్ఠాః పరం బ్రహ్మాన్వేషమాణాఏషహ వై తత్సర్వంవక్ష్య తీతి తేహ సమిత్పాణయో భగవంతం పిప్ప లాదముపసన్నా (ప్రశ్న 1-1) సుకేశుడు మొదలగు ఆర్గురుఋషులు పిప్పలాద మహర్షి యొద్దకు వెళ్ళినట్లును వారిచే బ్రహ్మచర్యాది తపములు చేయించియు వారి విద్యాధికార మును పరీక్షించియు తత్త్వోపదేశము జేసినట్లు వినబడుచున్నది. "శ్రు: ఆచార్యవాన్ పురుషో వేద" (ఛాం 6-14-2) ఆచార్యుడు గలిగిన పురుషుడు బ్రహ్మవిజ్ఞానము బొందుననియు స్వయముగాయుక్తులచే తెలుసుకొనలేరనియు ఆగమప్రతిపాద్యమైన బ్రహ్మవిజ్ఞానము స్వబు ద్ధ్యూహా మాత్రమున బందబడదనియు, ఇంక ను శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవ యా। ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః (భగీ 4-34) సాష్టాంగదండప్రణామ ములచేతను శ్రద్ధాభక్తులతో వివేకప్రశ్నల చేతను శిష్యుని బ్రహ్మవిద్యాగ్రహణయోగ్య తను పరీక్షించి తత్త్వవిదులు జ్ఞానము నుపదే శింతురు. "శాస్త్రాచార్యోపదేశ శమదమాది సంస్కృతం మనః ఆత్మదర్శనే కరణం" (శంభా. గీతా 2.21) వేదాంతశాస్త్ర ఆచా ర్యోపదేశ శమదమములచే సంస్కరింపబడిన మనస్సు ఆత్మ దర్శనమునకు సాధనము. శ్లో॥ వ్యసన శతాన్వితాః సమవహాయ గురోశ్చ రణం వణిజ ఇవాజ సంత్యకృత కర్ణ జలధే (వేద స్తుతి 20) అనేక వ్యసనములుగూడి గురు చరణంబు లాశ్రయింపక కర్ణధరుడు లేని నావికుని చందమున చెడుదురని స్మృతి శ్రుతులు నిశ్చయించుచున్నవి. "శ్లో॥ ఆచి నోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి స్వయమాచరతె యస్మాత్ తస్మాదాచార్య ఈర్యతె॥ వేదశాస్త్రములను వ్యాఖ్యానము చేసి వేద ధర్మమును స్థాపించి స్వయముగా వేద ధర్మము నాచరించువతడు ఆచార్యు డనబడును. శ్లో॥ ఐశ్వరస్య వీర్యస్య సమ గ్రస్య యశసశ్శ్రియః। జ్ఞాన వైరాగ్యయో శ్చైవషణ్ణాం వర్గ భగోమతః శ్లో॥ ఉత్పత్తించ వినాశంచ భూతానామా గతిం గతిమ్ వేత్తి విద్యామ విద్యాంచ సవాచ్యో భగవానితి॥ సంపూర్ణ ఐశ్వ ర్యము, వీర్యము, కీర్తి, విభూతియు, సంపూర్ణ మైన వేదార్థ విజ్ఞానము (సమ్యక్ జ్ఞానము) వైరాగ్యము గలిగినవాడు భగవంతుడన బడును. భూతముల ఉత్పత్తి, వినాశము (సృష్టి. లయములు); భూతముల యొక్కయు (అవిద్య) ఆవరణ తిరోధానములు, ఆత్మ సాక్షాత్కారము గలిగిన భగవంతు డనబడును.

అచింత్యశక్తిచే జగమును సృష్టి స్థితి లయములు తిరోధాన అనుగ్రహములు గలి గిన పరమేశ్వరునియందును, హిరణ్యగర్భుని

యందును విశిష్ట దేవతలయందును విష్ణ్వాది దేవతల అవతారములయందును మహర్షుల యందును సర్వజ్ఞులయిన బ్రహ్మ విదుల యందును భగవచ్ఛబ్దము వర్తించును. సమ్యగ్దర్శనము గలిగిన బ్రహ్మవిదులను ఆచార్యులను ఆశ్రయించి వారిచే బ్రహ్మోపదేశము బొందుటచే శ్రవణ మనన నిదిధ్యాసలచే బ్రహ్మసాక్షాత్కారము గలుగును.

బ్రహ్మపరోక్ష జ్ఞానము నిశ్శేష అసంభావనా విపరీతభావనరహితమయి దృఢమగునంతవరకును శమదమాది సాధనములచే శ్రవణమనననిదిధ్యాసనలను చేయవలయును. ఆత్మసాక్షాత్కార సాధనములైన శ్రవణ మనన నిదిధ్యాసలు "శ్రు॥ ఆత్మావాఽరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః (బృ 2-4-5) ఇత్యాది శ్రుతులచే విధింపబడినది. శ్రవణమనగా ఉపనిషద్వాక్యపద శక్తి తాత్పర్యార్థానుసంధానరూపమైన మానసిక క్రియ. మననమనగా శ్రుతులచే ప్రతిపాదింపబడిన యర్థమును అసంభావనా విపరీతభావనా నిరసన పురస్సరముగా యుక్తులచే అనుసంధానము. నిదిధ్యాస యనగా విజాతీయ ప్రత్యయ నిరసనపూర్వకమైన సజాతీయ ప్రత్యయ ప్రత్యయప్రవాహము అనగా అహంబ్రహ్మాస్మీత్యాకారాంతఃకరణ వృత్తిప్రవాహము. శ్రవణమనన నిదిధ్యాసల యందు శ్రవణము అంగి (ప్రధానము). మనన నిదిధ్యాసలు (శేషములు) అంగములు. మనన నిదిధ్యాసనానుష్ఠానముచే శ్రవణ ఫలమైన ఆత్మసాక్షాత్కారము గలుగును. శబ్దము (శ్రుతుల) చే ప్రథమమున విచారప్రయోజకమైన అపరోక్షజ్ఞానము గలుగును. తరువాత అసంభావన విపరీత భావనము గలిగిన వానిని నిరసించుటకు విచారశాస్త్రము ప్రవర్తించును. పరపక్ష ఖండనముద్వారా వేదాంతవాక్య సమన్వయముచే ప్రమాణగత అసంభావననివర్తించును. తిరువాత విపరీత భావన నిదిధ్యాసనముచే నిరాకరింపబడును. తదనంతరము మహావాక్యార్థానుసంధాన రూపమైన అవిద్యను నాశనముచేయు అంతఃకరణ వృత్తి జనించును. ఇదియే ఆత్మసాక్షాత్కారము. అసంభావనా విపరీత భావనా రహిత అహం బ్రహ్మాస్మీత్యాకారాంతఃకరణ వృత్తిః యని నిర్వచింపబడినది శ్రవణ మనన నిదిధ్యాసనయందు నిదిధ్యాసనము బ్రహ్మసాక్షాత్కారమునకు సాక్షాత్ కారణము.

యమనియమాది అష్టాంగయోగము నిదిధ్యాసయందు చరితార్థంబగును. ప్రాణస్పందనముచే చిత్తము చలించును గనుక ప్రాణస్పందనము నిరోధించుటకు బాహ్యకుంభకం అంతః కుంభకము, కేవలకుంభకము మొదలయినవి అనుష్ఠేయములు. చిత్తచలనము నిరోధించుటకు ధారణ ధ్యాన సమాధులు నాదానుసంధానము, యోగశాస్త్రమందు ప్రసిద్ధమయిన కుండలినీ శక్తిని పద్మాసనాదులచే నిద్రనుండి లేపి ధారణ ధ్యాన భావనలచే మూలాధారాది షట్చక్రములో పరిస్థమయిన చంద్రమండలమనుసహస్రారమందు

సమయాకళను ధ్యానముచే ఐక్యానుసంధానము ఆత్మసాక్షాత్కారమునకు పరమసాధనము.

యోగవాసిష్ఠమందున సప్తయోగభూమికలు 'శ్లో॥ జ్ఞానభూమి శుభేచ్ఛాఖ్యా ప్రథమా సముదాహృతా। విచారణా ద్వితీయాతు తృతీయాతు తనుమానసా। సత్త్వాపత్తిశ్చతుర్థీ స్యాత్ తతో௨సంసక్తినామికా। పదార్థాభావనీ షష్ఠీ సప్తమీ తుర్యగాస్మృతా' యని వచింపబడినది. ఈశ్వరార్పణబుద్ధితో స్వధర్మానుష్ఠానము సాధనచతుష్టయ సంపత్తి శుభేచ్ఛ యను ప్రథమభూమిక, విచారణ యను ద్వితీయభూమిక సద్గురువుల నాశ్రయించి చేయబడు వేదాంతశ్రవణ మననములు. తనుమానసము నిధిధ్యాసనము. సత్త్వాపత్తియను చతుర్థభూమిక ఆత్మసాక్షాత్కారము. ఆత్మసాక్షాత్కారమందు ధ్యాతబ్రహ్మ విడుడవబడును నిధిధ్యాసనాతుల్యమైన సవికల్పసమాధి సంప్రజ్ఞాతసమాధియనబడును. అసంప్రజ్ఞాతసమాధియందున్న యోగి జీవన్ముక్తుడనబడును. అసంప్రజ్ఞాత సమాధియే ధర్మమేఘమని యోగశాస్త్రమందును 'శ్రు॥ క్షణమేకం క్రతుశతస్య చతుస్సప్తత్యాయత్ఫలం దదాప్నోతి' యని శ్రుతులయందు వినబడుచున్నది. జీవన్ముక్తుడు సమాధ్యవస్థనుండి స్వయముగా వ్యుత్థానము బొంది వ్యవహారము సల్పెడి యోగి విద్వద్వర్యుడనబడును. ఇతరుల ప్రయత్నముచే వ్యుత్థానము బొందెడి యోగి విద్వద్వరిష్ఠు డనబడును. సమాధినిష్ఠగలిగిన యోగి వ్యుత్థానకాలమందు ప్రారబ్ధకర్మలను విక్షేపరహితముగా అనుభవించుచు బ్రహ్మరతి గలిగియుండును. జీవన్ముక్తుడు ప్రారబ్ధవశమున గలిగెడి సుఖదుఃఖములయందు లాభాలాభములయందు జయాపజయములయందును హర్షవిషాదములబొందక సర్వము బ్రహ్మమాత్రదర్శనముచే ఆనందము బొందును. బ్రహ్మోపదేశము చేతను కృతార్థతబొందజేసిన వేదాంతగురువులను వేదాంతశాస్త్రమును అభినందించును. తన ధన్యత్వమును తలచుచుండును జీవన్ముక్తుడు 'అకర్తాహం అభోక్తాహం అసంగః పరమేశ్వరః శుద్ధబోధస్వరూపోహం కేవలోహం సదాశివః' యని సర్వాత్మభావనను బొంది బ్రహ్మానందము బొందుచుండును. ఆత్మహేయోపాదేయ రహితమనియు కర్తృత్వకారయితృత్వ భోక్తృత్వ భోజయితృత్వాదులు లేని స్వయంజ్యోతి స్వరూపుడని అనుసంధానముచేయుచుండును. అవ్యక్తాదిస్థూలదేహ స్థూలపదార్థపర్యంతము బ్రహ్మయందు ఆభాసమాత్రముగా ప్రతీతమగుచున్నదనియు ఆదిరహితమైన సూక్ష్మమై నిత్యమైన అద్వైత బ్రహ్మతత్త్వము నేననియు, సర్వాధారమై, సర్వవస్తుప్రకాశమైన ప్రపంచరహితమైన శుద్ధనిర్వికల్ప చిద్రూపుడనని అనుసంధానముచేయును. ఆత్మవిదుడు అపరిచ్ఛిన్నమైన బ్రహ్మదృష్టియందుండుటచే పరమార్థదృష్టియందు కార్యకరణ సంఘాతము ఆవృతుడువలె కనుబడినను తత్త్వవిదుని దృష్టి అఖండ చైతన్యము మాత్రమగుటచే నతడు సకల ప్రపంచా

తీతుడు. నాతనికి ప్రారబ్ధకర్మ వాస్తవానుభవము లేదు. ప్రారబ్ధకర్మ త్రివిధము ఐచ్ఛికము అనైచ్ఛికము పరేచ్ఛిక ప్రారబ్ధకర్మలందు స్వప్రయత్నములేదు. ఐచ్ఛిక ప్రారబ్ధకర్మలందు స్వప్రయత్నముజేసి అభీష్టములను పొందును కొందరు జీవన్ముక్తులు ఆకాశగమనాది సిద్ధుల నపేక్షించి వానిని సాధించెదరు ఆకాశగమనాది సిద్ధులు ఆత్మజ్ఞానమునకు నేమియు సహకారములుగాక ప్రతిబంధము లగుటచే కొందరు తత్త్వవిదులు వానిని అభ్యసింపరు. జీవన్ముక్తులు జ్ఞానసిద్ధికి పూర్వము శాస్త్రీయ మార్గమునందు శ్రద్ధగా ప్రవర్తించి నటుల ఆత్మసాక్షాత్కారము బొందియు శాస్త్రీయ మార్గమందు వారికి నేమి ప్రయోజనము లేక పోయినను లోక సంగ్రహణార్థమై ప్రవర్తించెదరు. జీవన్ముక్తుడు స్వాభావికము ప్రవర్తించెడి శాస్త్రీయమార్గము లోక సంగ్రహణార్థమగును. జ్ఞానాగ్నిచే సంచిత ఆగామి కర్మలు దహింపబడును ప్రారబ్ధకర్మ అనుభవముచే నశించును. ప్రారబ్ధ కర్మానుభవాంతమున జీవన్ముక్తుడైన బ్రహ్మవిదుడు విదేహముక్తిని బొంది వస్తుదేశ కాలాపరిచ్ఛిన్నమైన బ్రహ్మపదము బొందును ప్రారబ్ధకర్మ వర్తమాన శరీరముగాక ఇంకను శరీరములు కలుగచేసెడిదైనచో యా శరీరములు స్వీకరించిన తరువాత బ్రహ్మపదముబొందును సౌభర్యాది మహాయోగము యోగమహిమచే ప్రారబ్ధకర్మవశమున గలిగెడు అనేక శరీర భోగముల నొకపర్యాయ మనుభవించి నటుల పురాణములయందు వినబడుచున్నది. బ్రహ్మవిదుడు ప్రారబ్ధకర్మ భోగావసానమందు శ్రు॥ నతస్య ప్రాణా ఉత్క్రామంత్యత్రైవ సమవలీయంతే (బృ ఉ) ఇత్యాది శ్రుతుల ననుసరించి ప్రాణశబ్దముచే చెప్పబడిన లింగ శరీరము ఉత్క్రమణచేయక బ్రహ్మయందే లీనమై నశించును. బ్రహ్మవిదుని ఉపాధి నశించగనే ఘటాకాశము మహాకాశమగు నటుల పరిపూర్ణ సచ్చిదానంద రూపుడగును. ఇందులకు శ్రు॥ తస్యతావ దేవచిరం యావన్న విమోక్ష్యేఽథ సంపత్స్యే (ఛా 6-4-2) "భిద్యతే హృదయగ్రంథి ఛిద్యంతే సర్వ సంశయాః క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" "జ్ఞానం లబ్ధ్వా పరాంశాంతి మచిరేణాధి గచ్ఛతి (భ.గీ 4-39) ఇత్యాద్యనేక శ్రుతి స్మృతులు ప్రమాణము.

శ్రీ మాధవ విద్యారణ్యస్వామి విరచిత శ్రీ శంకర విజయదశమ సర్గాంతర్గత శ్రీ పద్మపాద గీత కు కౌండిన్యసగోత్రజ కృష్ణ యజుర్వేద తైత్తిరీయ శాఖాధ్యాయి బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాథశర్మ కృత ఆంధ్ర వివరణ సమాప్తము

ఓం మంగళం మహత్